




సూక్ష్మపోషకాలు
అందేనా!?

పంటల పెరుగుదలకు ప్రధాన పోషకాలతోపాటు సూక్ష్మ పోషకాలు ఎంతో ముఖ్యం. సాగు భూమిలో మట్టి పరీక్షలు చేయించుకోవడం వల్ల సూక్ష్మ పోషకాల లోపాలను గుర్తించి, అవసరమైన ఎరువులను వినియోగిస్తుంటారు. అయితే ఇది కొంత ఖర్చుతో కూడుకున్న విషయం. అయితే ఈ భారం రైతులపై పడకుండా ఉండేందుకు ప్రభుత్వాలు ఈ సూక్ష్మ పోషకాలైన జింకు, జిప్సం, బోరాన్‌లను సబ్సిడీపై రైతులకు అందుబాటులో ఉంచేవి. చిన్న, సన్నకారు రైతులకు వందశాతం సబ్సిడీతో అందించేవి. అయితే 2020-21 నుంచి నాటి వైసీపీ ప్రభుత్వం వీటి సరఫరాను పూర్తిగా నిలిపివేసింది. అసలే పెట్టుబడులు ఎక్కువై వ్యయప్రయాసలకు గురవుతున్న అన్నదాతకు ఇదో అదనపు భారంగా మారింది.

- నాడు వంద శాతం సబ్సిడీపై అందజేత
- వైసీపీ హయాంలో నిలిచిపోయిన పంపిణీ
- ప్రస్తుత ప్రభుత్వంపై అన్నదాతల ఆశలు

నెల్లూరు (వ్యవసాయం), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) :ప్రతి మొక్క తన జీవిత చక్రాన్ని పూర్తి చేసుకోవడానికి 19 మూలకాలను ఆహారంగా తీసుకుంటుంది. కొన్ని పోషకాలను ఎక్కువ మోతాదులోనూ మరికొన్నింటిని తక్కువ మోతాదులోనూ ఉపయోగించుకుంటుంది. తక్కువ మోతాదులో తీసుకునే పోషకాలను సూక్ష్మ పోషకాలు అంటారు. జింక్, ఇనుము, రాగి, మాంగనీసు, బోరాన్, మాలిబ్డినం, క్లోరిన్, సోడియం, వెనిడియం, సిలికాన్ వంటివి మొక్కకు సూక్ష్మ పరిమాణంలో అవసరం అవుతాయి. మొక్క పెరుగుదలతోపాటు దిగుబడులలో వీటి పాత్ర అత్యంత కీలకం. ఇవి లోపించినపుడు దిగుబడులు తగ్గుతాయి. జిల్లాలో ముఖ్యంగా జింకు, బోరాన్ లోపాల లక్షణాలు దాదాపు అన్ని నేలల్లో కనిపిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అదేవిధంగా క్షార గుణం ఉన్న నేలలు కూడా అధికంగా ఉన్నాయి. ఈ మూడు రకాల సూక్ష్మ పోషకాలను రాష్ట్ర ప్రభుత్వాలు నూరు శాతం సబ్సిడీతో చిన్న, సన్నకారు రైతులకు ఉచితంగా అంది

సంవత్సరం	సూక్ష్మ పోషకం	సీజన్	పంపిణీ (ఎంటీఎస్)	సీజన్	పంపిణీ (ఎంటీఎస్)
2018-19	జింక్ సల్ఫేట్ 21%	ఖరీఫ్	900	రబీ	735.79
	జిప్సం		5653.70		3555.4
	బోరాక్స్ 10.5%		0.316		8.919
	జింక్ సల్ఫేట్ 21%		0.091		8.096
	జింక్ సల్ఫేట్ 33%		0.337		8.339
	మొత్తం		6554.44		4316.544
2019-20	జింక్ సల్ఫేట్ 21%	ఖరీఫ్	38.00	రబీ	-
	జిప్సం		1519		226.75
	బోరాక్స్ 10.5%		0.355		-
	జింక్ సల్ఫేట్ 21%		1.813		-
	జింక్ సల్ఫేట్ 33%		1.324		-
	మొత్తం		1560.49		226.75

స్తాయి. అయితే 2019-20లో మాత్రం ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం మిగిలిన వారికి 70శాతం సబ్సిడీతో నాటి వైసీపీ సర్కారు అందించింది. అదికూడా నామమాత్రంగానే. ఈ ఏడాది 2020-21 నుంచి వాటి పంపిణీ ఊసే లేకుండా పోయింది. రైతులు వ్యవసాయ శాఖ కార్యాలయాల చుట్టూ తిరిగి వినతి పత్రాలు ఇవ్వడం మినహా అప్పటి పాలకుల నుంచి ఎలాం టి స్పందన లేకుండా పోయింది.

● గతంలో పంపిణీ ఇలా..

గత రెండేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో నామమాత్రంగానే సూక్ష్మపోషకాలను పంపిణీ చేసింది. 2018-19 ఖరీఫ్ సీజన్‌లో మొత్తం 6554.44 మెట్రిక్ టన్నులు, రబీ సీజన్‌లో 4316.544 మెట్రిక్ టన్నులు పంపిణీ చేసింది. వందశాతం సబ్సిడీతో రైతులకు అందించారు. అదేవిధంగా 2019-20 ఖరీఫ్ సీజన్‌లో కేవలం 1560.49 మెట్రిక్ టన్నులు, రబీలో జిప్సం 226.75 మెట్రిక్ టన్నులు మాత్రమే పంపిణీ చేసింది. ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం, మిగిలిన వారికి 70 శాతం సబ్సిడీకి అందించారు.

జింకు, జిప్సం లోపాలున్న భూములే ఎక్కువ



జిల్లాలో దాదాపు 76.5 శాతం భూముల్లో జింకు లోపం కనిపిస్తోంది. అదేవిధంగా 52శాతం భూముల్లో బోరాన్ తక్కువగా ఉంది. 68.5శాతం భూముల్లో భాస్వరం అధికంగా ఉంది. 53 శాతం భూమిలో సేంద్రీయ కర్బనం తక్కువగా ఉన్నాయి. పచ్చిరొట్ట, జీవన ఎరువులు వాడకం వల్ల ఇవి తగ్గుతాయి. రసాయనిక ఎరువులు అధికంగా వాడడం వల్ల జిల్లాలో 69 శాతం భూముల్లో నల్లచవుడు (క్షార) కనిపిస్తోంది. జిప్సం వాడకం ఎంతో అవసరం. రైతులు తప్పనిసరిగా మట్టి పరీక్షలు చేయించుకొని, అవసరమైన ఎరువులను వాడుకోవాలి. లేదంటే దిగుబడులపై ప్రభావం పడుతుంది. పెట్టుబడులు కూడా పెరిగే అవకాశం ఉంది.

- కన్నయ్య, ఏడీ, భూసార పరీక్ష కేంద్రం

రైతన్నపై అదనపు భారం

సాధారణంగా జింకు లోపం ఉన్న వరిపైరుకు ఎకరాకు 20కిలోలు, ఇతర పైర్లకు 10 కిలోలు చొప్పున జింకు సల్ఫేట్ వేస్తారు. ఈవిధంగా మూడు పైర్లకు ఒకసారి లేదా మూడేళ్లకొకసారి వేయాలి. కిలో జింకు సల్ఫేట్ దాదాపు రూ.50 నుంచి 60 వరకు మార్కెట్‌లో ధర ఉంది. ఎకరాకు 20 కిలోల చొప్పున దాదాపు రూ.600 ఖర్చవుతోంది. ఇంకా బోరాన్ లోపం నివారణకు ఎకరాకు 1 కిలో చొప్పున బోరాక్స్‌ను ఆఖరి దుక్కిలో వేస్తారు. దీని ధర కిలో దాదాపు రూ.120. అదేవిధంగా నల్లచవుడు (క్షార నేలలు) లక్షణాలున్న పొలంలో ఎకరాకి దాదాపు 200 కిలోల జిప్సం వేసి దున్నుతారు. వేరుశనగ సాగులో జిప్సం వాడకం ఎంతో ముఖ్యం. తాలుగింజలు లేకుండా కాయ ఊరడానికి, నూనెశాతం పెరగడానికి ఎకరాకి దాదాపు 200 కిలోలు జిప్సం వాడకం తప్పనిసరి. 50కిలోల జిప్సం బ్యాగు ధర దాదాపు రూ.200-220 ఉంటుంది. ఈలెక్కన ఎకరాకి దాదాపు రూ.800 అదనపు ఖర్చు. గతంలో ప్రభుత్వాలు దాదాపు రెండున్నర హెక్టార్ల వరకు ఉన్న చిన్న, సన్నకారు రైతులకు సబ్సిడీ ధరతో ఇచ్చేది. ఒక్కోసారి వంద శాతం సబ్సిడీతో అన్నదాతలకు ఇవ్వడంతో వారికి కొంత ఉపశమనంగా ఉండేది. అయితే వైసీపీ హయాంలో వీటిని పూర్తిగా నిలిపేయడంతో రైతులపై అదనపు భారం పడింది. ప్రస్తుత ప్రభుత్వమైనా సూక్ష్మపోషకాలు తిరిగి సబ్సిడీపై అందిస్తారని రైతులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు.



స్వాధీనం చేసుకున్న నకిలీ నోట్లను పరిశీలిస్తున్న నెల్లూరు రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు

నకిలీ కరెన్సీ రాకెట్ గుట్టురట్టు

- రూ.37.5 లక్షల నోట్లు స్వాధీనం
- మరో 22 కిలోల గంజాయి పట్టివేత
- వివరాలు వెల్లడించిన నెల్లూరు రూరల్ పోలీసులు

-8లో..

పోలీసులకే మస్కా!

- రక్షక భటులనే ట్రాప్ చేస్తున్న గ్యాంగ్‌లు
- సామాన్యులకు ఆశచూపి రూ.కోట్లు దోపిడీ
- నెల్లూరు, కావలిలో పెండింగ్‌లో కేసులు
- నాన్ బెయిలబుల్ కేసుల్లోనూ జరగని అరెస్టులు
- నెల్లూరు రూరల్ కేసులో రూ.6 లక్షల రికవరీ
- మిగిలిన డబ్బు ఇస్తామంటూ దొరకని వైనం

వివరాలు 8 లో..



ఆశ నిరాశే!

- జిల్లా లేదు.. రెవెన్యూ డివిజనూ లేదు!
- ఉదయగిరిలోని అన్ని మండలాలూ కావలిలోకి!
- మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సుపై మెట్టవాసుల్లో ఆగ్రహం



జిల్లాలో అతిపెద్ద నియోజకవర్గం ఉదయగిరి. దాదాపు 8 మండలాలతో కూడి, అన్నిరంగాల్లో వెనుకబడిన ఉదయగిరిని జిల్లా చేయాలన్న డిమాండ్‌తో ఈ ప్రాంతవాసులు ఉద్యమిస్తూనే ఉన్నారు. ప్రస్తుత ప్రభుత్వంపైనా ఆశలు పెట్టుకున్నారు. కానీ అనూహ్యంగా పెద్ద నియోజకవర్గాలను రెవెన్యూ డివిజన్ చేయాలని ఇటీవల మంత్రివర్గ ఉపసంఘం ప్రతిపాదించి అందుకు ఉదాహరణగా ఉదయగిరి పేరును ఉచ్చరించింది. దీంతో ప్రాంత వాసుల్లో ఆశలు రేకెత్తాయి. అయితే ఈ నెల 25న జరిగిన మంత్రివర్గ ఉపసంఘం భేటీలో కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు ప్రకటించి ఉదయగిరి పేరును ప్రస్తావించకపోవడంతో మెట్టప్రాంత ప్రజల్లో నిరాశ నిస్పృహలు నెలకొన్నాయి.

ఉదయగిరి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఉదయగిరి నియోజకవర్గంలోని 8 మండలాలను కావలి రెవెన్యూ డివిజన్‌లో కలపాలని ఇటీవల మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించడం దారుణమని ఈ ప్రాంత ప్రజలు మండిపడుతున్నారు. ప్రస్తుతం ఉదయగిరి, సీతారామపురం మండలాలు ఆత్మకూరు డివిజన్‌లోనూ, వరికుంటపాడు, కొండాపురం మండలాలు కందుకూరులోనూ, వింజమూరు, కలిగిరి, జలదంకి, దుత్తలూరు మండలాలు కావలి డివిజన్‌లో ఉన్నాయి. ప్రస్తుతం ఈ మండలాలను కావలి డివిజన్‌లో కలిపితే ఆయా మండలాలకు దూరం పెరుగుతోంది. దీంతో ఇటు ప్రజలు, అటు రైతులకు వ్యయప్రయాశలు పడడంతో పాటు సమస్యలకు పరిష్కారం దొరక్క, నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోదని పలువురు వాపోతున్నారు.

● ఇప్పుడే తేల్చాలంటున్న జనం

దశాబ్దాలు అభివృద్ధికి నోచుకోని ఉదయగిరి అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలంటే జిల్లా చేయడం ఒక్కటే మార్గమని జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో గత ఆరున్నరేళ్లుగా ఉద్యమం చేస్తున్నారు. కనీసం రెవెన్యూ డివిజన్ అయినా అయితే కొంతమేర అభివృద్ధి చెందడంతోపాటు ప్రజలు, రైతుల సమస్యలు తీరుతాయని జిల్లా సాధన సమితి నమ్మకం. ప్రస్తుత మంత్రివర్గ ఉపసంఘం కసరత్తులోనే ఉదయగిరి రెవెన్యూ డివిజన్ విషయం తేల్చాలంటున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో పలు మండలాల్లో పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం భూములు సేకరిస్తోంది. ఉదయగిరి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటైతే భూసేకరణ ప్రక్రియ త్వరగా పూర్తయ్యే అవకాశముంది. అలాగే ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలూ పరిష్కారమవుతాయి. ఇప్పటికైనా ఉదయగిరిని రెవెన్యూ డివిజన్ చేసేందుకు ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని, లేదంటే పోరాటాలు తప్పవని పలువురు పేర్కొంటున్నారు.

ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి

అభిప్రాయలు తెలిపేందుకు డిసెంబరు వరకు సమయం ఉన్నందున ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు చొరవ చూపితే ఉదయగిరి రెవెన్యూ డివిజన్ అవడం పెద్ద సమస్య కాదు. ఉదయగిరిని జిల్లా చేయాలని ఆరున్నరేళ్లుగా ఉద్యమం చేస్తున్నాం. ముఖ్యమంత్రులు, మంత్రులు, ఉన్నతాధికారులకు వినతులు సమర్పించాం. అయినా ఫలితం లేదు. కనీసం రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది.

- కె.వేణుగోపాల్, జిల్లా సాధన సమితి అధ్యక్షుడు

ఉద్యమాలు కొనసాగిస్తాం

కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల ఏర్పాటులో మంత్రివర్గ ఉపసంఘం ఉదయగిరి ప్రాంత ప్రజలను నిరాశపర్చింది. ఉదయగిరిని రెవెన్యూ డివిజన్ చేసేందుకు అన్ని అర్హతలు, వసతులున్నా పట్టించుకోకపోవడం దారుణం. ఉదయగిరిని జిల్లా చేయాలని ఏళ్ల తరబడి ఉద్యమం చేశాం. అయితే కనీసం ప్రభుత్వం రెవెన్యూ డివిజన్‌నైనా చేస్తుందన్న ఆశతో ఉన్నాం. దానిని ప్రభుత్వం నిరాశపర్చింది. ఉదయగిరి అభివృద్ధి కోసం ఉద్యమాలు కొనసాగిస్తాం.

- షేక్ దస్తగిరి అహ్మద్, జిల్లా సాధన సమితి నాయకులు

విభజనకు గజిట్ నోటిఫికేషన్ విడుదల

● 30 రోజులపాటు అభ్యంతరాల స్వీకరణ

నెల్లూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల విభజనకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నెల్లూరు జిల్లాలో చేపడుతున్న మార్పులను గజిట్‌లో ప్రచురించాలని కలెక్టర్‌ను ఆదేశించింది. నెల్లూరు జిల్లాలోని కందుకూరు నియోజకవర్గంలో ఉన్న కందుకూరు, వలేటివారిపాలెం, ఉలవపాడు, గుడ్లూరు, లింగసముద్రం మండలాలను ప్రకాశం జిల్లాలో కలిపేందుకు ప్రతిపాదించారు.



అలానే కందుకూరు డివిజన్‌లో ఉన్న ఉదయగిరి నియోజకవర్గంలోని కొండాపురం, వరికుంటపాడు మండలాలను కావలి డివిజన్‌లో కలిపనున్నారు. ఇక నెల్లూరు డివిజన్‌లో ఉన్న కలువాయి, రాపూరు, సైదాపురం మండలాలను తిరుపతి జిల్లాలో విలీనం చేస్తూ గూడూరు డివిజన్‌లో కలిపేలా ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనలపై ప్రజలకు అభ్యంతరాలు ఉంటే 30 రోజుల్లోపు కలెక్టర్‌కు సమర్పించేలా అవకాశం కల్పించారు. ఈ అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం తుది నిర్ణయం వెలువడుతుంది.

జనవరిలో పలు ప్రధాన రైళ్ల రద్దు

విశాఖపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే పరిధిలో గోదావరి-రాజమండ్రి, రాజమండ్రి-కడియం సెక్షన్లలో ఆధునికీకరణ నిర్మాణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో జనవరిలో పలు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేస్తున్నామని వాల్తేరు సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు. జనవరి 27న తిరుపతి-పూరి ఎక్స్‌ప్రెస్ (17480), 28న పూరి-తిరుపతి (17479), తిరుపతి-విశాఖ డబుల్ డెక్కర్ (22708); 28, 29 తేదీల్లో విశాఖ-లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్ (12805), మచిలిపట్నం-విశాఖ ఎక్స్‌ప్రెస్ (17219); 29న విశాఖ-తిరుపతి డబుల్ డెక్కర్ (22707), 29, 30 తేదీల్లో లింగంపల్లి-విశాఖ జన్మభూమి ఎక్స్‌ప్రెస్ (12806), విశాఖ-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ (17220), 28, 30 తేదీల్లో గుంటూరు-విశాఖ సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17239), 29, 31 తేదీల్లో విజయవాడ-విశాఖపట్నం రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ (12718), విశాఖపట్నం-విజయవాడ రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ (12717), విశాఖ-గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17240), రాజమండ్రి-విశాఖ మెము పాసింజర్ (67285), విశాఖ-రాజమండ్రి మెము పాసింజర్ (67286), జనవరి 31న గుంటూరు-విశాఖ డబుల్ డెక్కర్ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22876), విశాఖ-గుంటూరు డబుల్ డెక్కర్ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22575) రద్దు కానున్నట్టు పేర్కొన్నారు.



బంగాళాఖాతంలో అల్పపీడనం

● రేపటి నుంచి మూడు రోజులు వర్షాలు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో మరో అల్పపీడనం కారణంగా జిల్లాలో ఈనెల 29, 30, డిసెంబరు 1 తేదీలలో వర్షాలు పడే అవకాశం ఉందని జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. వర్షాలకు ముందస్తు జాగ్రత్తలపై కందుకూరు సబ్ కలెక్టర్, ఆర్డీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్‌లు తదితరులతో గురువారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సహాయ కేంద్రాలలో మరమ్మత్తులు చేయించాలన్నారు. అత్యవసరమైతే తప్ప ఎవరికీ సెలవులు మంజూరు చేయరని స్పష్టం చేశారు.

త్వరలో డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక

8

● ఏఐసీసీ పరిశీలకుడు, తమిళనాడు ఎమ్మెల్యే హసన్ మౌలానా

బడిపిల్లలకు రవాణా భత్యం

ప్రభుత్వ స్కూళ్లలో హాజరు పెంచడమే లక్ష్యం

1380 మంది విద్యార్థులకు రూ.41.40లక్షలు విడుదల

- వివరాలు 8లో..

నెల్లూరు మేయర్ అభ్యర్థిగా సుజాత?

అధికార టీడీపీలో దాదాపుగా ఖరారు

నెల్లూరు(సిటీ), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అధికార టీడీపీ నుంచి నెల్లూరు మేయర్ అభ్యర్థిగా దేవరకొండ సుజాత పేరును దాదాపుగా ఖరారు చేసినట్లు సమాచారం. ఈ మేరకు గురువారం ఆ పార్టీ ముఖ్యనేతలంతా టెలీకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుకున్నారని, ఆమెనే మేయర్ అభ్యర్థిగా నిలపాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. అత్యంత విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు గిరిధర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌తో పాటు ఎంపీ వీపీఆర్ నుంచి స్పష్టమైన నిర్ణయం తీసుకుని సుజాత పేరును ఖరారు చేసినట్లు తెలిసింది. ప్రస్తుత మేయర్ పొట్లూరి స్రవంతిపై అవిశ్వాసం ప్రకటించిన కార్పొరేటర్లు, దీనికి సంబంధించి త్వరలో జరిగే ప్రత్యేక సమావేశంలో ఆమెను పదవి నుంచి దించాలనే ప్రయత్నంలో ఉన్నారు. ఆపై నూతన మేయర్‌గా సుజాత పేరును ప్రకటించే అవకాశాలున్నాయి. నగర మేయర్ సీటు ఎస్టీ జనరల్ కేటగిరి కింద ఉండటంతో మహిళకు ప్రాధాన్యతనివ్వాలని నిర్ణయించిన టీడీపీ ఆ మేరకు 53వ డివిజన్ కార్పొరేటర్‌గా ఉన్న సుజాతను తదుపరి మేయర్‌గా ఎన్నిక చేయనున్నది. అత్యధిక సీట్లు, ఓట్లు టీడీపీకే ఉండటంతో ఈ ఎన్నిక లాంఛనమైంది.



సంగం బ్యారేజీకి తగ్గిన నీటి ప్రవాహం

సంగం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సంగం బ్యారేజీకి సోమశిల జలాశయం నుంచి వస్తున్న నీటి ప్రవాహం గురువారం 28 వేల క్యూసెక్కుల నుంచి 11 వేల క్యూసెక్కులకు తగ్గింది. వస్తున్న ప్రవాహం తగ్గినా నీటిమట్టం 11 అడుగులకు తగ్గకుండా స్థిరీకరించి కనిగిరి రిజర్వాయర్‌కు 970 క్యూసెక్కులు, బెజవాడ పాపిరెడ్డి కాలువకు 800, కనుపూరు కాలువకు 410, నెల్లూరు చెరువు కాలువకు 130, దువ్వూరు కాలువకు 30, నెల్లూరు తాగునీటి పథకానికి 40 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. మిగిలిన నీటిని 9 గేట్లు ఎత్తి బ్యారేజ్ దిగువకు విడుదల చేస్తున్నారు.

● సోమశిలలో 72.744 టీఎంసీల నిల్వ

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి గురువారం 7,287 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగింది. ప్రాజెక్టులో 72.744 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ ఉత్తర కాలువకు 400, డెల్టాకు 10,150, కండలేరుకు 2,000 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.



కండలేరు జలాశయం నీటి నిల్వ 57.88 టీఎంసీలు

రాపూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కండలేరు డ్యాం నీటి నిల్వ సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి మట్టం 57.88 టీఎంసీలు ఉందని ఏఈ అనిల్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుండి 1900 క్యూసెక్కుల నీరు ఇన్ ఫ్లో వస్తుండగా, 1080 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో వెళుతోందని అధికారులు పేర్కొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 12077
వెండి కిలో ధర	రూ. 163600
వెండి ఒక గ్రాము	రూ. 168.60

వర్షాకాలం ముగియగానే బ్రిడ్జి నిర్మాణం

'ఆంధ్రజ్యోతి'కి స్పందన

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బ్రిడ్జి నిర్మాణం, ఆకృతులకు సంబంధించిన అనుమతులు ఆమోదం పొందినట్లు నెల్లూరు డ్రైనేజీ డివిజన్ కార్యనిర్వాహక ఇంజనీరు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత నెల 12న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'మలిదేవి ఆధునీకరణ కలేనా...?' అనే కథనానికి ఆయన స్పందించారు. బుచ్చి పెద్దూరు వద్ద, ఇస్కపాళెం పంచాయతీ పల్లాప్రోలు వెళ్లే మార్గంలో ఉన్న బ్రిడ్జిలు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. మలిదేవి కాలువ పూడిపోయి నీరు వెళ్లే మార్గం లేక రైతాంగం నష్టపోవలసివస్తోంది. దీంతో కోవూరు డ్రైనేజీ సబ్ డివిజన్ డీఈఈ ఉన్నతాధికారులకు లేఖ పంపించారు. వర్షాకాలం ముగిసిన వెంటనే బ్రిడ్జి నిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

పూర్వ ఉపాధ్యాయిని ఆర్థిక సాయం

కోవూరు, నవంబరు 27, (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో గతంలో సంగీత ఉపాధ్యాయినిగా పనిచేసిన కమతం అనూరాధ గురువారం విద్యార్థినులకు ఆర్థిక సహాయం అందించారు. 11 మంది పేద విద్యార్థినులకు ఒక్కొక్కరికి రూ 10,000 ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయిని సోఫియా కిరణ్మయి మాట్లాడుతూ అనూరాధ తన తండ్రి వీరాస్వామి జ్ఞాపకార్థం ఆర్థిక సాయం అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అనూరాధ, ప్రసాదరావు దంపతులను ఘనంగా సన్మానించారు.

ఘనంగా ఓరియంటేషన్ డే

కొడవలూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) :కొడవలూరు పంచాయతీ పరిధిలోని శ్రీవెంకటేశ్వర కాలేజీ ఆఫ్ ఫార్మసీలో ఓరియంటేషన్ డే గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ పీ గుణశేఖర్ మాట్లాడుతూ ఫార్మసీకి భవిష్య త్తులో మంచి డిమాండ్ ఉంటుందన్నారు. నెల్లూరు మెడికవర్ హాస్పిటల్స్ సెంటర్ హెడ్ లావణ్య అరోళ్ల మాట్లాడుతూ ఆరోగ్య రం గంలో ఫార్మసీ విద్యార్థుల పాత్ర కీలక మన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సీ. మాధవీలత, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు

కోవూరు, నవంబరు 27, (ఆంధ్రజ్యోతి): స్థానిక జేబీఆర్ ఉన్నతపాఠశాలలలో జనవిజ్ఞానవేదిక నాయకులు గురువారం రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. 400 మంది విద్యార్థులకు కార్డులు అందించారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞానవేదిక రాష్ట్ర అధ్యక్షుడు కే శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్కే. గౌస్ బాష, ప్రధాన కార్యదర్శి పీ బాలకోటేశ్వరరావు, నాయకుడు వీ చక్రపాణి, ప్రధానోపాధ్యాయుడు పీ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో విద్యుదాఘాతం



కాలిపోయిన సామగ్రి

కోవూరు, నవంబరు 27, (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాటూరులో మహాలక్ష్మి ఆలయంలో బుధవారం రాత్రి విద్యుదాఘాతం సంభవించడంతో వస్తువులు కాలిపోయాయి. భక్తులు సమర్పించిన పట్టు చీరలు, పూజా సామాగ్రి, ఇన్వర్టరు పూర్తిగా కాలడంతో సుమారు రూ. 3 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు తెలిసింది. ఈ విషయమై కోవూరు పోలీసులకు సమాచారం అందలేదు.

ఆలయాల భూములకు వేలం పాటలు



వేలం పాట నిర్వహిస్తున్న అధకారులు

విడవలూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పార్లపల్లి గ్రామంలో వెలసివున్న ఆళఘనాథస్వామి, కైలాసనాథస్వామి అల యాలకు చెందిన 58 ఎకరాలను మూడు సంవత్సరాలు కౌలుకి ఇచ్చేందుకు గురువారం ఆలయ చైర్మన్‌లు ఉచ్చూరు సుధీప్‌రెడ్డి, ఏహూరు లలితమ్మ, ఆలయ ఈవో మోహన్‌కుమార్‌ల ఆధ్వర్యంలో వేలం పాటలను నిర్వహించారు. భూములను కుడుముల రాజేష్, నాగభూషణం, సుబ్బారెడ్డి, సాయికుమార్‌రెడ్డి, మాధవ్ తదితరులు రూ.20.6 లక్షలకు పాడారు. ఈ కార్యక్రమలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రాజు, సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం

- చోద్యం చూస్తున్న అధికారులు

కొడవలూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. వర్షాకాలంలో పల్లెల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాల్సిన పంచాయతీ అధికారులు, సిబ్బంది పట్టించుకోని దుస్థితి ఏర్పడింది. గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయింది. ఇటీవల కురిసిన వర్షానికి చెత్త తడిసిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. పారిశుధ్యం మెరుగుపరిచే చర్యలు చేపట్టాల్సిన పంచాయతీ పాలక వర్గాలు, కార్యదర్శులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

● ప్రబలుతున్న వ్యాధులు..

ఇటీవల వర్షాలు కురవడంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. విష జ్వరాలతో చిన్నారుల నుంచి పెద్దల వరకు తాము వ్యాధులబారిన పడతామేమోనని ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో వెంటనే గ్రామాల్లో చెత్త తొలగించడంతోపాటు మురుగునీటిని బయటకు పంపి బ్లీచింగ్ చల్లాలని ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చినా సిబ్బంది పట్టించుకోలేని దుస్థితి మండలంలో నెలకొంది. నాయుడు పాలెం, రేగడిచెలిక, మానేగుటపాడు, రెడన్డిపాలెం, రాచర్లపాడు, యల్లాయ పాలెం, పద్మనాభసత్రం, దామేగుంట పంచాయతీల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉంది. ఈ గ్రామాల్లో వర్షాలకు మురుగు నీరు పోయే దారిలేక రోడ్లపైనే నిల్వ ఉంటోంది. ఫలితంగా వీధుల్లో దుర్గంధం వెదజల్లుతోంది. ముఖ్యంగా దామేగుంట గ్రామంలో రోడ్డు వేశారు. కానీ డ్రైన్లు మరిచారు. ఇంటిలో మురుగునీరు రోడ్డుపై చేరి దోమలు వ్యాప్తి చెందిన ప్రజలు అల్లాడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మంచి నీటి కుళాయి చుట్టూ మురుగునీరు

మాక్ అసెంబ్లీలో పూజిత ప్రతిభ అభినందనీయం



పూజితను అభినందిస్తున్న అదానీ ఫౌండేషన్ ప్రతినిధులు

ముత్తుకూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అమ రావతిలోని శాసనసభ ప్రాంగణంలో జరిగిన మాక్ డ్రిల్ అసెంబ్లీలో సర్వేపల్లి నియోజక వర్గానికి ప్రాతినిధ్యం వహించిన 9వ తరగతి విద్యార్థిని కారిపాక పూజితను కృష్ణపట్నం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అదానీ ఫౌండేషన్ ఉతాన్ ఎడ్యుకేటర్స్ బుధవారం సత్కరించారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి ఏకైక విద్యార్థి కె.పూజిత వెనుకబడిన తరగతి (బీసీ) సంక్షేమ మంత్రిగా మాక్ అసెంబ్లీలో ప్రసంగించారు. మాక్ అసెంబ్లీ సెషన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 175 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చంద్ర బాబు, మంత్రి లోకేష్‌లతో పాటు విద్యార్థులు, ఎమ్మెల్యేలు, మంత్రులు, స్పీకర్ పాత్రలను పోషించారు. ప్రధానోపాధ్యాయురాలు సరళ, అదానీ ఫౌండేషన్ ఉతాన్ ఎడ్యుకేటర్స్ ప్రసంగాన్ని సిద్ధం చేసి సర్వేపల్లి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించడానికి పూజితను సన్నద్ధం చేశారు. అదానీ కృష్ణపట్నం పోర్టు సీఈవో జగదీష్ పటేల్ పూజితను అభినందిస్తూ ఈ కార్యక్రమం విద్యార్థులలో నాయ కత్వ లక్షణాలు, పౌర నైపుణ్యాలను పెంపొందిస్తుందన్నారు.

పనిచేసిన వారికే పదవులు

తమిళనాడు కాంగ్రెస్ ఎంపీ సుధా రామకృష్ణన్



మాట్లాడుతున్న మైలాదత్తూరు ఎంపీ సుధారామకృష్ణన్

మనుబోలు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీకోసం పనిచేసేవారికి తప్పనిసరిగా భవిష్యత్తులో పదవులు ఉంటాయని తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకురాలు తమిళనాడు కాంగ్రెస్ ఎంపీ సుధా రామకృష్ణన్ అన్నారు. స్థానిక పద్మావతి కల్యాణ మండపంలో గురువారం సర్వేపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త బళ్ళ హరి ఆధ్వర్యంలో సంస్థాగత నిర్మాణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సమావేశంకు వచ్చిన ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ అన్నారు. రాష్ట్రంలో భవిష్యత్తు కాంగ్రెస్‌దేనన్నారు. దేశవ్యాప్తంగా రాహుల్‌గాంధీ చేపట్టిన సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమాన్ని కార్యకర్తలు ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ చింతామోహన్, తిరుపతి జిల్లా ఇన్‌చార్జి డీసీసీ బాల గురవబాబు, ఏపీ సీసీ అజర్ ఫర్, మదన్‌మోహన్, పాల్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప గ్రామోత్సవం

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడలో గురువారం అయ్యప్పస్వామి దీక్షాపరుల గ్రామోత్సవం (ఊరేగింపు) భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా జరిగింది. సుమారు 20మంది స్థానిక అయ్యప్ప దీక్షాపరులు, ఇతర ప్రాంతాలకు చెందిన పలువురు గురువారం శబరిమల యాత్రకు జొన్నవాడ నుంచి బయలుదేరారు. జొన్నవాడ ఆలయంలో అయ్యప్ప దీక్షాపరులు ఇరుముడులు ధరించి గ్రామంలో ఊరేగింపులో అయ్యప్ప నామాలు, భజనలతో గ్రామోత్సవం మార్మోగింది. భక్తులు దీక్షాపరుల పాదపూజలు చేసి వారికి పండ్లు, కానుకలు సమర్పించుకున్నారు.

ఎంసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యూనిఫాం పంపిణీ

రాపూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాపూరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఎంసీ ఫౌండేషన్ నిర్వాహకులు జిల్లా సెంట్రల్ బ్యాంకు చైర్మన్ మెట్టుకూరి ధనుంజయ రెడ్డి చేతుల మీదుగా స్థానిక చెన్ను గార్డెన్స్‌లో యూనిఫాం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెంచలకోన మాజీ చైర్మన్ చెన్ను తిరుపాల్ రెడ్డి, మండల అధ్యక్షులు చెన్ను అశోక్ రెడ్డి, సొసైటీ చైర్మన్ దందోలు వెంకటేశ్వర్లు రెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. హనుమంతయ్య, అధ్యాపకులు వసంత రావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను వేధించడం తగదు



మాట్లాడుతున్న రెహనా బేగం

కోవూరు, నవంబరు 27, (ఆంధ్రజ్యోతి): కోవూరు సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తల్ని సీడీపీఓ శారద వేధిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ మహిళా సంఘం జిల్లా కార్యదర్శి రెహనాబేగం అన్నారు. స్థానిక సీతాపోలయ్య భవనంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సీడీ పీఓ వ్యవహార శైలిపై అంగన్‌వాడీ కార్యకర్తలు తీవ్ర అసహనంతో ఉన్నార న్నారు. ఆమె సిబ్బందితో అసభ్యంగా మాట్లాడుతున్నారని చెప్పారు. అంగన్ వాడీ కార్యకర్తల్ని మానసికంగా హింసిస్తున్నారని చెప్పారు. సీడీపీఓ వ్యవ హారంపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు సుజాత, శేషమ్మ, సీఐటీయూ నాయకులు అఫ్రోజ్, బుజ్జయ్య, శేషయ్య మాట్లాడారు.

జనరల్ ఫిజీషియన్‌గా డాక్టర్ రాజేశ్వరి



డాక్టర్ రాజేశ్వరి

పొదలకూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పొదలకూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో జనరల్ ఫిజీషియన్‌గా డాక్టర్ రాజేశ్వరి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ప్రతిరోజు పొదలకూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఓపీ సేవల్లో అందుబాటులో ఉంటారు. నూతనంగా విధుల్లో చేరిన ఆమెను ఆసుపత్రి సిబ్బంది, సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్ అభినందనలు తెలిపారు. మండల ప్రజలు బీపీ, షుగర్, పక్షవాతం, అన్ని రకమైన విషజ్వరాలు, థైరాయిడ్, పాముకాటు, పాయిజన్ కేసులకు ఆమె చికిత్స అందిస్తారని, ప్రజలు వినియోగించుకోవాల్సిందిగా పొదలకూరు సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రసాద్ తెలిపారు.

కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా చేవూరు నారాయణ



వినయ్ నారాయణను సత్కరిస్తున్న యువకులు

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు, పెనుబల్లి ఎంపీటీసీ చేవూరి వినయ్ నారాయణ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నాయకులు, అభిమానులు వినయ్ నారాయణను శాలువాతో సత్కరించారు.

రాపూరులో థీమ్-5 క్లీన్ అండ్ గ్రీన్‌పై శిక్షణ



శిక్షణలో పాల్గొన్న సభ్యులు

రాపూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీవో మారెళ్ల భవాని ఆధ్వర్యంలో థీమ్-5 క్లీన్ అండ్ గ్రీన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 118 మంది సభ్యులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్ర మంలో మండలంలో చెత్త శుభ్ర తకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించామని ఎంపీడీవో భవా ని తెలిపారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి దశరథ రామ య్య, పొదుపు సంఘాల వీవోఏ లు, సీఆర్పీలు పాల్గొ న్నారు.

హెల్మెట్ ధరించి.. ప్రాణాలు కాపాడుకోండి



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శివరాకేష్

మనుబోలు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దిచక్ర వాహనం నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించి, ప్రమాదాల నుంచి ప్రాణాలు కాపాడు కోవాలని ఎస్ఐ శివ రాకేష్ అన్నారు. క్రాస్ రోడ్డు, పోర్టు క్రాస్‌రోడ్లు వద్ద గురువారం యువకులకు, హెల్మెట్ లేకుండా దిచక్రవాహనాలు నడిపేవారికి రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే కాకాణి పరామర్శ

మనుబోలు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని మడమనూరు గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త రవీంద్రబాబు అకాల మరణం చెందారు. దీంతో ఆయన కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం పరామర్శించారు. అలాగే చెర్లోపలిలో మరో కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించారు.

కల్యాణ మండపం నిర్మాణానికి భూమిపూజ

ఆత్మకూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాల్టీ పరిధిలోని మినీ బైపాస్ రోడ్డు సమీపంలో ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న కల్యాణ మండపానికి గురువారం భూమిపూజ చేశారు. సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, నిత్యాన్నదాత కంచి పరమేశ్వర రెడ్డి పూజలు నిర్వహించారు.

హమ్మయ్యా.. తాగునీటి కొరత తీరింది!

విడవలూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నిరుపయోగంగా ఉండే వాటర్ ట్యాంక్ కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి చొరవతో వినియోగంలోనికి రావటంతో వావిళ్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 2019లో సుమారు రూ.22 లక్షలు వ్యయంతో టీడీపీ ప్రభుత్వం పాలనలో ఉప్పలపాడు వద్ద వాటర్ ట్యాంకుని నిర్మించారు. ఆ తరువాత వైసీపీ అధికారంలోనికి రావటంతో వాటర్ ట్యాంకుకి ఎటువంటి పైపు లైన్లు ఏర్పాటు చేయ్యలేదు. దీంతో వాటర్ ట్యాంకు నిరుపయోగంగా మారింది. గ్రామ ప్రజలు త్రాగునీటికి ఇబ్బందులు తలెత్తాయి. పంచాయతీ కొళాయిలకు ఒక్క పూట నీరు వస్తే మరో పూట వచ్చేది కాదు. ప్రజలు నానా అగచాట్లు పడాల్సివచ్చింది.

వినియోగంలోనికి వాటర్ ట్యాంకు: ఉప్పల పాడు వద్ద నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంకుని వినియోగంలోనికి తీసుకొచ్చేందుకు స్థానిక టీడీపీ నాయకులు ఏటూరు హరిరెడ్డి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకుని వచ్చారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే వాటర్ ట్యాంకు పైప్ లైన్ల ఏర్పాటునకు పీఎం జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా నిధులను మంజూ రు చేయించారు. దీంతో అధికారులు సుమారు రూ.10 లక్షల వ్యయంతో వాటర్ ట్యాంకు నుంచి ఉప్పలపాడు, గిరిజన సంఘం, వావిళ్ల సెంటర్, కోళ్ళఫారమ్ ప్రాంతాలకు నీటి పైపు లైన్లను వేశారు.

200 కుటుంబాలకు లబ్ధి : గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా వాటర్ ట్యాంకు నిరుపయోగంగా ఉండటంతో సుమారు 200 మంది కుటుంబాలు తాగునీటికి ఇబ్బందులు పడేవారు. నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంకుని వినియోగంలోనికి తేవటంతో వీరికి తాగునీటి కష్టాల నుంచి విముక్తి కలిగింది.



ఉప్పలపాడు వద్ద ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకు

ఎమ్మెల్యే చొరవతోనే..: ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి చొరవ తీసుకోవటంతో నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంకు ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తీరాయి.

- ఏటూరు హరిరెడ్డి, టీడీపీ నాయకులు

C.R.I.M.E N.E.W.S

నకిలీ కరెన్సీ రాకెట్ గుట్టురట్టు

- రూ.37.5 లక్షల నోట్ల స్వాధీనం
- నలుగురితోపాటు 22 కేజీల గంజాయి పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న రూరల్ డీఎస్పీ

నెల్లూరురూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరురూరల్ పోలీసుల సారథ్యంలో నకిలీ కరెన్సీ నోట్ల మార్పిడి భారీ రాకెట్‌ను రట్టు చేశారు. గుట్టుచప్పుడు కాకుండా నడుస్తు ఈ బాగోతాన్ని బట్ట బయలు చేసి నలుగురు నిందితులతోపాటు భారీగా గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఆ వివరాలను రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ గుంజి వేణులు గురువారం రూరల్ పోలీసు స్టేషన్‌లో వివరించారు. నెల్లూరురూరల్లోని ధనలక్ష్మీపురం సమీపాన సాయి శ్రీసిటీ లేఅవుట్ 8వ క్రాస్ రోడ్డు వద్ద ఓ ఇంట్లో గంజాయి, నకిలీ కరెన్సీ నోట్ల మార్పిడి జరుగుతున్నట్లు అందిన సమాచారంతో పోలీసులు రెక్కీ నిర్వహించారు. అల్లూరు మండలం ఇస్కపల్లి పంచాయతీ కుర్రులబ్బిపాళెంకు చెందిన ప్రధాన నిందితుడు మున్నా అలియాస్ అశోక్‌రెడ్డి అలియాస్ కార్తీక్‌రెడ్డిను పట్టుకునే ప్రయత్నం చేయగా పరారయ్యాడు. అతడ్ని వెంబడించిన పోలీసులు కొంతదూరం వెళ్లాక అదుపులోకి తీసుకున్నారు. మున్నా ఇచ్చిన సమాచారంతో ధనలక్ష్మీపురం వద్దనున్న ఇంటిపై రైడ్ చేయగా అప్పటికే ఆ ఇంట్లో ముత్తుకూరు బీసీ కాలనీకి చెందిన షేక్ రియాజ్, షేక్ ముస్తఫా, పిడతాపోలూరుకు చెందిన బెల్లంకొండ అనిల్ ఉండటాన్ని పోలీసులు గమనించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఇళ్లంతా సోదాలు చేయగా మార్పిడికి సిద్ధంగా ఉంచిన రూ. 37.50 లక్షల నకిలీ కరెన్సీ నోట్లు, ప్యాకెట్ల తయారీకి సిద్ధంగా ఉంచిన 22కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మరో 3కేజీల గంజాయిని అప్పటికే అమ్మేసినట్లు విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు. యూపీ 16 ఏవై 8088 నెంబరు గల జాగ్వార్ కారును స్వాధీనం చేసుకోవాల్సి ఉండగా, కొన్ని స్కూటర్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అత్యంత రహస్యంగా ఈ రాకెట్‌ను నడుపుతున్నారని, దీనిని చాకచక్యంగా పట్టుకున్నట్లు డీఎస్పీ, సీఐలు వెల్లడించారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

● గతంలో ఇక్కడే డ్రగ్స్ తయారీ ముఠా గుర్తింపు

కొన్ని నెలల క్రితం ధనలక్ష్మీపురం సమీపాన (కలివెలపాళెంకు వెళ్లేదారి) డ్రగ్స్ తయారీ ముఠాను పోలీసులు పట్టుకున్నారు. తిరుపతి జిల్లా గూడూరుకు చెందిన కొందరు వ్యక్తులు ఈ ప్రాంతంలో ఇల్లు అద్దెకు తీసుకుని డ్రగ్స్ తయారీకి అవసరమైన ముడిసరుకును తీసుకువచ్చి తయారు చేస్తున్న క్రమంలో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. అప్పట్లో ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. తాజాగా భారీ మొత్తంలో నకిలీ నోట్లు, గంజాయి పట్టుబడటం గమనార్హం. నగరానికి శివారున ఉండటం, పోలీసు నిఘా తక్కువగా ఉందన్న అంచనాలతో నేరస్థులు ఈ ప్రాంతాన్ని ఎక్కువగా ఎంచుకుంటున్నారని స్థానికులు చెప్పుకొచ్చారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఉత్తరాఖండ్ వలస కూలీ మృతి

- ఎమ్మెల్యే సురేష్ ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

జలదంకి, నవంబర్ 27 (ఆంధ్రజ్యోతి): జలదంకి మండలం 9వ మైలు సమీపంలో 167 బీజీ జాతీయ రహదారిపై గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉత్తరాఖండ్ రాష్ట్రానికి చెందిన వలసకూలీ దుక్కీ రామ్‌రాయ్ (45) మృతి చెందాడు. వరినాట్లు వేసేందుకు వలసకూలీలుగా ఉత్తరాఖండ్‌కు చెందిన 20 మంది 9వ మైలుకు వచ్చారు. ఉదయం నాట్లు వేసేందుకు పొలంలోకి వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో దుక్కీ రామ్‌రాయ్ రోడ్డుమార్జిన్‌లో కింద వేసి ఉన్న విద్యుత్ స్తంభాలపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనస్థలంలో వలసకూలీలు బోరున విలపించారు. సమాచారం అందుకున్న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అక్కడికి చేరుకుని మృతిచెందిన దుక్కీ రామ్‌రాయ్ మృతదేహాన్ని పరిశీలించారు. కూలీలకు ధైర్యంచెప్పి మృతదేహం తరలింపునకు మృతుడి కుటుంబానికి రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. వలస కూలీని ఢీకొన్న వాహనాన్ని స్వాధీనం చేసుకుని, నిందితుడిని శిక్షించాలని ఎమ్మెల్యే పోలీసులను ఫోన్‌లో ఆదేశించారు. అనంతరం కూలీ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు.

కృష్ణపట్నం తీరంలో మృతదేహం గుర్తింపు

ముత్తుకూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కృష్ణపట్నం సముద్రతీరంలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. అలల తాకిడికి తీరానికి మృతదేహం కొట్టుకొచ్చింది. స్థానికుల సమాచారంతో కృష్ణపట్నం ఎస్ఐ జేపీ శ్రీనివాసులురెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు 45 సంవత్సరాల పైన ఉండవచ్చని, కుడిచేతికి నల్లని దారం ధరించి ఉన్నాడన్నారు. నాలుగైదు రోజుల క్రితం మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రెండుచోట్ల రోడ్డు ప్రమాదాలు

- పలువురికి గాయాలు

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై రెండు వేర్వేరు ప్రాంతాల్లో గురువారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాల్లో పలువురు గాయపడ్డారు. బుచ్చి పట్టణంలోని రాజకిషోర్ థియేటర్ సెంటర్ వద్ద రోడ్డు పక్కన ఆగివున్న ఆటోను వెనుకనుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో ఆటో ముందున్న పాల వ్యానును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఓ మహిళ కాలికి తీవ్ర గాయమైంది. టోల్‌గేట్ వద్ద ముందు వెళ్తున్న ఆటో, బైకును వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టడంతో ఆటో బోల్తా పడింది. దీంతో ఆటోలో ఉన్న ముగ్గురిలో ఒకరికి, స్కూటరిస్టుతోపాటు, కారు డ్రైవర్‌కు గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సెల్ టవర్ రేడియో యూనిట్ చోరీ

నెల్లూరు(క్రైం), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఎయిర్‌టెల్ సెల్ టవర్ లోని రిమోట్ రేడియో యూనిట్‌ను గుర్తుతెలియని దొంగలు దోచుకెళ్లారని వేదాయపాలెం పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.... నెల్లూరు రూరల్ సౌత్‌మోపూరుకు చెందిన రాపూరు కాళయ్య ఇన్‌డూస్ టవర్స్ సంస్థలో ఎస్‌అండ్‌ఐబీ సెక్యూరిటీ కంపెనీ తరఫున జిల్లాలోని టవర్స్‌కు పెట్రోలింగ్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు. నెల్లూరు నగరంలోని డ్రైవర్సు కాలనీ బిట్-2 వద్ద ఉన్న ఎయిర్‌టెల్ టవర్‌లో ఉన్న రిమోట్ రేడియో యూనిట్‌ను ఈ నెల 19వ తేదీ రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. ఈ విషయాన్ని ఎఫ్ఎస్ఈ హనుమంతురావు గుర్తించి కాళయ్యకు సమాచారం అందించారు. దీంతో అతను టవర్‌ను పరిశీలించి ఉన్నతాధికారులకు తెలిపారు. గురువారం వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.



అలరించిన అష్టావధానం

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వేద సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని స్థానిక టీవీఎస్ కల్యాణ సదన్‌లో బ్రహ్మశ్రీ అరవిత్తూరు విశ్వనాథ శ్రోతుల 105వ జయంతి సభలు ఆయన శిష్య బృందం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. మాచవోలు భాస్కరశర్మ, బండాత్మకూరు చంద్రశేఖర నాగభూషణ శర్మ ఆధ్వర్యంలో ఉదయం గణపతిపూజ, కలశపూజ, సాయంత్రం వరకు సామవేద పారాయణం, తదుపరి శాస్త్రీయ సంగీతం, కచేరీ జరిగాయి. శతావధాని కొండేపి మురళీకృష్ణ అష్టావధానం అందరినీ అలరించింది.

'వాత్సల్య'కు సరుకులు

● నవ దంపతుల వితరణ



నెల్లూరు(హరనాథపురం), నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : వైద్యశాఖలో పనిచేస్తూ ఇటీవల వివాహం చేసుకున్న పీ మౌనిక, బీ శివకుమార్ దంపతులు గురువారం నగరంలోని వాత్సల్య అనాథ శరణాలయానికి నిత్యావసర సరకులు అందచేశారు. చిన్నారులకు బిస్కెట్లు, చాక్లెట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు మాట్లాడుతూ అనాథ శరణాలయానికి రూ.20 వేల సరుకుల వితరణ అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వాత్సల్య ఆర్గనైజింగ్ కార్యదర్శి జీవీ సాంబశివరావు, మానవ సేవయే మాధవ సేవ టీమ్ నిర్వాహకులు అరవ పరిమళ, జీవీ పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పోలీసు స్టేషన్ సందర్శన

నెల్లూరు రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కసుపర్తిపాడు వద్దనున్న ఇథాకా స్కూల్ విద్యార్థులు గురువారం నెల్లూరు రూరల్ పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. అక్కడ పోలీసుల పనితీరు, నేరస్తుల విచారణ తదితర అంశాలను వారికి పోలీసులు తెలియచేశారు. సీఐ వేణు మాట్లాడుతూ మీరంతా ప్రతీ ఒక్కరి జీవితాన్ని మార్చేది చదువేనని, ఇష్టంగా చదువుకుని లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ లక్ష్మణరావు, టీచర్లు పాల్గొన్నారు.

అవయవ దానం చేద్దాం.. మరణించి జీవిద్దాం

● విద్యార్థులకు అవగాహన

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ అవయవ దాన దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక స్టోన్‌హౌస్‌పేటలో గల ఆర్ఎస్ఆర్ నగర పాలక ఉన్నత పాఠశాలలో ప్రజా సైన్స్ వేదిక నెల్లూరు పట్టణ శాఖ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆ వేదిక నెల్లూరు పట్టణ అధ్యక్షుడు సతీష్‌కుమార్ మాట్లాడుతూ అస్తమించిన సూర్యుడు ఉదయించినట్లు అవయవ దానంతో మనిషి మరణించినా జీవించవచ్చని చెప్పారు. జీవశాస్త్రంలోనూ ఈ టాపిక్ ఉందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

రేపటి నుంచి హనుమాన్ చాలీసా పారాయణం

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని శబరి శ్రీరామక్షేత్రంలో హనుమద్ వ్రతం సందర్భంగా శనివారం నుంచి డిసెంబరు 2వ తేదీ వరకు హనుమాన్ చాలీసా అఖండ పారాయణం జరుగుతుందని ఆలయ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పారాయణను విజయవాడ అఖిల భారత హనుమాన్ దీక్ష పీఠం కళాకారులు నిర్వహిస్తారని, భక్తులు తరలిరావాలని కోరారు.

నేడు కాలభైరవ అష్టమి

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం కాలభైరవ అష్టమి పర్వదినాన్ని జరుపుతున్నారు. ఈ సందర్భంగా కాలభైరవ స్వామికి ఉదయం 7 నుంచి 9 గంటల వరకు విశేష అభిషేకాలు, రాత్రి ప్రాకారోత్సవం జరగనున్నాయి. భక్తులందరూ తరలిరావాలని ఆలయ కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి ఓ ప్రకటనలో కోరారు.

విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు స్కిల్ డెవలప్‌మెంట్

నెల్లూరు(విద్య), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం నగరంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో నారాయణ గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌కు చెందిన విద్యార్థులకు నిర్వహించిన స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో ఆయన అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల కు చదువుతోపాటు వివిధ రంగాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. దిశా పేరుతో నారాయణ సాఫ్ట్‌స్కిల్స్ డిపార్ట్‌మెంట్ పర్యవేక్షణలో పబ్లిక్ స్పీకింగ్ స్కిల్, నాయకత్వ లక్షణాలు పెంపొందించేలా కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. ఏటీఎం రవివర్మ మాట్లాడుతూ వివిధ దశల్లో నిర్వహించే పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు గ్రాండ్ ఫైనల్స్‌లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎంలు, కోఆర్డినేటర్‌లు, క్లస్టర్ ప్రిన్సిపాళ్లు, ప్రిన్సిపాళ్లు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెడ్ సిగ్నల్... అయినా రయ్.. రయ్!

● ట్రాఫిక్ సిగ్నల్స్ నవ్వుల పాలు ● పట్టించుకోని ప్రజలు

● రోడ్ల ఆక్రమణలు, ఎక్కడపడితే అక్కడ పార్కింగ్

● దుకాణాలకు లేని పార్కింగ్ ప్రాంతాలు



రెడ్ సిగ్నల్ ఉన్నప్పటికీ వెళ్లిపోతున్న వాహనాలు

నెల్లూరు(క్రైం), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ నియంత్రణ కోసం నగరంలో ఆర్భాటంగా ప్రారంభించిన సిగ్నల్ వ్యవస్థ నవ్వుల పాలవుతోంది. నగరంలోని ఏడు ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. అయితే పలు ప్రాంతాల్లో అవి పూర్తి స్థాయిలో ఎల్లో సిగ్నల్‌కు పరిమితం అవుతున్నాయి. మిగిలిన ప్రాంతాల్లో సిగ్నల్స్ సక్రమంగానే ఉన్నా ప్రజలు వాటిని పట్టించుకోవడం లేదు. రెడ్ సిగ్నల్ పడినా రైయ్‌రైయ్ అంటూ దూసుకు పోతూనే ఉన్నారు. సిగ్నల్స్ వ్యవస్థపై అవగాహన ఉన్న ప్రజలు రెడ్ సిగ్నల్ పడినా వాహనాలు దూసుకు పోతుండటం చూసి నవ్వుకుంటున్నారు.



రోడ్లపై ద్విచక్ర వాహనాల పార్కింగ్‌తో రహదారి చిన్నదై స్తంభించిన ట్రాఫిక్

● నియంత్రణ కష్టతరం

నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం సిగ్నల్స్‌ను ప్రారంభించా రు. అయితే సంవత్సరాల తరబడి నగరంలో అవే రోడ్లు కావడం, ప్రతి ఏడాది వాహనాల సంఖ్య భారీగా పెరుగుతుండటంతో నియంత్రణ కష్టతరమవుతోంది. అలాగే, దుకాణాలు, షాపింగ్ మాల్స్ హోటల్స్‌కు పార్కింగ్ ప్రాంతాలు లేకపోవడం, నగర రోడ్లపై రోడ్డుకు రెండు వైపుల వాహనాల పార్కింగ్‌తోపాటు మధ్యలో సెంట్రల్ పార్కింగ్ ఏర్పడటంతో ట్రాఫిక్ జామ్ విపరీతంగా పెరిగింది. సిగ్నల్స్ వ్యవస్థతో ఏ మాత్రం ప్రయోజనం లేదని అర్థం చేసుకొన్న నాయకులు, అధికారులు ఈ వ్యవస్థను వదిలేశారు. ఇక ట్రాఫిక్ పోలీసులు సిగ్నల్స్ వ్యవస్థతో నెల్లూరు నగరంలో పెద్దగా ప్రయోజనం ఉండదని, సిగ్నల్ వ్యవస్థ వల్ల ట్రాఫిక్ అంతరాయం అధికమవుతోందని తెలుపుతున్నారు. ఏదేమైనా నగరంలో ట్రాఫిక్ సిగ్నల్స్ వ్యవస్థ వల్ల ట్రాఫిక్ నియంత్రణ సాధ్యం కాదని స్పష్టమవుతోంది.

ప్రజల సూచనలతోనే పార్కులకు పేర్లు

● రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి



నెల్లూరు రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : తన నియోజకవర్గంలోని 29 పార్కు స్థలాలను కాపాడి, వాటికి ప్రహరీ నిర్మించినందుకు గర్వపడుతున్నానని, ఆ పార్కులకు స్థానికుల సూచన మేరకు పేర్లు పెడతామని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఆయన కార్యాలయంలో గురువారం మీడియాతో మాట్లాడారు. చంద్రన్న పార్కుల బాట పేరిట తొలి దశ పనులు రూ.7 కోట్లతో పూర్తి చేసినట్లు చెప్పారు. రూ.100 కోట్ల విలువ చేసే పార్కు స్థలాలు కాపాడటం సంతృప్తినిచ్చిందని తెలిపారు. ఆయా పార్కు స్థలాల్లో రెండు వేల మొక్కలు నాటామని, వాటిని స్థానికులు కాపాడుకోవాలని కోరారు. పార్కులకు ఎవరి పేర్లతో నామకరణం చేయాలన్నది స్థానికులే నిర్ణయించి తనకు ఫోన్ ద్వారాగానీ, వాట్సాప్ ద్వారాగానీ తెలపాలని పిలుపునిచ్చారు. కార్యాలయానికి వచ్చి తనతోనే నేరుగా కూడా చెప్పవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, సాబీర్‌ఖాన్, హజరత్ నాయుడు పాల్గొన్నారు.

కాగా, రాజకీయాల్లో విమర్శలు, ప్రతివిమర్శలు సాధారణమని ఎమ్మెల్యే అన్నారు. అధికార పార్టీ ప్రజలకు పని చేయాలి, అందులో లోపాలుంటే ప్రతిపక్షం ఎత్తిచూపాలి, కానీ మరొక పద్ధతిలో విమర్శలు చేస్తుంటే మా వాళ్లే సమాధానం చెప్తారన్నారు. తానే సమాధానం చెప్పాల్సిన పరిస్థితి వస్తే తీవ్రంగా ఉంటుందని, ఆ పరిస్థితి రాకూడదని తన రాజకీయ ప్రత్యర్థులు కోరుకోవాలంటూ తాజాగా మేయర్ దంపతులు చేస్తున్న విమర్శలపై పరోక్షంగా స్పందించారు.

మానసిక ఒత్తిడిని జయిస్తే విజయం

● ఆత్మహత్యలకు దూరం కావాలి ● వైద్య విద్యార్థులకు నిపుణుల సూచన

నెల్లూరు (వైద్యం), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మానసిక ఒత్తిడిని జయిస్తే వైద్య విద్యార్థులు విజయం సాధించవచ్చని నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి సూచించారు. గురువారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని సమావేశం మందిరంలో మొదటి సంవత్సరం వైద్య విద్యార్థులకు ఎమోషనల్ అసెస్‌మెంట్ ఆఫ్ స్టూడెంట్స్ బై ఎడ్యుకేషన్ అన్న అంశంపై సదస్సు నిర్వహించారు. వైద్య వృత్తి సేవా భావంతో కూడుకున్నదని వక్తలు చెప్పారు. వైద్యులుగా మారటానికి విద్యార్థులు ఎక్కువగా శ్రమించాల్సి ఉంటుందన్నారు. ఈ క్రమంలో ఒక్కోసారి ఆర్థిక, మానసిక, సామాజిక ఒత్తిడిని ఎదుర్కోవలసి వస్తుందన్నారు. క్షణికావేశంతో ఆత్మహత్యలకు పాల్పడరాదన్నారు. చెడు అలవాట్లు, వ్యసనాల జోలికి పోవద్దని సూచించారు. బెంగళూరు నుంచి వచ్చిన వైద్య నిపుణుడు నెల్సన్ మనోబలానికి అవసరమైన చిట్కాలు వెల్లడించారు. సైక్రియాటిక్ విభాగం హెచ్‌వోడీ డాక్టర్ లక్ష్మీప్రసన్న మానసిక స్థిరత్వం, సమస్యలను అధిగమించడం వంటి వాటిని వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మస్తాన్‌బాషా, డాక్టర్ బెన్‌హర్, డాక్టర్ శరత్ పాల్గొన్నారు.



వైద్య విద్యార్థులతో వైద్య నిపుణులు

గృహ నిర్మాణ శాఖలో సమస్యలు పరిష్కరించండి

● ఎండీ అరుణ్‌కు బీజేపీ వినతి

నెల్లూరు (జడ్పీ), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గృహ నిర్మాణ శాఖలో పేరుకుపోయిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరుతూ బీజేపీ నాయకుడు మిడతల రమేష్ గురువారం హౌసింగ్ ఎండీ అరుణ్‌బాబుకు వినతపత్రం అందజేశారు. ఎండీ నెల్లూరులోని హౌసింగ్ కార్యాలయానికి రాగా ఆయనను కలిసి, హౌసింగ్‌లో అధికారుల వ్యవహారశైలి, అసంపూర్ణ గృహాలతో లబ్ధిదారుల అవస్థలు, కాంట్రాక్టర్ల సమస్యలు వివరించారు. జిల్లాలో మాత్రమే గృహనిర్మాణ కార్యక్రమాన్ని ఆపేడ యం వల్ల లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమ స్యలను ఏకరువు పెట్టారు. జిల్లాలో గృహనిర్మా ణాలలో ప్రగతి తీసుకురావాలని కోరారు.

జేఏసీ నాయకుల భేటీ

నెల్లూరు(హరనాథపురం): నగరానికి వచ్చిన హౌసింగ్ ఎండీ అరుణ్‌బాబును రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ జేఏసీ కార్యనిర్వాహక చైర్మన్ ఎస్‌వీఎం మనోజ్‌కుమార్, రాష్ట్ర ఏఈల సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి కేసీ పెంచలయ్య, జిల్లా ఔట్‌సోర్సింగ్ వర్క్‌ఇన్‌స్పెక్టర్‌ల సంఘం అధ్యక్షుడు బు కృష్ణ కలిసి సమస్యలు తెలియచేశారు. విజిలెన్స్ కేసుల గురించి విన్నవించారు. అనంతరం జిల్లా హౌసింగ్ హెడ్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఈఈలు, డీఈలతో సమావేశం జరిగింది.



హౌసింగ్ ఎండీ అరుణ్‌బాబుకు ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకుడు మిడతల రమేష్

కపాడిపాలెంలో కార్డన్ సెర్చ్

● 22 వాహనాలు స్వాధీనం

నెల్లూరు(క్రైం), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని సంతపేట పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న కపాడిపాలెంలో గురువారం తెల్లవారు జామున పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. నగర ఇన్‌చార్జి డీఎస్పీ ఎం గిరిధర్ ఆధ్వర్యంలో పోలీసు అధికారులు బృందాలుగా ఏర్పడి కపాడిపాలెంను నాలుగు వైపుల నుంచి ముట్టడించారు. ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఇంటి యజమాని, కుటుంబ సభ్యుల వివరాలు సేకరించారు. పత్రాలు లేని 19 మోటారు బైక్‌లు, ఒక ఆటో, రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ మాట్లాడుతూ నేర నియంత్రణ, అసాంఘిక కార్యక్రమాల కట్టడే లక్ష్యంగా కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు. అనుమానాస్పద వ్యక్తులు, చట్టవ్యతిరేక కార్యకలాపాలు, మాదకద్రవ్యాల వినియోగంపై ప్రజలు డయల్ 112కుగానీ, స్థానిక పోలీసులకుగానీ సమాచారం అందించాలని కోరారు. కార్డన్‌సర్చ్‌లో సంతపేట, చిన్నబజారు, నవాబుపేట, దర్గామిట్ట, బాలాజీనగర్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు వైవీ సోమయ్య, చిట్టెం కోటేశ్వరరావు, జీ వేణుగోపాల్‌రెడ్డి, బీ కల్యాణ రాజు, కే సాంబశివ రావు, సిబ్బంది పాల్గొన్నారు.



కార్డన్ సెర్చ్‌లో ఓ ఇంటిని తనిఖీ చేస్తున్న ఇన్‌చార్జి డీఎస్పీ గిరిధర్

టీడీపీ నేత పమిడి నుంచి రక్షణ కల్పించండి!

● మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడు!

● కావలిలో ఓ మహిళ ఆవేదన

కావలి, నవంబరు27(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్రకార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి తనకు తన భర్త మధ్య గొడవలు పెట్టి మానసికంగా శారీరకంగా వేధిస్తున్నాడని ఆయననుంచి తనకు తన కుటుంబానికి రక్షణకల్పించాలని గీతాంజలి అనే వివాహిత ఆవేదన వ్యక్తం చేసారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో తల్లి కామాక్షి, బిడ్డతో కలిసి ఆమె మాట్లాడారు. ఆమె మాట్లాడుతూ కావలికి చెందిన తనకు 2016వ సంవత్సరంలో దగదర్తి మండలం మనుబోలుపాడుకు చెందిన చేజర్ల మహేష్‌రెడ్డితో వివాహం జరిగిందన్నారు. తర్వాత కొద్ది రోజులకే భర్త తనను వేధిస్తుండడంతో సమస్య పరిష్కరిస్తానని పమిడి రవికుమార్ చౌదరి చెప్పాడన్నారు.



తల్లి, బిడ్డతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాధితురాలు గీతాంజలి

అయితే సర్దుబాటు చేయకపోగా ఆయన గొడవలను మరింత పెద్దవి చేస్తున్నాడన్నారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో వచ్చి తనను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడని ఆమె వాపోయారు. మనుబోలుపాడు గ్రామంలో పమిడి గెస్ట్‌హౌస్‌కు పిలిపించి, తన భర్తతో పాటు మరికొందరు వ్యక్తులచేత దాడి చేయించారన్నారు. అప్పట్లో తన భర్తతోపాటు, పమిడి రవికుమార్‌చౌదరి మరికొంత మందిపై కావలి రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నారు. ఈ కేసు విచారణ నిమిత్తం ఇటీవల కావలి కోర్టుకు వాయిదాకు వెళ్లగా, కోర్టునుంచి బయటకు వస్తుండగా తన భర్త మహేశ్వరరెడ్డి, మరికొందరు వ్యక్తులు రవికుమార్‌చౌదరి ప్రోద్బలంతో తనపై, తల్లి కామాక్షిపై దాడి చేయించారన్నారు. పమిడి రవికుమార్ చౌదరి మనుషులు తన ఇంటి చుట్టూ తిరుగుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. రవికుమార్ చౌదరి నుంచి తనకు, తన కుటుంబానికి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని ఆమె పోలీసులకు విన్నవించారు.

ఎన్ఎస్ఎస్ ప్రత్యేక క్యాంప్

నెల్లూరు(విద్య), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని జీవీఆర్ఆర్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో గొలగమూడి మోడల్ స్కూల్‌లో గురువారం నుంచి ఎన్ఎస్ఎస్ ప్రత్యేక క్యాంప్ ప్రారంభించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఏబీ రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే దేశభక్తి, జాతీయ భావాలు, సేవాగుణం కలిగి ఉండేలా తీర్చిదిద్దాలన్నారు. మహనీయుల సేవలను స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడిచేలా గురువులు బోధించాలని కోరారు. దీనిలో భాగంగానే ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యం లో వారం రోజులు సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ జేడీ మహ్మద్ ఆయూబ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకుంటేనే ఉత్తమ పౌరులుగా ఎదుగుతారన్నారు. అనంతరం పాఠశాల ఆవరణ, పరిసరా లను శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రఘునారా యణ, అనికేపల్లి సర్పంచ్ కే శీనయ్య, గ్రామ కార్యదర్శి ఈ అనూష, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ దోర్నాదుల వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎన్ఎస్ఎస్ క్యాంప్‌లో పాల్గొన్న విద్యార్థులు

మున్సిపల్ కాంప్లెక్స్‌లో దుకాణాల సీజ్



నెల్లూరు(సిటీ), నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : నగరంలోని స్టోన్‌హౌస్‌పేట లో ఉన్న కేఏసీ మున్సిపల్ కాంప్లెక్స్‌లో పలు దుకాణాలను కార్పొరేషన్ రెవెన్యూ అధికారులు గురువారం సీజ్ చేశారు. ఆర్ఐ కిరణ్ అందించిన వివ రాల మేరకు... ఆ కాంప్లెక్స్ లోని 1వ నెంబరు దుకాణానికి రూ. 2.61 లక్షలు, 2వ షాపునకు రూ. 2.61 లక్షలు, 3, 4, 7 దుకాణాలకు రూ. 3.21 లక్షల చొప్పున కార్పొరేషన్‌కు బకాయిలున్నాయి. పలు దఫాలుగా నోటీసులు ఇచ్చి నా దుకాణదారులు స్పందించకపోవడంతో ఆ షాపులను సీజ్ చేసినట్లు ఆర్ఐ పేర్కొన్నారు.

రోడ్డు సేఫ్టీపై అవగాహన

నెల్లూరు(క్రైం), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు సేఫ్టీపై ట్రాఫిక్, రవాణాశాఖ అధికారులు గురువారం నగరంలోని వీఆర్‌సీ మైదానంలో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలు, ఓవర్ లోడ్, డ్రంక్ అండ్ డ్రైవ్, అధిక స్పీడ్... తదితర అంశాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి, రవాణాశాఖ అధికారులు పాల్గొన్నారు.

కస్తూర్బాలో 'సక్సెస్ మంత్ర'



నెల్లూరు(సిటీ), నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించేందుకు కార్పొరేషన్ ఆధ్వర్యంలో నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో గురువారం సక్సెస్ మంత్ర అంశంపై అవగాహన కల్పించారు. అమృత్ పథకం డిప్యూటీ డైరెక్టర్ మాధురి పాల్గొని మాట్లాడారు. ప్రతీ ఒక్కరు మొదట తమ ఆత్మవిశ్వాసం పై నమ్మకం పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీపీఆర్వో వాసుబాబు పాల్గొన్నారు.

నీకో న్యాయం నాకో న్యాయమా.. కోటంరెడ్డీ!

● మేయర్ భర్త జయవర్ధన్



నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : 'నువ్వు పెట్టిన భిక్ష వల్లే నేను, నా భార్య స్రవంతి ఈ స్థాయిలో ఉన్నామని నీ అనుచరులతో నానా మాటలు అనిపిస్తున్నావు.... మరి, కార్పొరేటర్ స్థాయికి తగని నీకు జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్యే సీటిచ్చి పెట్టింది ఏమిటో తెలుసుకోవాలి. నీకో న్యాయం.. నాకో న్యాయమా?' అంటూ నగర మేయర్ స్రవంతి భర్త జయవ ర్ధన్ రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిపై ధ్వజమెత్తారు. గురు వారం స్థానిక జర్నలిస్టు భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రాజకీయాల్లోకి రావాలని రూ.పది లక్షలు ఇచ్చామని, ఎన్నికల్లో నా భార్య ఏకగ్రీవంగా గెలిస్తే నేను నీకు ఇచ్చిన పది లక్షలు ఏమయ్యాయో తెలపాలని ఎమ్మెల్యేను నిలదీ శారు. మేము అవినీతికి పాల్పడుతున్నామని ఆరోపిస్తున్నారని, మరి.. మీ అనుయాయులు వినాయక చవితికి దండిన చందా రూ.10కోట్లు ఎక్కడికిపో యాయో చెప్పాలన్నారు. మాగుంట లేఅవు ట్‌లో రూ.20కోట్ల ఇల్లు, బెంగళూ రులో రూ.100కోట్ల షాపింగ్ కాంప్లెక్స్, హైదరాబాద్‌లో రూ.30కోట్ల విల్లా ఎలా వచ్చాయో చెప్పాలన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్, దేవాలయ, మున్సిపల్ భూములు ఆక్రమించి వెంచర్లు వేస్తున్నారని ఆరోపించారు. మీ అన్నదమ్ముల బారినపడ్డ ఎందరో ఫోన్ చేసి మీ అరాచకాలు తెలియజేస్తున్నారన్నారు. వారి కోసం అయినా నేను నిలబడతానన్నారు.

నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



ఉదయగిరి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాయపాళెం పంచాయతీ గంగిరెడ్డిపల్లి జగనన్న లేఅవుట్‌లో గత ప్రభుత్వం పేదలకు ఆప్షన్-3 కింద థర్డ్ పార్టీ నిర్మించిన బేస్‌మెంట్‌ల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలను అధికారులు, కాంట్రాక్టర్ల సమక్షంలో క్వాలిటీ కంట్రోల్ బృందం గురువారం పరిశీలించింది. లేఅవుట్‌లో ఆప్షన్-3 కింద లబ్ధిదారులు, అధికారుల సంయుక్త ఒప్పందంతో 141 పక్కాగృహాల బేస్‌మెంట్‌ల నిర్మాణాన్ని కాంట్రాక్టర్‌కు అప్పగించింది. అయితే కాంట్రాక్టర్ ప్రభుత్వం ఇచ్చిన నగదుతో బేస్‌మెంట్‌ల నిర్మాణాన్ని తూతూమంత్రంగా నిర్మించి పక్కాగృహాల నిర్మాణాలను చేపట్టలేదు. ప్రస్తుతం ఆ బేస్‌మెంట్‌లపై తదుపరి ఇళ్ల నిర్మాణం చేయవచ్చా.. లేదా.. పరిశీలించాలని ప్రభుత్వం ఆదేశించడంతో క్వాలిటీ బృందం నిశితంగా పరిశీలించి యాప్‌లో నమోదు చేశారు. ఆ బేస్‌మెంట్లు ఇళ్ల నిర్మాణానికి పనికిరావని ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఇన్‌చార్జి ఏఈ షరీఫ్, వర్కుఇన్‌స్పెక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు శివయ్య, రవి, ఆదిశేషారెడ్డి పాల్గొన్నారు.

మొక్కజొన్న మార్కెట్ స్థిరీకరణకు చర్యలు

● అధికారులు, వ్యాపారులతో సమీక్షలో మంత్రి అచ్చెన్న

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మొక్కజొన్న రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రైతులు నష్టపోకుండా, మార్కెట్‌ను స్థిరీకరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని వివరించారు. పౌల్ట్రీ, ఫార్మా, సీడ్ వ్యాపారులు ధర తగ్గించకుండా మొక్కజొన్న కొనుగోళ్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. గురువారం విజయవాడ క్యాంప్ ఆఫీస్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మొక్కజొన్న కొనుగోళ్లపై అధికారులు, వ్యాపారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ.. 'కనీస మద్దతు ధర కింద ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా ఖరీఫ్ మొక్కజొన్న సేకరణకు అనుమతివ్వాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపాం. మొక్కజొన్న సేకరణకు అవసరమైన నిధులను మంజూరు చేయాలని ఆర్థిక శాఖను కోరాం. ఖరీఫ్‌లో 1,42,282 హెక్టార్లలో మొక్కజొన్న సాగవ్వగా, 8,18,753 టన్నుల ఉత్పత్తి అంచనా వేశామని పేర్కొన్నారు.

ప్రీ స్కూల్ కిట్లు వచ్చేశాయ్..!



: ప్రీ స్కూల్ కిట్లను పంపిణీ చేస్తున్న ఐసీడీఎస్ అధికారిణి సునంద

రాపూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాపూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో గురువారం ఐసీ డీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి సునంద ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రాలకు ప్రీ స్కూల్ కిట్లను అందజేశారు. రోజూ అంగన్వాడీ కేంద్రాల్లో భాషాభివృద్ధి, సృజనాత్మకతపై చిన్నారులకు ఆసక్తి కలిగేలా ఉపకరణాలతో బోధించాలన్నారు. మెనూ ప్రకారం పిల్లలకు మిడ్ డే మీల్స్ అందుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌజన్య, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై భారీ వాహనం



సంగం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముంబాయి జాతీయ రహదారిపై గురువారం 74 చక్రాల ట్రాలీపై భారీ డ్రమ్ము తరలిస్తున్నారు. గ్యాస్ ఫ్యాక్టరీలో వినియోగించే ఈ డ్రమ్మును చెన్నై నుంచి గుజరాత్‌కు తీసుకెళ్తున్నట్లు, భారీ డ్రమ్ము కావడంతో సైకిల్ కంటే నిదానంగా తీసుకెళ్తునట్లు డ్రైవర్ తెలిపాడు.

త్వరలో డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక

● ఏఐసీసీ పరిశీలకుడు, తమిళనాడు ఎమ్మెల్యే హసన్ మౌలానా



మాట్లాడుతున్న ఏఐసీసీ పరిశీలకుడు హసన్ మౌలానా, పక్కన డీసీసీ అధ్యక్షుడు చేవూరు, నాయకులు

నెల్లూరు (వైద్యం), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని, ఇందుకోసం పార్టీ సూచనలు ప్రణాళికా బద్ధంగా అమలు చేయాలని ఏఐసీసీ పరిశీలకుడు, తమిళనాడు ఎమ్మెల్యే హసన్ మౌలానా పిలుపునిచ్చారు. గురువారం నెల్లూరులోని ఇందిరా భవన్‌లో సంఘటన సృజన్ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ త్వరలో పార్టీ జిల్లా అధ్యక్షుని ఎన్నిక జరుగుతుందని, అందుకోసం అందరి అభిప్రాయాలు తీసుకుంటున్నామని చెప్పారు. డిసెంబరు 15లోపు పార్టీ జిల్లా అధ్యక్షుని ప్రకటన ఉంటుందని తెలిపారు. అలాగే అందరి అభిప్రాయాలు సేకరించి పార్టీ నగర అధ్యక్షుని ఎన్నిక కూడా జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ స్పోర్ట్స్ సెల్ చైర్మన్ కమలాకర్‌రావు, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి పంటా శ్రీనివాసులు, పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్ రెడ్డి, సమన్వయ కర్త బుల్లిబాబు, నాయకులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు నామినేటెడ్ పదవులివ్వాలి

● ముదిరాజ్ మహాసభ గౌరవాధ్యక్షుడు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వెంకట నారాయణ ముదిరాజ్

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ముదిరాజ్‌లకు ఎమ్మెల్సీ వంటి నామినేటెడ్ పదవులలో తగిన ప్రాధాన్యమివ్వాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెంకట నారాయణ ముదిరాజ్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం నెల్లూరులోని ఆ మహాసభ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో 23 లక్షల మందికిపైగా ముదిరాజ్ కులస్తులు ఉన్నారని, వారి ఆర్థికాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికలలో ముదిరాజ్‌లకు రిజర్వేషన్ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నీరికట్టు వెంకట అభిలాష్‌ను నెల్లూరు జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా నియమించారు. సమావేశంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు నారాయణమ్మ, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కనకట్ల మోహన్, ఐ క్రాంతి, శ్రీనివాసులు, అంకయ్య, హరి, మల్లి పాల్గొన్నారు.

డిసెంబరు 22న 'హలో బీసీ-చలో విజయవాడ'

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి బీసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో బీసీల హక్కుల సాధన కోసం డిసెంబరు 22న హలో బీసీ - చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని బీసీ నవ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు శీలం వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం నెల్లూరులో బీసీ సంఘాల చర్చావేదిక జరిగింది. ఆయన మాట్లాడుతూ భారతదేశంలో బీసీ కులాల లెక్కలు లేకపోవటంతో 60 శాతానికిపైగా జనాభా ఉన్న బీసీ కులాల వారు నష్టపోతున్నారని చెప్పారు. జనగణనతోపాటు కులగణన చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. బీసీ కార్పొరేషన్ ద్వారా 50శాతం సబ్సిడీ రుణాలివ్వాలన్నారు. ఈ సమావేశంలో జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున, బీసీ నవచైతన్య వేదిక ప్రధాన కార్యదర్శి దోనెపూడి కోటేశ్వరరావు, మోడెం నాగరాజు, డాక్టర్ మారెం సుధాకర్, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కనకట్ల రఘురాం ముదిరాజ్ పాల్గొన్నారు.

మన్నేరులో పడి ఒకరి మృతి



ఒడ్డుకు తీసుకువచ్చిన మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ అంకమ్మ

ఉలవపాడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా కనిపించడం లేదని గాలిస్తున్న వ్యక్తి గురువారం గ్రామానికి పక్కనే ఉన్న మన్నేరులో శవమై తేలాడు. పోలీసుల కథనం మేరకు...మండలంలోని మన్నేటికోట ఎస్సీ కాలనీకి చెందిన బక్కా ప్రభుదాసు (48) ఇంట్లో నుంచి వెళ్లి మూడు రోజులు అయింది. తన తండ్రి ఇంటికి రాలేదని కూతురు కళ్యాణి హైదరాబాద్‌లో బేల్దారి పని చేసుకుంటున్న తన అన్న కోటయ్యకు బుధవారం సమాచారం అందించింది. దీంతో కోటయ్య గురువారం ఉదయం గ్రామానికి చేరుకొని కుటుంబ సభ్యులు, కాలనీవాసులతో కలిసి వెతుకులాడారు. ఈ క్రమంలో గ్రామానికి ఆనుకొని ఉన్న మన్నేరులో నీటిపై తేలాడుతున్నట్లు కనిపించడంతో కాలనీవాసులు మృతదేహాన్ని బయటకు తీసుకొచ్చారు. ఆ మృతదేహం తన తండ్రిదేనని కోటయ్య గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి వచ్చిన ఎస్సై అంకమ్మ మృతదేహాన్ని పరిశీలించి, జరిగిన సంఘటనపై కుటుంబ సభ్యుల నుంచి సమాచారం సేకరించారు. మృతుడు కొడుకు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం స్థానిక సీహెచ్‌సీకి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

పోలీసులకే మస్కా!

● రక్షక భటులనే ట్రాప్ చేస్తున్న గ్యాంగ్‌లు
● సామాన్యులకు ఆశచూపి రూ.కోట్లు దోపిడీ
● నెల్లూరు, కావలిలో పెండింగ్‌లో కేసులు
● నాన్ బెయిలబుల్ కేసుల్లోనూ జరగని అరెస్టులు
● నెల్లూరు రూరల్ కేసులో రూ.6 లక్షల రికవరీ
● మిగిలిన డబ్బు ఇస్తామంటూ దొరకని వైనం



నెల్లూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సామాన్యులు కష్టపడి సంపాదించుకున్న డబ్బును చిన్న ఆశచూపి నిలువునా దోచేస్తారు... ఆ డబ్బుతో విలాసంగా తిరుగుతారు... డబ్బులు అయిపోగానే మరొకరికి గాలం వేస్తారు... జిల్లాలో గత కొన్నేళ్లుగా 'ట్రాప్' గ్యాంగ్‌లు సామాన్యులను దోచుకోవడమే వృత్తిగా పెట్టుకున్నాయి. జిల్లావ్యాప్తంగా పోలీసు స్టేషన్లలో అనేక కేసులు నమోదయ్యాయి. జిల్లాలోనే కాకుండా ఇతర జిల్లాలు, తెలంగాణల్లో కూడా ఈ ట్రాప్ గ్యాంగ్ ఆగడాలు శృతిమించుతున్నాయి. ఎన్ని కేసులు నమోదైనా ఈ గ్యాంగ్‌ల దోపిడీలు మాత్రం ఆగడం లేదు.

● నాన్ బెయిలబుల్ కేసుల నమోదు

ప్రస్తుతం నెల్లూరు, కావలిల్లో పలు నాన్ బెయిలబుల్ కేసులు ఈ దోపిడీ ముఠాలపై నమోదయ్యాయి.కొన్ని నెలల నుంచి ఆ కేసుల్లో పోలీసులకు దొరక్కుండా తిరుగుతున్నాయి. అత్యంత క్లిష్టమైన నేరగాళ్లను కూడా పట్టుకుంటున్న జిల్లా పోలీసులకు ఈ ట్రాప్ గ్యాంగ్‌లు ఎందుకు దొరకడం లేదన్నది చర్చనీయాంశంగా మారింది. ఈ గ్యాంగ్‌లు పోలీసులకు కూడా 'ట్రాప్' వేశాయా..? అన్న చర్చలు జరుగుతున్నాయి. దోచుకున్న డబ్బు రికవరీ కాకపోతుండడంతో బాధితులు బోరుమంటున్నారు. ట్రాప్ గ్యాంగ్ చేతిలో రూ.50 లక్షలు మోసపోయిన ఓ బాధితుడు ఇటీవల ఆత్మహత్యకు ప్రయత్నించడం కలవరపెడుతోంది.

● రూరల్‌లో దోబూచులాట

నగర పరిధిలోని నవలాకులతోటలో పక్కా స్కెచ్ వేసిన ఓ ట్రాప్ గ్యాంగ్.. తిరుపతికి చెందిన ఓ డాక్టర్ నుంచి రూ.14.50 లక్షలు దోచుకుంది. డబ్బు దోచుకోవడమే కాక సదరు బాధితుడిని కొట్టి ఇంట్లో నుంచి బయటకు నెట్టేశారు. బయటకు చెబితే చంపేస్తామంటూ బెదిరించారు. ఈ విషయాన్ని సదరు డాక్టర్.. తనకు సన్నిహితులైన ఓ పోలీసు అధికారికి చెప్పడంతో అనధికార విచారణ జరిగింది. ఎవరెవరు డబ్బును దోచుకున్నారన్న విషయాన్ని పోలీసులు గుర్తించడంతో పాటు మీడియేటర్ ద్వారా రూ.6 లక్షలు కూడా రికవరీ చేశారు. ఆ తర్వాత నెల్లూరు రూరల్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఇది జరిగి ఇప్పటికి రెండున్నర నెల కావస్తోంది. కానీ ఇంత వరకూ ట్రాప్ గ్యాంగ్‌లో ఒక్కరిని కూడా అరెస్టు చేయలేదు. మిగిలిన డబ్బు రికవరీ చేసి బాధితుడుకు అందించలేదు. మీడియేటర్ ద్వారా సదరు గ్యాంగ్.. మిగిలిన డబ్బును తిరిగి ఇచ్చేస్తామంటూ బేరసారాలు ఆడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. కానీ నెలలు గడిచిపోతున్నా డబ్బులు తిరిగి ఇవ్వకపోగా, ఇదే సమయంలో వేర్వేరు చోట్ల మరికొంత మంది సామాన్యులకు ట్రాప్ వేసినట్లు సమాచారం. ఇదే మాదిరిగా నెల్లూరు, కావలి పోలీసు స్టేషన్లలో మరికొన్ని కేసులు కూడా ఉన్నాయి. అయితే నెల్లూరు రూరల్ స్టేషన్‌లో నమోదైన కేసును లోతుగా విచారిస్తున్నామని రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు తెలిపారు.

● దృష్టి పెడితేనే..!

నెల్లూరులో రౌడీషీటర్ల వ్యవహారాలు రాష్ట్ర వ్యాప్తంగా దుమారం రేగడంతో పోలీసులు కఠినంగా వ్యవహరించారు. రౌడీషీటర్లపై ఉక్కుపాదం మోపడంతో పాటు వీరందరినీ జైళ్లకు పంపారు. రెండు నెలల పాటు ఈ ప్రక్రియ నిర్విరామంగా సాగడంతో ఇప్పుడు నెల్లూరు ప్రశాంతంగా ఉంది. అయితే ఇప్పుడు తక్కువ ధరకు బంగారం పేరుతో ఆశచూపుతూ సామాన్యులను నిలువునా దోచుకుంటున్న గ్యాంగ్‌లు పెచ్చుమీరుతున్నాయి.

పొలం వివాదమే హత్యకు కారణం..!?

● హత్య జరిగిన ప్రదేశాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే



కావలి ఏరియా ఆసుపత్రిలోని మార్చురీలో ఉన్న ప్రసాద్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తదితరులు

జలదంకి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపాలెంలో బుధవారం జరిగిన టీడీపీ నేత గొట్టిపాటి ప్రసాద్‌నాయుడు హత్యకు పొలం వివాదమే కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కేసును పోలీసులు పలుకోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. హత్యకు సుపారీ గ్యాంగ్‌ను ఉపయోగించినట్లు ప్రచారం జరుగుతుండగా, వీరిలో కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కోళ్ల కోసం వచ్చిన ఇద్దరు వ్యక్తులే హత్యకు పాల్పడ్డారని పోలీసులు ప్రాథమిక నిర్ణయానికి వచ్చారు. వారిని గత రాత్రి ప్రకాశం జిల్లా పరిసరాల్లో అదుపులోకి తీసుకున్నారనే ప్రచారం జరుగుతోంది. సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా పోలీసులు నిందితులను గుర్తించి, అదుపులోకి తీసుకున్నారని సమాచారం. హత్యకు పాల్పడిన ఇద్దరుతో పాటు, వారికి కాపలాగా మరో నలుగురి వెంట వచ్చారనే ఆరోపణలు వినవస్తున్నాయి. వీరందరినీ అదుపులోకి తీసుకుని విచారించిన అనంతరం పోలీసులు హత్యలో ప్రమేయం ఉన్న వారందరినీ మీడియా ముందు హాజరుపరిచే అవకాశం ఉంది. కావలి ఏరియా వైద్యశాలలో గురువారం ప్రసాద్‌నాయుడు మృతదేహానికి పోస్టుమార్టం జరిపారు. అనంతరం మృతదేహాన్ని మార్చురీలో ఉంచారు. ప్రసాద్ కుమార్తెలు విదేశాలలో ఉండడంతో వారు శుక్రవారం ఉదయానికి గ్రామానికి చేరుకున్న అనంతరం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

● ఘటనాస్థలిని పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రసాద్ హత్యకు గురైన కోళ్లఫారం ఉన్న ప్రదేశాన్ని గురువారం ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పోలీసు అధికారులతో కలసి పరిశీలించారు. హత్యోందతాన్ని కలిగిరి సీఐ వెంకట నారాయణ, ఎస్ఐ లతీఫున్నీసాలు ఎమ్మెల్యేకి వివరించారు. తదుపరి అక్కడి నుంచి ఎమ్మెల్యే కావలి ఏరియా వైద్యశాలకు చేరుకుని మార్చురీలో ఉన్న ప్రసాద్ మృతదేహాన్ని పరిశీలించారు. ప్రసాద్ సోదరుడు వెంకటేశ్వర్లునాయుడుని ఓదార్చారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లునాయుడు హత్యోందనాన్ని, జరిగిన తీరును వివరించారు.

● వంటేరు విచారం

టీడీపీ నేత ప్రసాద్‌నాయుడు హత్యకు గురవడం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ఈ హత్య వెనుక ఎంతటివారున్నా తగిన శిక్ష పడేలా పోలీసులు కఠిన చర్యలు బాధితులకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

డీసీసీబీలో పలువురికి పదోన్నతులు

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో (డీసీసీబీ) పనిచేస్తున్న పలువురికి పదోన్నతులు కల్పించారు. చీఫ్ మేనేజర్‌గా పనిచేస్తున్న పి. శ్రీనివాసమూర్తికి ఏజీఎంగా, మేనేజర్ ఏ.ఫణీంద్రకు చీఫ్ మేనేజర్‌గా, స్టాఫ్ అసిస్టెంట్ షేక్ షఫీకి అసిస్టెంట్ మేనేజర్‌గా పదోన్నతులు లభించాయి. పదోన్నతులు కల్పించే విషయంలో పారదర్శకత పాటించిన చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డికి, సీఈఓ శ్రీనివాసరావుకు నెల్లూరు జిల్లా కేంద్ర సహకారబ్యాంకు ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కుమార్‌పాల్, నాయకులు గౌస్‌బాషా, మహేష్ తదితరులు అభినందనలు తెలిపారు.

30న అండర్-12 క్రికెట్ జట్ల ఎంపిక

నెల్లూరు(విద్య), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఉన్న క్రికెట్ క్రీడా ప్రాంగణంలో ఈనెల 30వతేదీ అండర్-12 జిల్లా బాలుర జట్టు ఎంపిక నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాజశేఖర్‌రెడ్డి, కే.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు 2013 సెప్టెంబరు 1 తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. ఆసక్తి కలిగి హాజరయ్యే క్రీడాకారులు తమ సొంత క్రికెట్ కిట్‌లతో వైట్‌డ్రస్ కోడ్‌తో ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 8 గంటలకు హాజరు కావాలన్నారు.

కొబ్బరి అభివృద్ధి సంస్థ సభ్యుడిగా ఉద్యానశాఖ డైరెక్టర్

అమరావతి, (ఆంధ్రజ్యోతి): కొచ్చిలోని జాతీయ కొబ్బరి అభివృద్ధి సంస్థ అధికారిక సభ్యుడిగా రాష్ట్ర ఉద్యానశాఖ డైరెక్టర్‌ను ప్రభుత్వం నామినేట్ చేసింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

విద్యార్థుల అభ్యాసన పెంపునకు పాల్‌ల్యాబ్‌లు దోహదం



హెచ్ఎంలకు ట్యాబ్‌లు అందిస్తున్న ఏపీసీ

నెల్లూరు(విద్య), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల స్వీయ అభ్యాసన సామర్థ్యాలను పెంపునకు పాల్ ల్యాబ్‌లో ఎంతో దోహదం చేస్తాయని సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డీ.వెంకటసుబ్బయ్య అన్నారు. జిల్లాలోని పదకొండు పీఎంశ్రీ పాఠశాలలకు నగరంలోని దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలకు గురువారం ట్యాబ్‌లను, మెటీరియల్స్‌ను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడతూ తరగతి గది బోధనలో సమస్యలను అధిగమించి స్వీయ అభ్యసనం ద్వారా వెనుకబడిన విద్యార్థుల విద్యా సామర్థాల పెంపుకోసం పర్సనాలిటీ అడాప్టెడ్ లెర్నింగ్ పాల్ ల్యాబ్‌లు ఉపయోగపడతాన్నారు. జిల్లాలో తొలి విడతగా 72 వ రెండవ విడతలో 33 పాల్ ల్యాబ్‌లు అమల్లో ఉండగా, మరో పదకొండు పీఎంశ్రీ పాఠశాలలకు నూతనంగా జిల్లాలో మంజూరు చేశామన్నారు. ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు గణితం, తెలుగు, ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లలో బోధనకు పూర్తి సమాచారం నిక్షిప్తమైన 330 ట్యాబ్‌లను నేడు పాఠశాల్నజీఅందించామని తెలిపారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ ఈఓ నాయక్, పాల్ డీఎన్‌వో సుధీర్‌బాబు, ఎంఈవో మురళీధర్, ఏపీవో ప్రసాద్, ఏఎస్‌వో ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉలవపాడు, (ఆంధ్రజ్యోతి): ఉలవపాడు 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు సంబంధించిన 11కేవీ ఫీ డర్ మరమ్మతు పనులు శుక్రవారం చేపట్టనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉలవపాడు, కొల్లూరుపాడు పరిసర ప్రాంతాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు ఉండదన్నారు.

బడిపిల్లలకు రవాణా భత్యం

● ప్రభుత్వ స్కూళ్లలో హాజరు పెంచడమే లక్ష్యం
● 1380మంది విద్యార్థులకు రూ.41.40లక్షల విడుదల



మనుబోలు ఉన్నత పాఠశాలకు ఆటోలో వస్తున్న గ్రామీణ విద్యార్థులు

మనుబోలు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద, బడుగు, బలహీన, వెనుకబడిన వర్గాల విద్యార్థుల రవాణా సౌలభ్యం కోసం ప్రభుత్వం 1380మంది విద్యార్థులకు రూ. 41.40లక్షలు తొల్లి విడతగా విడుదల చేసింది. ఈ నిధులు విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి జమ అవుతాయి. ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల నిరంతర చదువుకు ఈ పథకం ఎంతో దోహదపడుతుంది. గ్రామీణ ప్రాంత, వెనుకబడిన కుటుంబాల ఆర్థిక పరిస్థితుల కారణంగా బడులకు దూరంగా ఉండేవారు. గ్రామీణ ప్రాంతాల్లో బడులకు దూరంగా ఉండేవారిని, డ్రాప్‌అవుట్స్‌ను తిరిగి బడుల్లో చేర్పించేలా, ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు శాతం పెంచేలా ఈ పథకంను ప్రభుత్వం తీసుకువచ్చింది. దీంతో విద్యార్థులకు రవాణాభారం తగ్గి, నిరంతరం చదువుకునేందుకు ప్రభుత్వం ఈ అవకాశాన్ని కల్పించింది. పేదవిద్యార్థుల బాగోగుల కోసం ప్రభుత్వం తల్లికి వందనం, ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ, ఉచిత మధ్యాహ్న బోజనం, రవాణాభత్యం ఇలా ప్రతి ఒక్కటి విద్యార్థులకు ఉచితంగా అందిస్తూ వారి భవిష్యత్తుకోసం ఎన్నో పథకాలను తీసుకువస్తున్నది.

● తొలివిడతగా...

జిల్లాలోని 1380 మంది విద్యార్థులకు ఒక్కో విద్యార్థికి రూ. 3 వేలు చొప్పున వారి తల్లుల ఖాతాలకు జమ చేశారు. స్థానిక ఆటోల సహకారంతో పిల్లలు చదువుకునేందుకు మనుబోలు బాలుర ఉన్నత పాఠశాలకు చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి వస్తున్నారు. మండలంలో ప్రాథమిక పాఠశాలలే కాకుండా, ఉన్నత పాఠశాలలో చదివే విద్యార్థులు రవాణాభత్యంను పొందుతున్నారు.

ప్రభుత్వ బడులను బలోపేతం చేస్తున్నాం

ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో ప్రైవేట్ పాఠశాలల వైపు చూసే విద్యార్థులు ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న ఉత్తమ విద్యాబోధన,వివిధ సంక్షేమ పథకాలతో ప్రభుత్వ బడుల వైపు ఆకర్షితలవుతున్నారు. ప్రతి తరగతిలో హాజరు సంఖ్య పెరిగింది. ప్రభుత్వం అందిస్తున్న ఇలాంటి పథకాలను పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకుని, చక్కగా చదువుకుని భవిష్యత్తులో వారి ఆశయాలను నెరవేర్చుకోవాలి.

- వెంకటసుబ్బయ్య, ఏపీసీ, ఎస్ఎస్ఏ

సైబర్ నేరగాళ్ల ఉచ్చు

● బాధితుడు ఇంటర్నెట్ సెంటర్ నిర్వాహకుడు
● నాలుగు విడతలుగా రూ.35 వేల జమ
● ఆపై పోలీసులమంటూ హెచ్చరిక
● ఖాతాలో కనిపించని నగదు



సీసీ ఫుటేజీలో రికార్డు అయిన యువకుడి (ఫైల్)

సంగం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాంధీ జనసంఘంలో ఓ ఇంటర్‌నెట్ సెంటర్ యువకుడు సైబర్ నేరాలకు మోసపోయాడు. బాధితుడి వివరాల మేరకు, గ్రామంలో కే.కృష్ణ ఇంటర్నెట్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. గురువారం ఉదయ 8 గంటల సమయంలో ఓ యువకుడు వచ్చి ఫోన్ పే చేస్తా నగదు ఇస్తావా.. అని అడిగాడు. నాలుగు విడతలుగా రూ.1500, రూ.27వేలు, రూ.3వేలు, రూ.3500 చొప్పున రూ.35 వేలు వేశాడు. ఆ తర్వాత కృష్ణ సదరు యువకుడికి రూ.35 వేల క్యాష్ ఇచ్చాడు. యువకుడు వెళ్లిన కొంతసేపటికి గుర్తుతెలియని ఓ యువకుడు 96208 71276 నంబరుతో ఫోన్ చేసి మీ ఖాతాకు క్యాష్ వేశారు. డబ్బులు వెనక్కి వేయకపోతే పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదవుతుందని బెదిరించారు. అయితే బాధితుడు ఫోన్‌పే వేశారు, క్యాష్ ఇచ్చానని చెప్పాడు. మధ్యాహ్నం తరువాత ఖాతాలో బ్యాలెన్స్ చూడగా గతంలో ఉన్న రూ.9000 మాత్రమే ఉంది. యువకుడు వేసిన రూ.35 వేల నగదు మాయమయింది. ఏదో మోసం జరిగిందని పోలీసులకు ఫిర్యాదు చేయడానికి బయలుదేరుతుండగా సాయంత్రం 4 గంటల సమయంలో అదే ఫోన్ నెంబర్ నుంచి ఫోన్ చేసి మీ మీద కేసు నమోదయిందంటూ బెదిరించాడు. తన ఖాతాలో డబ్బులు జమ కాలేదని, తానే పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వెళుతున్నా.. అక్కడే తేల్చుకుందాం రా... అని కృష్ణ చెప్పడంతో ఫోన్ కట్ అయింది. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పొగాకు సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

లింగసముద్రం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పొగాకు సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని కందుకూరు పొగాకు బోర్డు రెండవ వేలం కేంద్రం నిర్వహణాధికారి చంద్రశేఖర్ చెప్పారు. పొగాకు నారు, పంటపై మాగుడు, నారుకుళ్ల తెగుళ్ల ఆశించకుండా అధికారులు సూచించిన విధంగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. సీనియర్ గ్రేడింగ్ అధికారి రాజగోపాల్ మాట్లాడుతూ పొగాకు రైతులందరూ అంతర్జాతీయ పొగాకు మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకొని యాజమాన్య పద్ధతులు పాటిస్తూ తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ నాణ్యమైన పొగాకు పండించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ మేనేజరు విజయ్‌కుమార్, జీపీఐ మేనేజరు సుబ్బానాయుడు, క్షేత్ర సాంకేతిక సహాయకులు కార్తీక్, రైతులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం

ఏఎస్ పేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరులోని ఎస్వి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు తెల్లపాడు గ్రామంలో గత కొన్ని రోజులుగా ఎన్ఎస్ఎస్ శిబిరం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం స్థానిక పీహెచ్‌సీ వైద్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులు, టీకాలుపై అవగాహన కల్పించారు. పలువురిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు కె లక్ష్మీనరసింహస్వామి తదితరులు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు



బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 12077
వెండి కిలో ధర	రూ. 163800
వెండి ఒక గ్రాము	రూ. 168.80

నేటి నుంచి గండిపాళెంలో ఎన్ఎస్ఎస్ శిబిరం

ఉదయగిరి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం గ్రామంలో శుక్రవారం నుంచి వచ్చేనెల 4వ తేదీ వరకు మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించి వివిధ సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు ఇన్‌చార్జి కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ గోపికృష్ణ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

రహదారులే డంపింగ్ యార్డులు!

● ప్రజలు, వాహనదారుల అవస్థలు

ఉదయగిరి రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెంలో నివాసాల నుంచి సేకరించిన చెత్తా, చెదారాన్ని కేంద్రానికి తరలించకుండా ప్రధాన రహదారి పక్కనే పడేయడంతో డంపింగ్ యార్డుగా తయారవుతోందని స్థానికులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి పక్కనే చెత్తా, చెదారాన్ని వేయడంతో ప్రభుత్వ వైద్యశాల, పాఠశాలలు, ఇతర వ్యాపారాల సముదాయాలకు పరుగులు తీసే ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది. జోరుగా గాలి వీచిన సమయంలో ప్లాస్టిక్ కవర్లు, చిత్తు కాగితాలు వారిపై పడడంతో పాటు వర్షాల సమయంలో దుర్గంధం వెదజల్లుతోందని వాపోతున్నారు. దుకాణదారులు సైతం ఆ ప్రాంతంలోనే చెత్తను పడేస్తుండడంతో పరిస్థితి మరీ అధ్వానంగా మారుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారులపై చెత్తా చెదారం వేయకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



రహదారి పక్కనే పడేసిన చెత్తా, చెదారం

నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



బేస్‌మట్టాల నాణ్యతను పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ బృందం

ఉదయగిరి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాయపాళెం పంచాయతీ గంగిరెడ్డిపల్లి జగనన్న లేఅవుట్‌లో గత ప్రభుత్వం పేదలకు ఆప్షన్-3 కింద థర్డ్ పార్టీ నిర్మించిన బేస్‌మెంట్‌ల నిర్మాణాల్లో నాణ్యతాప్రమాణాలను అధికారులు, కాంట్రాక్టర్ల సమక్షంలో క్వాలిటీ కంట్రోల్ బృందం గురువారం పరిశీలించింది. లేఅవుట్‌లో ఆప్షన్-3 కింద లబ్ధిదారులు, అధికారుల సంయుక్త ఒప్పందంతో 141 పక్కాగృహాల బేస్‌మెంట్‌ల నిర్మాణాన్ని కాంట్రాక్టర్‌కు అప్పగించింది. అయితే కాంట్రాక్టర్ ప్రభుత్వం ఇచ్చిన నగదుతో బేస్‌మెంట్‌ల నిర్మాణాన్ని తూతూమంత్రంగా నిర్మించి పక్కాగృహాల నిర్మాణాలను చేపట్టలేదు. ప్రస్తుతం ఆ బేస్‌మెంట్‌లపై తదుపరి ఇళ్ల నిర్మాణం చేయవచ్చా.. లేదా.. పరిశీలించాలని ప్రభుత్వం ఆదేశించడంతో క్వాలిటీ బృందం నిశితంగా పరిశీలించి యాప్‌లో నమోదు చేశారు. అయితే క్వాలిటీ కంట్రోల్ బృందం పరిశీలనలో అవి ఇంటి నిర్మాణానికి పనికిరావనేది సమాచారం. మరి అధికారులు ఏం చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఇన్‌చార్జి ఏఈ షరీఫ్, వర్కుఇన్‌స్పెక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు శివయ్య, రవి, ఆదిశేషారెడ్డి, నరసింహా, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి తాలుకా

ఏపీజీఈఏ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎంపికైన ఉదయగిరి తాలుకా ప్రభుత్వ ఉద్యోగుల సంఘ కార్యవర్గం

ఉదయగిరి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి తాలుకా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఏపీజీఈఏ) అధ్యక్షుడిగా షేక్ అబ్దుల్‌మజీద్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. గురువారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్ర ఆవరణలో ఎన్నికల అధికారిగా షేక్ మహ్మద్‌జావీద్, సహాయ ఎన్నికల అధికారిగా వీ ఫణీంద్రల సమక్షంలో ఉదయగిరి తాలుకా ఏపీజీఈఏ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. తాలుకా ఏపీజీఈఏ అధ్యక్షుడిగా షేక్ అబ్దుల్‌మజీద్, అసోసియేట్ అధ్యక్షుడిగా జగన్‌మోహన్, కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్, ట్రెజరర్‌గా ఎండీ రియాజ్, ఉపాధ్యక్షులుగా ఖాజాముబారక్, వీ.రమాదేవి, కార్యనిర్వాహక కార్యదర్శిగా పెంచలరావు, సంయుక్త కార్యదర్శులుగా మన్సూర్‌అలీ, లింగరాజు, శ్రీదేవిలను సభ్యుల సమ్మతితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు బీ సుధాకర్‌రెడ్డితోపాటు ఎన్నికల అధికారులు, ఉద్యోగులు, స్నేహితులు సన్మానించి అభినందనలు తెలిపారు.

టిడ్కో భవన సముదాయంలో కార్డన్ సెర్చ్

● 19 మోటారు వాహనాల స్వాధీనం



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ వేణుగోపాల్

ఆత్మకూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధిలోని టిడ్కో భవన సముదాయంలో గు రువారం తెల్లవారుజామున డీఎస్పీ కె వేణుగోపాల్ ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు వారు అక్కడ నివసిస్తున్న ఇళ్లకు వెళ్లి ఆధార్‌కార్డులు పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అనుమతులు లేని 19 మోటారు వాహనాలు, రెండు ఆటోలను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ కె వేణుగోపాల్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు ఆత్మకూరు సీఐ జి గంగాధర్‌తో పాటు డివిజన్ పరిధిలోని 8 మంది ఎస్‌ఐలు, 50 మంది కానిస్టేబుళ్లతో తనిఖీలు నిర్వహించామన్నారు. అసాంఘిక కార్యక్రమాలు, మత్తు పదార్థాల అక్రమ రవాణా అరికట్టడం, నేరాలను అదుపు చేయడానికి ముందస్తుగా సూచనలు చేయడం కోసం కార్డన్‌సెర్చ్ నిర్వహించామన్నారు. అనంతరం ఆత్మకూరు ఎస్ షేక్ జిలానీ స్వాధీనం చేసుకున్న వాహనాల పత్రాలను పరిశీలించి యజమానులకు అప్పగించారు.

జాదూగర్ పితారే కిట్ బాక్సుల పంపిణీ



ప్రధానోపాధ్యాయులకు బాక్సులు పంపిణీ చేస్తున్న ఎంఈవో

ఉదయగిరి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంఈవో కార్యాలయంలో గురువారం ప్రధానోపాధ్యాయులకు జాదూగర్ పితారే కిట్ బాక్సులను ఎంఈవో-2 టీ.శ్రీనివాసులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని తొమ్మిది పాఠశాలలకు జాదూగర్ పితారే కిట్ బాక్సులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఆ కిట్‌లను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేయడం జరిగిందన్నారు. ఈ కిట్లను విద్యార్థులకు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు షేక్ షబ్బీర్, రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కక్ష సాధింపులకు పాల్పడే వ్యక్తిని కాదు : ఎమ్మెల్యే కాకర్ల

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తొలినుంచి తాను కక్ష సాధింపులకు పాల్పడే వ్యక్తిని కాదని శాసనసభ్యుడు కాకర్ల సురేష్ అన్నారు. గురువారం నార్త్‌కొండాయపాళెంలో రూ. 2.13 కోట్లతో నిర్మించిన తారు, సిమెంటు రోడ్లను సతీమణి ప్రవీణతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం నిర్వహిం చిన సమావేశంలో మాట్లాడుతూ ప్రశాంత వాతావరణం కలిగిన ఉదయగిరి నియోజకవర్గంలోని జల ాంకి మండలం చింతలపాలెంలో టీడీపీ నాయకుడు గొట్టి పాటి ప్రసాద్‌నాయుడు హత్యకు గురికావడం అత్యంత దురదృష్టకరమన్నారు. పోలీస్ స్టేషన్ల లోను కేసులను తగ్గించేందుకు తనవంతుగా కృషి చేస్తున్నానన్నారు. ప్రస్తుత తరుణంలో పార్టీ నాయ కులు, కార్యకర్తలు సైతం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లోను విజయం సాధించేందుకు సమిష్టిగా కృషి చేయా లన్నారు. మిగిలిన 12 పంచాయతీల్లోను త్వరిత గతిన గ్రామ కమిటీలను నియమించడం జరుగుతుందన్నారు. వాటిల్లో యువత, మహిళలకు ప్రాధాన్యత కల్పించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో నాయకత్వాన్ని బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈప్రాంతంలో నీటి సమ స్య పరిష్కారానికి వెలుగొండను పూర్తి చేసేందుకు పాటు పడతానన్నారు. తొలుత ప్రసాద్ నాయుడు మృతికి సంతాపం తెలుపుతూ మౌనం పాటించారు. అనంతరం కాకర్ల దంపతులను శాలువాలు, పూల మాలతో నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చంద్ర మధుసూనరావు, జడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, క్లస్టర్ ఇన్‌చార్జి పోకా మహేశ్వరరావు, సొసైటీ, గండిపాళెం ప్రాజెక్టు ఛైర్మన్లు ఛైర్మన్ గుర్రం గోపి, అడుసుమల్లి వెంకటసుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌యాదవ్, తెలుగు యువత అధ్యక్షుడు ముజ్జె లక్ష్మీ నారాయణ, ఎస్టీ కార్పొరేషన్ డైరక్టర్ ఆవుల అరుణమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

మృతులకు నివాళి

●వింజమూరు: కర్నూలు బస్సు ప్రమా దంలో మృతిచెందిన గోళ్ల రమేష్, గోళ్ల అనూష, వారి ఇద్దరు చిన్నారులకు ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ నివాళులర్పించారు. గురువారం దశదిన కర్మలో ఎమ్మెల్యే కాకర్ల పాల్గొని కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో స్థానిక నా యకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కావలి ఆర్డీవో వంశీకృష్ణ

దుత్తలూరు (ఉదయగిరి), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రజావిజ్ఞప్తుల దినం సందర్భంగా ప్రజలు అందజేసే అర్జీలకు సత్వరమే పరిష్కార మార్గం చూపాలని కావలి ఆర్డీవో వంశీకృష్ణ సూచించారు. గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి పరిష్కార మార్గం చూపాలన్నారు. ఈ సందర్భంగా ప్రజలు అందజేసిన అర్జీలను పరిశీలించి వారితో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు యనమల నాగరాజు, సర్వేయర్ శివ, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి భూమిపూజ

సంగం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ఆలయాల అభివృద్ధికి గ్రామస్థులతో కలిసి టీడీపీ నాయకులు గురువారం భూమిపూజ చేశారు. గ్రామస్థుల కోరిక మేరకు దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి జండాదిబ్బలోని కోదండరామాలయం అభివృద్ధికి రూ. 5లక్షలు, అలాగే అన్నారెడ్డిపాళెం పల్లిపాళెం గ్రామంలోని వరసిద్ధి వినాయక గుడికి రూ. 5 లక్షలు, దువ్వూరులోని దువ్వూరమ్మతల్లి ఆలయానికి రూ. 5 లక్షల చొప్పున శ్రీవాణి ట్రస్ట్ నుంచి నిధులు మంజూరు చేశారు. దీంతో గ్రామస్థులతో కలసి టీడీపీ నాయకులు పనులకు భూమిపూజ చేశారు. ఈకార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు బాణా శ్రీనివాసులురెడ్డి, సంగం, దువ్వూరు పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ గుండ్లపల్లి శ్రీనివాసులు, బండారు హరికిషోర్‌రెడ్డి, సంగం సాగునీటి సంఘం అధ్యక్షుడు షేక్ బాబు, జండాదిబ్బ, పల్లిపాళెం, దువ్వూరు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

ఉదయగిరి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ అల శ్రీనివాసులు వాహన దారులను హెచ్చరించారు. గురువారం రాత్రి ఉదయగిరి పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రతిఒక్కరూ లైసెన్సు కలిగి ఉండడంతోపాటు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. వాహనాలు నడిపే సమయంలో సెలఫోన్ మాట్లాడరాదన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

ఏఎస్ పేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): చిన్న చిన్న విషయాలకు భయపడి కుంగిపోవడం, ఆత్మహత్యలు చేసుకోవడం వంటివి చేయకుండా ఆత్మ విశ్వాసంతో విద్యార్థులు ముందడుగు వేయాలని సంగం సీఐ వేమారెడ్డి సూచిం చారు. గురువారం ఆయన స్థానిక ఠాగూర్ పాఠశాల విద్యార్థులకు రోడ్డు భద్రత, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, ఆత్మవిశ్వాసం తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పదవ తరగతి ఎస్ఎస్‌లో ప్రథమ, ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ సైదులు, పాఠశాల కరస్పాండెంట్ రమణారెడ్డి, హెచ్‌ఎం దొరస్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు అభివృద్ధిలో పురోగతి సాధించాలి

సీతారామపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బ్యాంకు అభివృద్ధిలో పురోగతి సాధించాలని కెనరా బ్యాంకు తిరుపతి సర్కిల్ జనరల్ మేనేజర్ పాండురంగ మితంతయ్య అన్నారు. ఆయన గురువారం స్థానిక కెనరా బ్యాంకును పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు ఖాతాదారులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించేలా భవనాన్ని తీర్చిదిద్దామన్నారు. కెనరా బ్యాంకు ఎన్నో రకాల రుణాలతో పాటు ప్రత్యేక పథకాలను సైతం ఖాతాదారులకు చేరువ చేస్తున్నందున, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కెనరా ఏంజిల్, యాస్పైర్‌ప్రోడక్ట్ , విద్యార్థులకు అందించే పలు రకాల విద్యారుణాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంకు ఏజీఎం ఆదరి నాగరాజు, స్థానిక కెనరా బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

దాడి చేశారంటూ ఫిర్యాదు

చేజర్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తనపై ముగ్గురు వ్యక్తులు దాడి చేశారంటూ మండలంలోని బోడిపాడు గ్రామానికి చెందిన చెంచురామిరెడ్డి అనే వ్యక్తి గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి కథనం మేరకు... బోడిపాడు సమీపంలోని తన భూమిలో వ్యవసాయ పనులు చేస్తుండగా అదే గ్రామానికి చెందిన బోయిళ్ళ రవీంద్రరెడ్డితో పాటు మరో ఇద్దరు కలిసి తనపై దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. కాగా, దాడి సమాచారం తెలుసుకున్న కుటుంబసభ్యులు గాయపడ్డ చెంచురామిరెడ్డిని ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. ఈ సంఘటనపై విచారించి కేసు నమోదు చేయనున్నట్లు ఎస్‌ఐ తిరుమలరావు తెలిపారు.

పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి

ఆత్మకూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, పచ్చదనంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో పి రఫీఖాన్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం మండలంలోని సంఘబంధం అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, పొదుపు మహిళలు, విపీవోలకు సుస్థిర అభివృద్ధి, పరిశుభ్రమైన పచ్చని గ్రామ లక్ష్యసాధనకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్త పంచాయతీ సిబ్బంది సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించి వర్మీకంపోస్టును తయారుచేయడంపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం ఎం హరి, తదితరులు పాల్గొన్నారు.

పునర్విభజనపై జనసేన సంతకాల సేకరణ

కలువాయి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలు, డివిజన్ల పునర్విభజనలో భాగంగా కలువాయి మండలం గూడూరు రెవెన్యూ డివిజన్‌లోకి, తిరుపతి జిల్లా పరిధిలోకి తీసుకెళుతూ మంత్రివర్గ ఉపసంఘం చేసిన ప్రతిపాదనలను ప్రభుత్వం ఆమోదించకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, జిల్లా మంత్రులు, కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేసేందుకు గురువారం కలువాయిలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో సంతకాలు సేకరించారు. 140 కిలో మీటర్లు దూరంలో ఉన్న తిరుపతి జిల్లాలో కలువాయి కలిపితే ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని వారు పేర్కొన్నారు. నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల పార్టీ అధ్యక్షుడు పెరంకొండ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపాలి



సీతారామపురం: రైతులకు కరపత్రాలను పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

సీతారామపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని బెస్తకాలనీ, పరమటివీధిలో స్థానిక టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో రైతన్నా మీకోసం కరపత్రాలను గురువారం పంపిణీ చేశారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి టిడిపి నాయకులు, మండల వ్యవసాయాధికారి పి చెన్నరెడ్డి, రైతు సేవా కేంద్రం సిబ్బంది రైతుల ఇంటింటికి తిరుగుతూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చెన్నరెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మొగ్గుజూపాలని, రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రీయ ఎరువులు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు వీకాష్ బాబు, సొసైటీ ఛైర్మన్ రాజశేఖర్, ఇజ్రాయిల్, జనసేన పార్టీ నాయకులు భోగినేని కాశీరత్తయ్య, ముస్లిం మైనారి నాయకుడు షేక్‌బాబు, పిడుగు జయం ాములు, తోట ఏడుకొండలు, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

●ఉదయగిరి: మండలంలోని కృష్ణంపల్లి గ్రామంలో గురువారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్ ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో పంటలు సాగుచేసే రైతులు విత్తనశుద్ధి, సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వివరించారు. అనంతరం బిందు, తుంపర్ల సేద్య పరికరాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

●సంగం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నవరపాడు, అనసూయనగర్, దువ్వూరు గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ యాంత్రీకరణ సర్వేపై అవగాహన కల్పించారు. అదేవిధంగా వరికి బదులు ప్రత్యామ్నాయ పంటల సాగు, పంచ సూత్రాలు తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కోవూరు ఏడీఏ అనిత, వ్యవసాయాధికారి శశిధర్, వీఏఏలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండపం నిర్మాణానికి భూమిపూజ

ఆత్మకూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాల్టీ పరిధిలోని మినీ బైపాస్ రోడ్డు సమీపంలో ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న కల్యాణ మండపానికి గురువారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్, నిత్యాన్నదాత కంచి పరమేశ్వరరెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. కల్యాణ మండపం నిర్మాణానికి తనవంతుగా రూ. 2,00,000 విరాళాన్ని ప్రకటించారు. అదే క్రమంలో పలువురు భక్తులు సైతం విరాళాలు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, పలువురు పురప్రముఖులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

CRIME NEWS

నకిలీ కరెన్సీ రాకెట్ గుట్టురట్టు

● రూ.37.5 లక్షల నోట్ల స్వాధీనం
● నలుగురితోపాటు 22 కేజీల గంజాయి పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న రూరల్ డీఎస్పీ

నెల్లూరురూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరురూరల్ పోలీసుల సారథ్యంలో నకిలీ కరెన్సీ నోట్ల మార్పిడి భారీ రాకెట్‌ను రట్టు చేశారు. గట్టుచప్పుడు కాకుండా నడుస్తు ఈ బాగోతాన్ని బట్టబయలు చేసి నలుగురు నిందితులతోపాటు భారీగా గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఆ వివరాలను రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ గుంజి వేణు గురువారం రూరల్ పోలీసు స్టేషన్‌లో వివరించారు. నెల్లూరురూరల్లోని ధనలక్ష్మీపురం సమీపాన సాయి శ్రీసిటీ లేఅవుట్ 8వ క్రాస్ రోడ్డు వద్ద ఓ ఇంట్లో గంజాయి, నకిలీ కరెన్సీ నోట్ల మార్పిడి జరుగుతున్నట్లు అందిన సమాచారంతో పోలీసులు రెక్కీ నిర్వహించారు. అల్లూరు మండలం ఇస్కపల్లి పంచాయతీ కుర్రులబ్బిపాళెంకు చెందిన ప్రధాన నిందితుడు మున్నా అలియాస్ అశోక్‌రెడ్డి అలియాస్ కార్తీకొండను పట్టుకునే ప్రయత్నం చేయగా పరారయ్యాడు. అతడ్ని వెంబడించిన పోలీసులు కొంతదూరం వెళ్లాక అదుపులోకి తీసుకున్నారు. మున్నా ఇచ్చిన సమాచారంతో ధనలక్ష్మీపురం వద్దనున్న ఇంటిపై రైడ్ చేయగా అప్పటికే ఆ ఇంట్లో ముత్తుకూరు బీసీ కాలనీకి చెందిన షేక్ రియాజ్, షేక్ ముస్తఫా, పిడతాపోలూరుకు చెందిన బెల్లంకొండ అనిల్ ఉండటాన్ని పోలీసులు గమనించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఇళ్లంతా సోదాలు చేయగా మార్పిడికి సిద్ధంగా ఉంచిన రూ. 37.50 లక్షల నకిలీ కరెన్సీ నోట్లు, ప్యాకెట్ల తయారీకి సిద్ధంగా ఉంచిన 22కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మరో 3కేజీల గంజాయిని అప్పటికే అమ్మేసినట్లు విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు. యూపీ 16 ఏవై 8088 నెంబరు గల జాగ్వార్ కారును స్వాధీనం చేసుకోవాల్సి ఉండగా, కొన్ని స్కూటర్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అత్యంత రహస్యంగా ఈ రాకెట్‌ను నడుపుతున్నారని, దీనిని చాకచక్యంగా పట్టుకున్నట్లు డీఎస్పీ, సీఐలు వెల్లడించారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

● గతంలో ఇక్కడే డ్రగ్స్ తయారీ ముఠా గుర్తింపు

కొన్ని నెలల క్రితం ధనలక్ష్మీపురం సమీపాన (కలివెలపాళెంకు వెళ్లేదారి) డ్రగ్స్ తయారీ ముఠాను పోలీసులు పట్టుకున్నారు. తిరుపతి జిల్లా గూడూరుకు చెందిన కొందరు వ్యక్తులు ఈ ప్రాంతంలో ఇల్లు అద్దెకు తీసుకుని డ్రగ్స్ తయారీకి అవసరమైన ముడిసరుకును తీసుకువచ్చి తయారు చేస్తున్న క్రమంలో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. అప్పట్లో ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. తాజాగా భారీ మొత్తంలో నకిలీ నోట్లు, గంజాయి పట్టుబడటం గమనార్హం. నగరానికి శివారున ఉండటం, పోలీసు నిఘా తక్కువగా ఉందన్న అంచనాలతో నేరస్థులు ఈ ప్రాంతాన్ని ఎక్కువగా ఎంచుకుంటున్నారని స్థానికులు చెప్పుకొచ్చారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని

ఉత్తరాఖండ్ వలస కూలీ మృతి

● ఎమ్మెల్యే సురేష్ ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

జలదంకి, నవంబర్ 27 (ఆంధ్రజ్యోతి): జలదంకి మండలం 9వ మైలు సమీపంలో 167 బీజీ జాతీయ రహదారిపై గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉత్తరాఖండ్ రాష్ట్రానికి చెందిన వలసకూలీ దుక్కీ రామ్‌రాయ్ (45) మృతి చెందాడు. వరినాట్లు వేసేందుకు వలసకూలీలుగా ఉత్తరాఖండ్‌కు చెందిన 20 మంది 9వ మైలుకు వచ్చారు. ఉదయం నాట్లు వేసేందుకు పొలంలోకి వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో దుక్కీ రామ్‌రాయ్ రోడ్డుమార్జిన్‌లో కింద వేసి ఉన్న విద్యుత్ స్తంభాలపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనస్థలంలో వలసకూలీలు బోరున విలపించారు. సమాచారం అందుకున్న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అక్కడికి చేరుకుని మృతిచెందిన దుక్కీ రామ్‌రాయ్ మృతదేహాన్ని పరిశీలించారు. కూలీలకు ధైర్యంచెప్పి మృతదేహం తరలింపునకు మృతుడి కుటుంబానికి రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. వలస కూలీని ఢీకొన్న వాహనాన్ని స్వాధీనం చేసుకుని, నిందితుడిని శిక్షించాలని ఎమ్మెల్యే పోలీసులను ఫోన్‌లో ఆదేశించారు. అనంతరం కూలీ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు.

కృష్ణపట్నం తీరంలో మృతదేహం గుర్తింపు

ముత్తుకూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కృష్ణపట్నం సముద్రతీరంలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. అలల తాకిడికి తీరానికి మృతదేహం కొట్టుకొచ్చింది. స్థానికుల సమాచారంతో కృష్ణపట్నం ఎస్‌ఐ జేపీ శ్రీనివాసులురెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు 45 సంవత్సరాల పైన ఉండవచ్చని, కుడిచేతికి నల్లని దారం ధరించి ఉన్నాడన్నారు. నాలుగైదు రోజుల క్రితం మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

రెండుచోట్ల రోడ్డు ప్రమాదాలు

● పలువురికి గాయాలు

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై రెండు వేర్వేరు ప్రాంతాల్లో గురువారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాల్లో పలువురు గాయపడ్డారు. బుచ్చి పట్టణంలోని రాజకిషోర్ థియేటర్ సెంటర్ వద్ద రోడ్డు పక్కన ఆగివున్న ఆటోను వెనుకనుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో ఆటో ముందున్న పాల వ్యానును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఓ మహిళ కాలికి తీవ్ర గాయమైంది. టోల్‌గేట్ వద్ద ముందు వెళ్తున్న ఆటో, బైకును వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టడంతో ఆటో బోల్తా పడింది. దీంతో ఆటోలో ఉన్న ముగ్గురిలో ఒకరికి, స్కూటరిస్టుతోపాటు, కారు డ్రైవర్‌కు గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

సెల్ టవర్ రేడియో యూనిట్ చోరీ

నెల్లూరు(క్రైం), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఎయిర్‌టెల్ సెల్ టవర్ లోని రిమోట్ రేడియో యూనిట్‌ను గుర్తుతెలియని దొంగలు దోచుకెళ్లారని వేదాయపాలెం పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.... నెల్లూరు రూరల్ సౌత్‌మోపూరుకు చెందిన రాపూరు కాళయ్య ఇన్‌డూస్ టవర్స్ సంస్థలో ఎస్‌అండ్‌ఐబీ సెక్యూరిటీ కంపెనీ తరపున జిల్లాలోని టవర్స్‌కు పెట్రోలింగ్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు. నెల్లూరు నగరంలోని డ్రైవర్సు కాలనీ బిట్-2 వద్ద ఉన్న ఎయిర్‌టెల్ టవర్‌లో ఉన్న రిమోట్ రేడియో యూనిట్‌ను ఈ నెల 19వ తేదీ రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. ఈ విషయాన్ని ఎఫ్ఎస్ఈ హనుమంతురావు గుర్తించి కాళయ్యకు సమాచారం అందించారు. దీంతో అతను టవర్‌ను పరిశీలించి ఉన్నతాధికారులకు తెలిపారు. గురువారం వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	120
స్కిన్ చికెన్	218
స్కిన్‌లెస్	242

కోడిగుడ్ల ధర (100): 660

ఆర్‌ఆర్ పాలెం గ్రామంలో సమస్యలు పరిష్కరించండి

లింగసముద్రం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆర్‌ఆర్ పాలెం గ్రామంలో సమస్యలను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. గ్రామంలోని కొన్ని విద్యుత్ స్తంభాలకు వీధిలైట్లు వెలగడం లేదు. దీంతో రాత్రి సమయంలో ఇబ్బందులు పడుతున్నామని, రాత్రివేళ బయటకు వస్తే పాములు, విష పురుగులు కాటేస్తాయని గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. అలాగే గ్రామంలోని కొన్ని వీధులలో అంతర్గత రోడ్లు గుంతలుపడి అధ్వాన్నంగా ఉన్నాయి. కొన్ని చేతిపంపులు మరమ్మతులకు గురి కాగా, వాటిలో కొన్ని చేతిపంపుల సామాన్లు గుర్తుతెలియని వ్యక్తులు తీసుకెళ్లారని గ్రామస్థులు తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో సమస్యలను పరిష్కరించాలని గ్రామ టీడీపీ నాయకుడు కిలారి వెంకటేశ్వర్లు కోరారు.



వెలగని వీధిలైటు

నిరుపయోగంగా నీటి ట్యాంకు



శింగరపాలెం వద్ద నిరుపయోగంగా ఉన్న నీటి ట్యాంకు

లింగసముద్రం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మారెడ్డిపాలెం పంచాయతీ పరిధిలోని శింగరపాలెం ఆదిఆంధ్ర కాలనీవాసుల దాహార్తి తీర్చేందుకు 2023లో జలజీవన్ మిషన్ పథకం కింద నిర్మించిన మంచినీటి ట్యాంకు నిరుపయోగంగా మారింది. దీంతో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ట్యాంకు నిర్మాణ పనులు పూర్తిచేసి గ్రామ పంచాయతీకి అప్పగించారు. అయితే ఈ ట్యాంకులోకి నీటిని నింపేందుకు, ఆ నీటిని కుళాయిలకు అందించేందుకు గ్రామ పంచాయతీ వారు ఒక మనిషిని నియమించలేదు. దీంతో ఈ ట్యాంకు నుండి మంచినీరు రావడం లేదని కాలనీవాసులు చెప్పారు. దీంతో లక్షలాది రూపాయలతో నిర్మించిన మంచినీటి ట్యాంకు ఎవరికీ ఉపయోగపడకుండా నిరుపయోగంగా గ్రామానికి అలంకారంగా ఉంది. ఈ విషయమై మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సీహెచ్ రాజశేఖర్ మాట్లాడుతూ, నీరు వదిలే వ్యక్తి గతంలో పని చేశాడని అతనికి సుమారు 20 నెలలకు జీతం ఇవ్వాల్సి ఉందని, ఎంపీడీఓతో మాట్లాడి ఈ సమస్యను పరిష్కరించి, ఈ ట్యాంకు నుంచి మంచినీటిని సరఫరా చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉలవపాడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉలవపాడు 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు సంబంధించిన 11కేవీ ఫీడర్ మరమ్మతు పనులు శుక్రవారం చేపట్టనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉలవపాడు, కొల్లూరుపాడు గ్రామాల పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిలిపివేస్తారని, వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని కోరారు.

వృత్తివిద్యలో రాణిస్తే బంగారు భవిష్యత్తు

కందుకూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వృత్తివిద్యలో రాణిస్తే బంగారు భవిష్యత్తు ఉంటుందని స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ షేక్ రియాజుద్దీన్ పేర్కొన్నారు. స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల 9,10 తరగతుల విద్యార్థుల వృత్తివిద్యా శిక్షణలో భాగంగా గురువారం పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించారు. ఈసందర్భంగా సాంకేతిక విద్య పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించటంతో పాటు ఉపాధి అవకాశాలు, ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ఉన్న మార్గాలపై వారికి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం యస్ మాధవరెడ్డి, స్టాఫ్ సెక్రటరీ చిత్తారి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు రాంబాబు, సుధాకర్, ప్రతాప్‌రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కావలి మండల సర్వసభ్య సమావేశం

కావలి రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కావలి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సాధారణ సర్వసభ్యసమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీదేవి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు ఎంపీపీ ఆలూరు కొండమ్మ అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో శాఖలవారీగా పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ అభివృద్ధి అధికారులు, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొనాలని సూచించారు.

అధ్వానంగా తాళ్లపాలెం రోడ్డు



కావలి రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కావలి మండలం ఆముదాలదిన్నె వద్ద తాళ్లపాలెం మార్గం దెబ్బతినటంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొంథా తుఫానుకు మురుగు నీరు నిల్వ ఉండడంతో రోడ్డు పూర్తిగా దెబ్బతినింది. నిత్యం ఆ మార్గంలో వెళ్లే వందలాది మంది వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

29న మెగా జాబ్‌మేళా



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, శ్రీ గాయత్రీ విద్యాసంస్థల కరస్పాండెంట్ రామకృష్ణారావు తదితరులు

కందుకూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వెనుకబడ్డ కందుకూరు ప్రాంత నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించట మే లక్ష్యంగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీ గాయత్రీ విద్యాపరిషత్ డిగ్రీ కళాశాలలో ఈనెల 29న మెగా జాబ్‌మేళాకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. 18నుంచి 45 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు ఈ జాబ్‌మేళాకు హాజరుకావచ్చునని తెలిపారు. 15కి పైగా ప్రముఖ కంపెనీలు ఈ జాబ్‌మేళాలో పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని, వీరు 910 మందికి ఉద్యోగాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నందున యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి, అర్హత కలిగిన యువతీయువకులు ఏపీ ప్రభుత్వ నైపుణ్యం పోర్టల్‌లో రిజిష్టర్ చేసుకుని అలాట్‌మెంట్ లెటరుతో 29న ఉదయం 9 గంటల నుంచి నేరుగా ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చునని తెలిపారు. ఇకముందు ప్రతి రెండుమూడు నెలలకు ఒకసారి కందుకూరు నియోజకవర్గంలో ఇలాంటి జాబ్‌మేళాలు నిర్వహించేందుకు కృషిచేస్తున్నట్లు ఎమ్మెల్యే నాగేశ్వరరావు తెలిపారు.

కుష్ఠు వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించాలి



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారిణి సుజాత

కావలి (టౌన్) నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించాలని జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ సుజాత పేర్కొన్నారు. డాక్టర్ సుజాత, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో ఖాదర్ వలిలు గురువారం పట్టణంలోని రాజీవ్ నగర్, పుల్లారెడ్డినగర్‌లను సందర్శించారు. ఈనెల 17 నుంచి జరుగుతున్న కుష్ఠు వ్యాధి సర్వేని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. అనంతరం ఏరియా వైద్యశాలలోని డిప్యూటి డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో డివిజన్ స్థాయి ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలకు ఆర్బీహెచ్ 2.0 శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కావలి డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో బ్రిజిత, అర్బన్ మెడికల్ ఆఫీసర్లు, డీపీఎంవో నరసారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కోదండరామస్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ



శింగరపాలెంలో కోదండరామస్వామి ఆలన ధ్వజస్తంభం ప్రతిష్ఠలో పాల్గొన్న కందుకూరు వైసీపీ ఇన్‌చార్జ్ బుర్రా మధుసూదన్ తదితరులు

లింగసముద్రం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మారెడ్డిపాలెం పంచాయతీ పరిధిలోని శింగరపాలెం గ్రామంలో కోదండరామస్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ గురువారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, కందుకూరు వైసీపీ ఇన్‌చార్జ్ బుర్రా మధుసూదన్‌యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పెన్నా కృష్ణయ్య, మండల వైసీపీ అధ్యక్షుడు నోటి వెంకటేశ్వరరెడ్డి, వైసీపీ నాయకులు గణేశం గంగిరెడ్డి, డబ్బుగొట్టు కాలేష్, నాగభూషన్, మహేంద్ర పాల్గొన్నారు.

జలదంకి తహసీల్దారుగా సీతామహాలక్ష్మి



జలదంకి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జలదంకి తహసీల్దారుగా ఎస్. సీతామహాలక్ష్మి గురువారం తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. కందుకూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఏఓగా పని చేస్తున్న ఆమె నాలుగు రోజుల క్రితం జలదంకి తహసీల్దారుగా నియమితులయ్యారు. ఇక్కడ తహసీల్దారుగా పని చేసిన ఎం. ప్రమీలకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వనందున ఆమె నాలుగు రోజుల క్రితమే సెలవుపై వెళ్లారు. కాగా తహసీల్దారుకు కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు అభినందనలు తెలిపారు. మండల పరిధిలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దారు తెలిపారు.

ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక క్యాంప్

నెల్లూరు(విద్య), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని జీవీఆర్‌ఆర్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో గొలగమూడి మోడల్ స్కూల్‌లో గురువా రం నుంచి ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక క్యాంప్ ప్రారంభించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఏబీ రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే దేశభక్తి, జాతీ య భావాలు, సేవాగుణం కలిగి ఉండేలా తీర్చిదిద్దాలన్నారు. మహనీయుల సేవలను స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడిచేలా గురువులు బోధిం చాలని కోరారు. దీనిలో భాగంగానే ఎన్ ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో వారం రోజులు సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ జేడీ మహ్మద్ ఆయూబ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువు తోపాటు సామా జిక సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకుంటేనే ఉత్తమ పౌరులుగా ఎదుగు తారన్నారు. అనంతరం పాఠశాల ఆవరణ, పరిసరా లను శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రఘునా రా యణ, అనికేపల్లి సర్పంచ్ కే శీనయ్య, గ్రామ కార్యదర్శి ఈ అనూష, దోర్నాదుల వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీడీపీ నేత పమిడి నుంచి నా కుటుంబానికి రక్షణ కల్పించాలి



తల్లి, బిడ్డతో కలిసి విలేకరులతో మాట్లాడుతున్న బాధితురాలు గీతాంజలి

కావలి, నవంబరు27(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్రకార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి తనకు తన భర్త మధ్య గొడవలు పెట్టి మానసికంగా శారీరకంగా వేధిస్తున్నాడని ఆయననుంచి తనకు తన కుటుంబానికి రక్షణకల్పించాలని గీతాంజలి అనే వివాహిత ఆవేదన వ్యక్తం చేసారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో తల్లి కామాక్షి, బిడ్డతో కలిసి ఆమె మాట్లాడారు. ఆమె మాట్లాడుతూ కావలికి చెందిన తనకు 2016వ సంవత్సరంలో దగదర్తి మండలం మనుబోలుపాడుకు చెందిన చేజర్ల మహేశ్‌రెడ్డితో వివాహం జరిగిందన్నారు. తర్వాత కొద్ది రోజులకే భర్త తనను వేధిస్తుండడంతో సమస్య పరిష్కరిస్తానని పమిడి రవికుమార్ చౌదరి చెప్పాడన్నారు. అయితే సర్దుబాటు చేయకపోగా ఆయన గొడవలను మరింత పెద్దవి చేస్తున్నాడన్నారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో వచ్చి తనను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడని ఆమె వాపోయారు. మనుబోలుపాడు గ్రామంలో పమిడి గెస్ట్‌హౌస్‌కు పిలిపించి, తన భర్తతో పాటు మరికొందరు వ్యక్తులచేత తనపై దాడి చేయించారన్నారు. అప్పట్లో తన భర్తతో పాటు, పమిడి రవికుమార్‌చౌదరి మరి కొంతమందిపై కావలి రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నారు. ఈ కేసు విచారణ నిమిత్తం ఇటీవల కావలి కోర్టుకు వాయిదాకు వెళ్లగా, కోర్టునుంచి బయటకు వస్తుండగా తన భర్త మహేశ్వరరెడ్డి, మరికొందరు వ్యక్తులు రవికుమార్‌చౌదరి ప్రోద్బలంతో తనపై, తల్లి కామాక్షిపై దాడి చేయించారన్నారు. పమిడి రవికుమార్ చౌదరి మనుషులు తన ఇంటి చుట్టూ తిరుగుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. రవికుమార్ చౌదరి నుంచి తనకు, తన కుటుంబానికి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని ఆమె పోలీసులకు విన్నవించారు.

కపాడిపాలెంలో కార్డన్ సెర్చ్

● 22 వాహనాలు స్వాధీనం

నెల్లూరు(క్రైం), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని సంతపేట పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న కపాడిపాలెంలో గురువారం తెల్లవారు జామున పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. నగర ఇన్‌చార్జి డీఎస్పీ ఎం గిరిధర్ ఆధ్వర్యంలో పోలీసు అధికారులు బృందాలుగా ఏర్పడి కపాడిపాలెంను నాలుగు వైపుల నుంచి ముట్టడించారు. ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఇంటి యజమాని, కుటుంబ సభ్యుల వివరాలు సేకరించారు. పత్రాలు లేని 19 మోటారు బైక్‌లు, ఒక ఆటో, రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ మాట్లాడుతూ నేర నియంత్రణ, అసాంఘిక కార్యక్రమాల కట్టడే లక్ష్యంగా కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు. అనుమానాస్పద వ్యక్తులు, చట్టవ్యతిరేక కార్యకలాపాలు, మాదకద్రవ్యాల వినియోగంపై ప్రజలు డయల్ 112కుగానీ, స్థానిక పోలీసులకుగానీ సమాచారం అందించాలని కోరారు. కార్డన్‌సర్చ్‌లో సంతపేట, చిన్నబజారు, నవాబుపేట, దర్గామిట్ట, బాలాజీనగర్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు వైవీ సోమయ్య, చిట్టెం కోటేశ్వరరావు, జీ వేణుగోపాల్‌రెడ్డి, బీ కల్యాణ రాజు, కే సాంబశివ రావు, సిబ్బంది పాల్గొన్నారు.



కార్డన్ సెర్చ్‌లో ఓ ఇంటిని తనిఖీ చేస్తున్న ఇన్‌చార్జి డీఎస్పీ గిరిధర్

కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా చేవూరు నారాయణ

బుచ్చిరెడ్డిపాళెం, నవం బరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా కిసాన్ మోర్చా అ ధ్యక్షుడు, పెనుబల్లి ఎంపీ టీసీ చేవూరి వినయ్ నారాయణ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నిక య్యారు. ఈ మేరకు రా ష్ట్ర కిసాన్ మోర్చా అధ్య క్షుడు చిగురుపాటి కుమార స్వామి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నాయకులు, అభిమానులు వినయ్ నారాయణను శాలువాతో సత్కరించారు.

పనిచేసిన వారికే పదవులు

తమిళనాడు కాంగ్రెస్ ఎంపీ సుధా రామకృష్ణన్



మాట్లాడుతున్న మైలాడత్తూరు ఎంపీ సుధారామకృష్ణన్

మనుబోలు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీకోసం పని చేసేవారికి తప్పనిసరిగా భవిష్యత్తులో పదవులు ఉంటాయని తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకురాలు తమిళనాడు కాంగ్రెస్ ఎంపీ సుధా రామకృష్ణన్ అన్నారు. స్థానిక పద్మావతి కల్యాణ మండపంలో గురువారం సర్వేపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త బళ్ళ హరి ఆధ్వర్యంలో సంస్థాగత నిర్మాణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సమావేశంకు వచ్చిన ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ అన్నారు. రాష్ట్రంలో భవిష్యత్తు కాంగ్రెస్‌దేనన్నారు. దేశవ్యాప్తంగా రాహుల్‌గాంధీ చేపట్టిన సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమాన్ని కార్యకర్తలు ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ చింతామోహన్, తిరుపతి జిల్లా ఇన్‌చార్జి డీసీసీ బాల గురవబాబు, ఏపీ సీసీ అజర్ ఫర్, మదన్‌మోహన్, పాల్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను వేధించడం తగదు

కోవూరు, నవంబరు 27, (ఆంధ్రజ్యోతి): కోవూ రు సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తల్ని సీడీ పీఓ శారద వేధిస్తున్నా రని ఆంధ్రప్రదేశ్ మహి ళా సంఘం జిల్లా కార్య దర్శి రెహనాబేగం అన్నా రు. స్థానిక సీతాపోలయ్య భవనంలో గురువారం జరి గిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సీడీ పీఓ వ్యవహార శైలిపై అంగన్‌వాడీ కార్యకర్తలు తీవ్ర అసహనంతో ఉన్నార న్నారు. ఆమె సిబ్బందితో అసభ్యంగా మాట్లాడుతున్నారని చెప్పారు. అంగన్ వాడీ కార్యకర్తల్ని మానసికంగా హింసిస్తున్నారని చెప్పారు. సీడీపీఓ వ్యవ హారంపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు సుజాత, శేషమ్మ, సీఐటీయూ నాయకులు అఫ్రోజ్, బుజ్జయ్య, శేషయ్య మాట్లాడారు.

పూర్వ ఉపాధ్యాయిని ఆర్థిక సాయం

కోవూరు, నవంబరు 27, (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో గతంలో సంగీత ఉపాధ్యాయినిగా పనిచేసిన కమ తం అనూరాధ గురువారం విద్యార్థినులకు ఆర్థిక సహాయం అందించారు. 11 మంది పేద విద్యార్థినులకు ఒక్కొక్కరికి రూ 10,000 ఆర్థిక సహాయం అందించారు.

టిడ్కో లబ్ధిదారులకు ఈజీ హోమ్ ఫైనాన్స్ రుణమేళా



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్

కావలి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కావలి మున్సిపాల్టీ పరిధిలో ఉన్న టిడ్కో గృహాల లబ్ధిదారులకు గురువారం కావలి మున్సిపల్ కార్యాలయంలో ఈజీ హోమ్‌ఫైనాన్స్ ఆధ్వర్యంలో రుణమేళా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ వయసు పైబడడం, లో సిబిల్ వంటి కారణాల వల్ల బ్యాంకర్లు టిడ్కో లబ్ధిదారులకు రుణాలు ఇవ్వడం లేదన్నారు. వారి సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం ఈజీ హోమ్ ఫైనాన్స్ ద్వారా రుణ మంజూరుకు అవకాశం కల్పించిందన్నారు. సమావేశానికి హాజరు కాని లబ్ధిదాలరులకు శనివారం రుణమేళా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డీసీవో రామసుబ్బారావు, ఈజీ హోమ్ ఫైనాన్స్ సిబ్బంది, మెప్మా సీఎంఎం భారతి, సీఈవోలు కొడయ్య, విజయప్రతాప్, అరుణకుమారి, ప్రసన్న, సునీత, ఆర్పీలు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల పాత్ర కీలకం



సైకిళ్లు పంపిణీ చేస్తున్న రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్సీ రవిచంద్ర

అల్లూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఎదుగుదలలో ఇటు ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పాత్ర కీలకమని జాతీయ ప్రధాన కార్యదర్శి, శాసనమండలి సభ్యుడు బీద రవిచంద్ర అన్నారు. తల్లి బీద జయమ్మ పేరిట ఏర్పాటు చేసి జేఆర్‌ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని తమ స్వగ్రామమైన ఇస్కపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం 420 మంది విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావుతో కలసి ఆయన పాల్గొన్నారు. విద్యార్థులను పాఠశాలకు పంపించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనన్నారు. దాతలు, ప్రభుత్వ సహకారంతో పాఠశాలలో వంటశాల, భోజనశాల, తరగతి భవనాలను నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు. పాఠశాల అభివృద్ధిలో మిత్రుడు హరిశ్రీనివాస్ భాగస్వామ్యం ఉంటుందన్నారు. సోదరులిద్దరం ఒకే పార్టీలో ఉండాలనే ఉద్దేశంతో తిరిగి టీడీపీలోకి వచ్చానని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు తెలిపారు. అనంతరం బీద సోదరులను గ్రామస్తులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, ప్రముఖ వైద్యుడు లోకనాథం, దాతలు కూర్మాల పద్మశ్రీ, దివ్వెల హరిదాస్, లక్ష్మీవనజ, ఎంపీపీ దర్శిగుంట శశిరేఖ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితం నాశనం చేసుకోవద్దు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మనోహర్‌బాబు

కావలి,నవంబరు27(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలతో జీవితం నాశనం చేసుకోవద్దని ప్రముఖ చిన్నపిల్లల వైద్యుడు డాక్టర్ శ్రీరాం మనోహర్‌బాబు సూచించారు. జూనియర్ రెడ్‌క్రాస్ సలహాదారు బెజవాడ ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని ముసునూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డ్రగ్స్ వాడడంవల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు జగన్నాథ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ మనోహర్‌బాబు మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం సరదాగా ప్రారంభమై జీవితాన్ని నాశనం చేస్తుందన్నారు. డ్రగ్స్ వినియోగించేవారు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కోల్పోతారన్నారు. శరీరంలోని పలు అవయవాలు దెబ్బతింటాయన్నారు. కావలి రూరల్ ఎస్ఐ బాలక్రిష్ణ మాట్లాడుతూ సరదాగా సిగరెట్‌తో ప్రారంభమై చివరకు మాదకద్రవ్యాలకు బానిస అయితే జీవితం అర్ధంతరంగా ముగిసిపోతుందన్నారు. ఎవరైనా మాదక ద్రవ్యాలకు అలవాటు పడేందుకు ప్రయత్నిస్తే వెంటనే ఉపాధ్యాయులకు గానీ, పోలీసులకు గానీ తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది బెజవాడ అభిసాగర్, జేఆర్‌సీ కో ఆర్డినేటర్ రమణయ్య, ఉపాధ్యాయులు ప్రసాద్, జూనియర్ రెడ్‌క్రాస్ కన్వీనర్ హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడిని జయిస్తే విజయం

● ఆత్మహత్యలకు దూరం కావాలి ● వైద్య విద్యార్థులకు నిపుణుల సూచన

నెల్లూరు (వైద్యం), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మానసిక ఒత్తిడిని జయిస్తే వైద్య విద్యార్థులు విజయం సాధించవచ్చని నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి సూచించారు. గురువారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని సమావేశం మందిరంలో మొదటి సంవత్సరం వైద్య విద్యార్థులకు ఎమోషనల్ అసెస్‌మెంట్ ఆఫ్ స్టూడెంట్స్ బై ఎడ్యుకేషన్ అన్న అంశంపై సదస్సు నిర్వహించారు. వైద్య వృత్తి సేవా భావంతో కూడుకున్నదని వక్తలు చెప్పారు. వైద్యులుగా మారటానికి విద్యార్థులు ఎక్కువగా శ్రమించాల్సి ఉంటుందన్నారు. ఈ క్రమంలో ఒక్కోసారి ఆర్థి క, మానసిక, సామాజిక ఒత్తిడిని ఎదుర్కోవ ల సి వస్తుందన్నారు. క్షణికావేశంతో ఆత్మహత్య లకు పాల్పడరాదన్నారు. చెడు అలవాట్లు, వ్యస నాల జోలికి పోవద్దని సూచించారు. బెంగళూరు నుంచి వచ్చిన వైద్య నిపుణుడు నెల్సన్ మనోబ లానికి అవసరమైన చిట్కాలు వెల్లడించారు. సైక్రియాటిక్ విభాగం హెచ్‌వోడీ డాక్టర్ లక్ష్మీప్ర సన్న మానసిక స్థిరత్వం, సమస్యలను అధిగ మించడం వంటి వాటిని వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మస్తాన్‌బాషా, డాక్టర్ బెన్‌హర్, డాక్టర్ శరత్ పాల్గొన్నారు.



వైద్య విద్యార్థులతో వైద్య నిపుణులు

ప్రజల సూచనలతోనే పార్కులకు పేర్లు

● రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి




నెల్లూరు రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : తన నియోజకవర్గంలోని 29 పార్కు స్థలాలను కాపాడి, వాటికి ప్రహరీ నిర్మించినందుకు గర్వపడుతున్నానని, ఆ పార్కులకు స్థానికుల సూచన మేరకు పేర్లు పెడతామని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఆయన కార్యాలయంలో గురువారం మీడియాతో మాట్లాడారు. చంద్రన్న పార్కుల బాట పేరిట తొలి దశ పనులు రూ.7 కోట్లతో పూర్తి చేసినట్లు చెప్పారు. రూ.100 కోట్ల విలువ చేసే పార్కు స్థలాలు కాపాడటం సంతృప్తినిచ్చిందని తెలిపారు. ఆయా పార్కు స్థలాల్లో రెండు వేల మొక్కలు నాటామని, వాటిని స్థానికులు కాపాడుకోవాలని కోరారు. పార్కులకు ఎవరి పేర్లతో నామకరణం చేయాలన్నది స్థానికులే నిర్ణయించి తనకు ఫోన్ ద్వారాగానీ, వాట్సాప్ ద్వారాగానీ తెలపాలని పిలుపునిచ్చారు. కార్యాలయానికి వచ్చి తనతోనే నేరుగా కూడా చెప్పవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, సాబీర్‌ఖాన్, హజరత్ నాయుడు పాల్గొన్నారు.

కాగా, రాజకీయాల్లో విమర్శలు, ప్రతివిమర్శలు సాధారణమని ఎమ్మెల్యే అన్నారు. అధికార పార్టీ ప్రజలకు పని చేయాలి, అందులో లోపాలుంటే ప్రతిపక్షం ఎత్తిచూపాలి, కానీ మరొక పద్ధతిలో విమర్శలు చేస్తుంటే మా వాళ్లే సమాధానం చెప్తారన్నారు. తానే సమాధానం చెప్పాల్సిన పరిస్థితి వస్తే తీవ్రంగా ఉంటుందని, ఆ పరిస్థితి రాకూడదని తన రాజకీయ ప్రత్యర్థులు కోరుకోవాలంటూ తాజాగా మేయర్ దంపతులు చేస్తున్న విమర్శలపై పరోక్షంగా స్పందించారు.

ఘనంగా ఓరియంటేషన్ డే

కొడవలూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) :కొడవలూరు పంచాయతీ పరిధిలోని శ్రీవెంక టేశ్వర కాలేజీ ఆఫ్ ఫార్మసీలో ఓరియంటేషన్ డే గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ వీ గుణ శేఖర్ మాట్లాడుతూ ఫార్మసీకి భవిష్య త్తులో మంచి డిమాండ్ ఉంటుందన్నారు. నెల్లూరు మెడికవర్ హాస్పిటల్స్ సెంటర్ హెడ్ లావణ్య అరోళ్ల మాట్లాడుతూ ఆరోగ్య రం గంలో ఫార్మ సీ విద్యార్థుల పాత్ర కీలక మన్నారు.





35 ఏళ్ల డిమాండ్ మళ్లీ తెరమీదకు వచ్చింది. తిరుపతి కేంద్రంగా బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలంటూ బలమైన స్వరం వినిపిస్తోంది. 'బాలాజీ డివిజన్ మన హక్కు' అనే నినాదం హోరెత్తుతోంది. సాధించుకోవడానికి చేతులు కలుపుతున్నారు. విభిన్న రంగాల ప్రజలను చైతన్యపరుస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కుప్పాల గిరిధర్ కుమార్ కన్వీనర్‌గా ఎం.వేణుగోపాల రెడ్డి, సూరినేని బుజ్జిబాబు నాయుడు,వైఎస్ బాబు, సి.కృష్ణయ్య తదితరులు సభ్యులుగా బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితిని ఏర్పాటు చేశారు. డివిజన్ అవసరాన్ని వివరిస్తూ సెప్టెంబరు 12న తిరుపతిలో సదస్సు నిర్వహించారు.నవంబర్ 16న తిరుపతిలోని ప్రముఖులతో సన్నాహక సమావేశం జరిగింది. ఎంపీలను, ఎమ్మెల్యేలను కలిసి బాలాజీ డివిజన్ సాధనకు సహకరించమంటూ వినతులు ఇస్తున్నారు. రానున్న రోజుల్లో ఉద్యమరూపం తీసుకోవాలని భావిస్తున్నారు.

తిరుపతి
तिरुपति
TIRUPATI

తిరుపతి హక్కు
బాలాజీ రైల్వే డివిజన్

● నినాదంగా మారుతున్న డిమాండ్
● ఊపందుకుంటున్న సాధన కార్యక్రమాలు

తిరుపతి- ఆంధ్రజ్యోతి

ప్రస్తుతం దక్షిణ మధ్య రైల్వే (ఎస్సీఆర్) జోన్‌లోని గుంతకల్ రైల్వే డివిజన్లో తిరుపతి ఉంది. ఇక్కడికి గుంతకల్లు 320 కిలోమీటర్ల దూరం. కొత్తగా ఏర్పడుతున్న విశాఖపట్టణం జోనల్ కార్యాలయం తిరుపతికి 736 కిమీ దూరంలో ఉంది. ఇందువల్ల పాలనాపరమైన ఇబ్బందులు ఎక్కువ. సంవత్సరానికి రూ250 కోట్ల ఆదాయంగల ఏ1 కేటగిరీ స్టేషన్ ఉన్న తిరుపతి ప్రాంతం తీవ్రంగా నష్టపోతోంది. వివక్షకు గురవుతోంది. రైల్వేల పరంగా అభివృద్ధికి అవకాశం లేకుండా పోతోంది. ఈ కారణాలతో బాలాజీ రైల్వే డివిజన్ ఆలోచన 1990లో పురుడుపోసుకుంది. ఇదొక డిమాండ్‌గా అప్పటి నుంచీ వినిపిస్తూనే ఉంది. 2003లో సాకారం అయ్యే పరిస్థితి కనిపించినా దానిని దారిమళ్లించారు. గుంటూరు డివిజన్ ఏర్పడింది. ఇప్పటికే విజయవాడ డివిజన్‌కేంద్రంగా ఉంది. ఈ రెండు డివిజన్ల మధ్య దూరం 30 కిలోమీటర్లు మాత్రమే. అయినా తిరుపతి ప్రాంతానికి అన్యాయం జరిగింది. బాలాజీ డివిజన్ అన్నది బలమైన రాజకీయ డిమాండ్‌గా మారకపోవడమే ఇందుకు కారణం. అధికారంలో ఏ పార్టీ ఉన్నా ఈ ప్రాంత నాయకులు బాలాజీ డివిజన్ సాధించే దిశగా గట్టి ప్రయత్నాలు చేయలేదు. విశాఖ జోనల్ కార్యాలయంతో పాటూ తిరుపతి కేంద్రంగా బాలాజీ డివిజన్ ఏర్పడితే దక్షిణాంధ్ర అభివృద్ధిపై సమాన దృష్టిని కేంద్రీకరించినట్టు అవుతుంది.

డివిజన్ వస్తే ఇవీ ప్రయోజనాలు

ప్రపంచ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుపతిని చెన్నై, బెంగుళూరు, హైదరాబాద్, ముంబై, ఢిల్లీ వంటి మహానగరాలతో అనుసంధానించడానికి విస్తృత రైల్వే నెట్‌వర్క్ ఉంది. ప్రత్యేక డివిజన్ ఏర్పాటుతో ఈ ప్రాంత రైల్వే వ్యవస్థ బలపడడంతోపాటూ, వాణిజ్యం పెరుగుతుంది. ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి.

● డివిజన్ ఏర్పడితే 10వేల మందికి పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభిస్తుంది. రైల్వే కార్యాలయ సిబ్బంది, ఇంజనీరింగ్ విభాగాలు, కంట్రోల్ రూమ్‌లు, పరిపాలన సిబ్బంది, మెయింటనెన్స్, సెక్యూరిటీ, క్లీనింగ్, సిగ్నలింగ్, కేటరింగ్ రంగాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. డివిజన్ ఏర్పడితే స్థానిక ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి.రైల్వే డివిజన్ ఉన్న నగరాలలో సగటున 500నుంచి వెయ్యి గెజిటెడ్ మరియు నాన్ గెజిటెడ్ పోస్టులు ఉంటాయి. ఇవన్నీ ఈ ప్రాంతం వారి అవకాశాలను మెరుగుపరుస్తాయి.

● రైల్వే డివిజన్ ఏర్పాటు ఈ ప్రాంతానికి ప్రయాణాన్ని సులభతరం చేస్తుంది, తద్వారా ప్రాంతీయ ఆర్థిక అభివృద్ధిలో బాలాజీ డివిజన్ కీలక పాత్ర పోషిస్తుంది.

● రైళ్ల రాకపోకలు పెరుగుతాయి. సరుకు రవాణా నిర్వహణ, సేవల నాణ్యత పెరుగుతుంది.

● ప్రభుత్వ పెట్టుబడులు, రైల్వే మౌలిక సదుపాయాలు స్థానిక వ్యాపారాలను, స్థానికులకు ఉపాధిని పెంచుతాయి.

● కృషపట్నం, రాబోయే రామాయపట్నం, దుగరాజపట్నం పోర్టులకు మెరుగైన కనెక్టివిటీ సౌకర్యం ఏర్పడుతుంది.

● ప్రధాన కార్యాలయం చుట్టూ పౌర మౌలిక సదుపాయాలు, రోడ్లు, రైల్వే కాలనీలు అభివృద్ధి చెందుతాయి.

● డబ్లింగ్, విద్యుదీకరణ, స్టేషన్ అప్‌గ్రేడేషన్, పర్యాటక హబ్ వంటి కొత్త ప్రాజెక్టులకు అవకాశం ఉంటుంది.

● తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప జిల్లాలకు మరిన్ని సదుపాయాలు, వెసులుబాటు వసతులు, ఫైట్ హ్యాండ్లింగ్ సౌకర్యాలు వస్తాయి.

మనకింత నష్టమా!

● తిరుపతి రైల్వే స్టేషన్ ద్వారా వచ్చే వందల కోట్ల ఆదాయంలో అత్యధికం ఇతర డివిజన్‌ల అభివృద్ధికి మళ్లిపోతోంది. ఇందువల్ల తిరుపతి స్టేషన్‌లోనూ, ఈ ప్రాంతోని ఇతర స్టేషన్లలోనూ అవసరమైన ఫ్లాట్‌ఫారమ్ విస్తరణ, పార్కింగ్, లిఫ్టులు, ప్రయాణీకులకు సౌకర్యాలు వంటి ప్రాజెక్టులు ఆలస్యమవుతున్నాయి.

● రైల్వే శాఖ ఇప్పటికే చేపట్టిన తిరుపతి- తిరుచానూరు-చంద్రగిరి అభివృద్ధి ప్రణాళికలు, తిరుపతి -గూడూరు డబుల్ లైన్, తిరుపతి-కాట్పాడి ఎలక్ట్రిఫికేషన్ వంటివి నెమ్మదిగా సాగుతున్నాయి. సొంత డివిజన్ ఉండివుంటే ఇవి వేగంగా పూర్తయ్యేవి.

● ఉమ్మడి చిత్తూరు, నెల్లూరు, కడప జిల్లాలు రైల్వేల పరంగా వెనుకపడ్డాయి. కొత్త ప్రాజెక్టులు, అదనపు రైళ్లు, లేదా టూరిస్టు రూట్లు అనుమతించాల్సినప్పుడు తగిన ప్రాధాన్యం లభించడం లేదు.

గూడూరు డివిజన్‌లోకి ఆ 3 మండలాలు

● నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం
● అభ్యంతరాలు, సూచనలకు నెల రోజుల గడువు



తిరుపతి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి నియోజకవర్గానికి సంబంధించి ప్రస్తుతం నెల్లూరు జిల్లాలో ఉన్న కలువాయి, సైదాపురం, రాపూరు మండలాలను గూడూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోకి చేరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ చేసింది. గత వైసీపీ ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటు సందర్భంలో వెంకటగిరి నియోజకవర్గాన్ని నెల్లూరు, తిరుపతి జిల్లాల నడుమ విభజించిన సంగతి తెలిసిందే. వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాలు తిరుపతి జిల్లాలో చేరగా మిగిలిన కలువాయి, సైదాపురం, రాపూరు మండలాలు నెల్లూరు జిల్లాలోనే కొనసాగుతున్నాయి. పాలనాపరంగా ఇబ్బందులు వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం నెల్లూరు పరిధిలోని మూడు మండలాలను కూడా తిరుపతి జిల్లాలో కలపాలని నిర్ణయించింది. అందులో భాగంగా ఆత్మకూరు రెవెన్యూ డివిజన్‌లోని కలువాయి.. నెల్లూరు రెవెన్యూ డివిజన్‌లో ఉన్న సైదాపురం, రాపూరు మండలాలను గూడూరు రెవెన్యూ డివిజన్‌లో చేర్చేందుకు గురువారం రాష్ట్ర రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ ప్రిలిమినరీ నోటిఫికేషన్ ఇచ్చారు. దీనిపై ఆ మూడు మండలాలతో పాటు జిల్లాకు చెందిన ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనలుంటే తెలపాలని ఆహ్వానించారు. అందుకు నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి నెల రోజులు గడువిచ్చారు.

సివిల్ సర్వీసెస్ పరీక్షలకు ఉచిత శిక్షణ

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ నిర్వహించే సివిల్ ప్రిలిమినరీ, మెయిన్ పరీక్షలకు బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ సంక్షేమశాఖాధికారి భరత్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు డిసెంబరు 3వ తేదీలోపు కలెక్టరేట్‌లోని బీసీ వెల్ఫేర్ ఆఫీసులో దరఖాస్తులు అందజేయాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు గొల్లపూడిలోని బీసీ భవన్‌లో ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 94414 56039 నెంబరులో సంప్రదించాలన్నారు.

5న మెగా పీటీఎం

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో డిసెంబరు 5న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ గురువారం ఆదేశించారు. గతేడాది లాగే మెగా పీటీఎం 3.0 కార్యక్రమాన్ని ఉత్సాహంగా, బాధ్యతగా నిర్వహించాలని సూచించారు.




జయమ్మ (ఫైల్ ఫోటో)

బెడ్‌పై జయమ్మ మృతదేహం

ఈ దాష్టీకం ఎవరి పని?

● పుల్లారెడ్డికండ్రిగలో వృద్ధ దంపతులపై కత్తులతో దాడి
● భార్య మృతి, భర్తకు తీవ్రగాయాలు


చికిత్స పొందుతున్న మహదేవరెడ్డి

శ్రీకాళహస్తి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దోపిడీకొచ్చారా? లేదా ఇతర వివాదాలున్నాయా? ఆ వృద్ధ దంపతులపై కత్తులతో దాడి చేయాల్సిన అవసరం ఎవరికి ఉంది? ఇదీ శ్రీకాళహస్తి మండలం పుల్లారెడ్డికండ్రిగలో బుధవారం రాత్రి జరిగిన ఘటనకు సంబంధించి తలెత్తిన ప్రశ్నలు. చెవిరెడ్డి మహదేవరెడ్డి, జయమ్మ(75) దంపతులపై దాడిలో భార్య మృతిచెందగా భర్తకు తీవ్రగాయాలయ్యాయి. చెవిరెడ్డి మహదేవరెడ్డి పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో హెచ్‌ఎంగా స్వచ్ఛంద విరమణ చేశారు. అదే సమయంలో శ్రీకాళహస్తి-పిచ్చాటూరు రోడ్డులో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలను కొందరు సన్నిహిత వ్యక్తులతో కలిసి నిర్వహించేవారు. వీరి పెద్దకుమారుడు పెద్దకుమారుడు యుగంధర్‌రెడ్డి హైదరాబాద్‌లో పారిశ్రామికవేత్త. చిన్నకుమారుడు మధుసూదన్‌రెడ్డికి శ్రీకాళహస్తిలో పాఠశాల, డిగ్రీ కళాశాల ఉంది. రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. శ్రీకాళహస్తి మండల వైసీపీ అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికయ్యారు. పుల్లారెడ్డి కండ్రిగలో రెండేళ్ల కిందట డూప్లెక్స్ భవన నిర్మాణం చేపట్టారు. ఉత్తరాది వలస కార్మికుల చేత పనులు చేపట్టారు. మధ్యలో వారు వెళ్లిపోవడంతో శ్రీకాళహస్తి బిల్డర్ ఆరునెలల కిందట నిర్మాణం పూర్తి చేశారు. ఈ ఇంట్లోనే మహదేవరెడ్డి, జయమ్మ దంపతులు ఉంటున్నారు. ఎన్నో ఏళ్లుగా వీరి మామిడితోటకు గిరిజన మహిళ సుబ్బరత్న కాపలాగా ఉంటూ, ఇంటి పనులూ చూసుకునేవారు. గత పంచాయతీ ఎన్నికల్లో ఆమె సర్పంచిగా ఏకగ్రీవ ఎన్నికయ్యారు. అయినా, పనిమనిషిగా ఉంటున్నారామె.

ఇంట్లోకి ఎలా వెళ్లారంటే..


పగలగొట్టిన కిటికీని పరిశీలిస్తున్న క్లూస్ టీం

ఇంటి ఆవరణలోని వాషింగ్ మిషన్ గదిలోకి వెళ్లి.. దానిపై నుంచి వంట గది కిటికీలు పగలగొట్టి లోపలకు దుండగులు ప్రవేశించినట్లు అక్కడి పరిస్థితిని బట్టి తెలుస్తోంది. ఆ దంపతులపై కత్తులతో దాడి చేశారు. తాము తిరిగిన ప్రదేశాల్లో దుండగులు కారపు పొడి చల్లినట్లు పోలీసులు గుర్తించారు.

అంతుచిక్కని ప్రశ్నలెన్నో?

● తమ పక్కపొలం అతను ఇంట్లోకి ప్రవేశించి దాడికి పాల్పడినట్లు చికిత్స పొందుతున్న మహదేవరెడ్డి పోలీసులకు చెప్పారు. వయసు మీద పడటం, కరోనా నుంచి ఆయన పొంతన లేని మాటలు చెబుతున్నారని కుటుంబీకులు అధికారులకు వివరించారు.

● రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసే మధుసూదన్‌రెడ్డికి కొందరితో భూవివాదాలు ఉన్నాయి. అయితే హత్యకు పాల్పడే తీవ్రస్థాయి విభేదాల్లేవని కుటుంబ సభ్యులు పోలీసులకు చెప్పారు.

● వీరి ఇంటి వద్దకు రాకపోకలు సాగించేవారు ఎవరైనా ఇలాంటి దురాగతానికి పాల్పడ్డారా అనే కోణంలో పలువురు అనుమానితులను ఆరా తీస్తున్నారు.

ఆ ముఠా పనేనా?

దొంగతనం కోసమైతే హత్యలు చేసిన ఘటనలు ఇటీవల శ్రీకాళహస్తి ప్రాంతంలో లేవు. దీనికైతే మారుమూల గ్రామమైన పుల్లారెడ్డికండ్రిగకు వెళ్లి.. వృద్ధ దంపతులున్న ఇంటిని ఎందుకు ఎంపిక చేసుకున్నారన్న ప్రశ్న తలెత్తుతోంది. ఇక, జయమ్మ మెడలోని బంగారు గొలుసు కనిపించలేదని సమాచారం. కమ్మలు ఉన్నాయి. కాగా, జూలై 22న నాగలాపురం వద్ద దుండగులు బంగారు చైను కోసం మహిళను హతమార్చారు. ఇప్పటికీ ఆ కేసు మిస్టరీ వీడలేదు. ఇదీ ఆ ముఠా పనేనా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.

హత్య వెలుగు చూసిందిలా..

గురువారం ఉదయం 7గంటల సమయంలో పాలు తీసుకుని సుబ్బరత్న వచ్చి తలుపు కొట్టినా అలికిడి లేదు. ఇరుగు పొరుగు వారికి చెప్పడంతో వాళ్లూ వచ్చి తలుపు కొట్టారు. నెత్తుటి గాయాలతో రోదిస్తూ మహదేవరెడ్డి వచ్చి తలుపు తీశారు. లోపల బెడ్‌పై విగతజీవిగా జయమ్మ పడున్నారు. దీంతో బుధవారం రాత్రి జరిగిన ఈ దాడి ఘటన వెలుగులోకి వచ్చింది. శ్రీకాళహస్తి నుంచి వీరి కుమారుడు మధుసూదన్‌రెడ్డికి గ్రామానికి వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరుపతి ఏఎస్పీ రవి మనోహరాచారి, శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి, స్థానిక పోలీసు సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. మహదేవరెడ్డిని చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఇంటి నుంచి ఎదురుగా ఉన్న పంట పొలాల మీదుగా నాగాలమ్మ చెట్టు వరకు పోలీసు జాగిలం వెళ్లి నిలిచిపోయింది. క్లూస్‌టీం బృందం వేలిముద్రలు సేకరించారు. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని ఆ కుటుంబాన్ని పరామర్శించారు. హంతకులను త్వరగా గుర్తించి శిక్షించాలని అధికారులను కోరారు.


సుబ్బరత్నను ఆరా తీస్తున్న ఏఎస్పీ

రోడ్ల అభివృద్ధికి రూ.15.20కోట్లు

● నెలాఖరుకు రానున్న మరో రూ.16కోట్లు



తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో రోడ్ల అతీగతి పట్టించుకోలేదు. కూటమి అధికారంలోకి వచ్చాక రోడ్ల అభివృద్ధిపై దృష్టి సారించింది. ఏడు రోడ్లకుగాను రూ.15.20 కోట్లు మంజూరైనట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ గురువారం తెలిపారు. ప్రధానంగా నాగలాపురం-చిన్నపాండూరు రహదారి అభివృద్ధికి రూ.11 కోట్లు కేటాయించింది. సూళ్ళూరుపేట-సంతవేలూరు రోడ్డుకు రూ.75లక్షలు, శ్రీకాళహస్తి-ముసలిపేడు రోడ్డుకు రూ.40లక్షలు, శ్రీకాళహస్తి-కాసరం- గొల్లగుంట రోడ్డుకు రూ.36లక్షలు, ఈదులపల్లి-వీరంపల్లి రోడ్డుకు రూ.2కోట్లు, గూడూరు-తురిమెల్ల రోడ్డుకు రూ.30లక్షలు వంతున మంజూరుచేసింది. ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా రూ.15.20కోట్లతో సుమారు 40 కిలోమీటర్ల మేరకు రహదారి అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఈఈ రాజా నాయక్ తెలిపారు. ఈపనులకు త్వరలోనే టెండర్ ప్రక్రియను పూర్తిచేయనున్నారు. నెలాఖరు లోగా మరిన్ని రోడ్లు అభివృద్ధి చేయడానికి మరో రూ.16కోట్లు మంజూరు కానున్నాయని కలెక్టర్ తెలిపారు.

తిరుపతి సమీపంలో 600 ఎకరాల్లో
ధార్మిక టౌన్‌షిప్‌కు సహకరించండి!
రెవెన్యూ మంత్రికి డెల్లా గ్రూప్ ప్రతినిధుల వినతి

తిరుపతి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతి సమీపంలో 600 ఎకరాల్లో ధార్మిక టౌన్‌షిప్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నుంచీ సహాయ సహకారాలు అందించాలని డెల్లా గ్రూప్ ప్రతినిధులు గురువారం రెవిన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కోరారు. అమరావతిలో మంత్రిని కలసిన గ్రూప్ ప్రతినిధులు తమ సంస్థ తిరుపతి విమానాశ్రయానికి సమీపంలో 600 ఎకరాల భూమి సేకరించిందని, అందులో ప్రపంచంలో మరెక్కడా లేనివిధంగా ధార్మిక టౌన్‌షిప్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. వసుధైక కుటుంబం పేరుతో విమానాశ్రయానికి చేరువలో చేపట్టే అంతర్జాతీయ ప్రాజెక్టు భూమితో సహా మొత్తం ప్రైవేటుదేనని వివరించారు. అయితే దీనికి ప్రభుత్వం నుంచీ అవసరమైన సహాయ సహకారాలు అందించాలని అభ్యర్థించారు. హిందూమతంపై ప్రపంచంలోనే మొట్టమొదటి ఎగ్జిబిషన్, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, ఆతిథ్యం, మెడికల్ వెల్‌నెస్ సెంటర్లు, అడ్వంచర్ పార్కులు, లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లు, అత్యున్నత రియల్ ఎస్టేట్ తదితర అంశాలను మేళవిస్తున్నామని వెల్లడించారు. దాదాపు రూ. 3 వేల కోట్ల విలువైన ఈ భారీ ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులను వేగంగా ఇచ్చి, త్వరగా పనులు పూర్తయ్యేందుకు సహకరించాలని మంత్రిని కోరారు. డెల్లా గ్రూప్ ప్రతినిధుల ప్రతిపాదనపట్ల రెవెన్యూ మంత్రి సత్యప్రసాద్ సానుకూలంగా స్పందించారు.ఇప్పటికే వివిధ దేశాల నుంచీ భక్తులు వస్తున్న తిరుపతిలో ఇలాంటి ప్రాజెక్టు ఏర్పాటైతే మరింత ప్రయోజనం కలుగుతుందన్నారు. డెల్లా గ్రూప్ ప్రతిపాదనల గురించి కలెక్టర్‌ను సంప్రదించగా గ్రూప్ ప్రతినిధులు మొదటిసారిగా జిల్లా ఇంచార్జి మంత్రిని గురువారమే కలిసినట్టువుందన్నారు. దానిపై మంత్రి పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే అవకాశముందన్నారు. ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకున్నాక తమకు సమాచారం వచ్చే అవకాశముందన్నారు. ప్రతిపాదిత భూములు ప్రైవేటువి కావడం వల్ల తమకు సమాచారం లేదన్నారు.

2న జిల్లా సమీక్షా మండలి సమావేశం

తిరుపతి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతి కలెక్టరేట్‌లో డిసెంబరు 2న జిల్లా సమీక్షా మండలి సమావేశం జరగనుంది. ఈ సమీక్షా సమావేశం (డీఆర్సీ)లో వివిధ శాఖల పనితీరుతో పాటు సంక్షేమ పథకాల అమలు తీరు, అభివృద్ధి పనులను సమీక్షించనున్నారు. దీనికోసం జిల్లా ఇంచార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ ఒకటో తేదీనే తిరుపతి రానున్నారు. ఆరు నెలలకోసారి ఈ సమావేశాలు జరగాల్సి ఉండగా.. 2022 ఏప్రిల్ 4న జిల్లా ఏర్పాటయ్యాక గత ప్రభుత్వంలో రెండు పర్యాయాలే జరిగాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఒకసారే జరిగింది.




పల్లకీలో పద్మావతి

● వేడుకగా మహంతు ఉత్సవం

తిరుచానూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారు గురువారం సాయంత్రం పల్లకిలో ఊరేగారు. కార్తీక బ్రహ్మోత్సవాలు ముగిసిన రెండో రోజు అమ్మవారు తన పుట్టింటికి వెళ్లి ఆతిథ్యం స్వీకరించడం ఆనవాయితీ. ఈ మహంతు ఉత్సవంలో భాగంగా అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొపి అర్చకులు నిత్య కైంకర్యాలు నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారి ఉత్సవమూర్తిని పద్మసరోవరం వద్దనున్న హథీరాంజీమఠంలోని ఆంజనేయస్వామి ఆలయం ప్రాంగణానికి వేంచేపు చేశారు. హథీరాం మఠం తరపున దేవదాయశాఖ అధికారులు పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం అభిషేకం నిర్వహించారు. సర్వాలంకార శోభితురాలైన పద్మావతిదేవి పల్లకిలో కొలువుదీరి తిరుమాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. హథీరాంజీ మఠం పర్యవేక్షణాధికారి బాపిరెడ్డి, అమ్మవారి ఆలయ అధికారులు చలపతి, సుభాస్కర్‌నాయుడు, అర్చకులు పాల్గొన్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌2లో 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరిలోని 2 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్‌1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.4 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 73,670

తలనీలాలు సమర్పించినవారు: 26,062

సాహిత్యంతో మహిళల్లో నాయకత్వ శక్తి

● ఉస్మానియా వర్సిటీ తెలుగు ప్రొఫెసర్ కాశీం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సాహిత్యంతో ఎందరో రచయితలు మహిళల్లో నాయకత్వ పటిమను రగిలించారని హైదరాబాదులోని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీం అభిప్రాయపడ్డారు. పద్మావతి మహిళా యూనివర్సిటీ తెలుగు విభాగంలో గురువారం నిర్వహించిన పోఫూరి వేంకట సుబ్బారావు స్మారక ధర్మనిధి సదస్సులో ఆయన 'ఆధునిక సాహిత్యంలో స్త్రీ నాయకత్వ పటిమ- కవిత్వం, నాటకంపై ప్రసంగించారు. మహిళల జీవితంలోని అనేక సమస్యలను గురజాడ అప్పారావు 'కన్యాశుల్కం' నాటకంలోనూ, కాళ్ళకూరి నారాయణరావు 'వరవిక్రయం' నాటకంలోనూ, శివసాగర్ 'చెల్లీ చెంద్రమ్మ' కవిత, గద్దర్ 'సిరిమల్లె చెట్టుకింద లచ్చుమమ్మో లచ్చుమమ్మో' పాటలోనూ కనిపిస్తుందన్నారు. ఈ రచనల్లో రచయితలు కేవలం సమస్యలను వివరించడంతో సరిపెట్టుకోకుండా పరిష్కారాలనూ సూచించారన్నారు. తద్వారా మహిళల్లో నాయకత్వ పటిమను, పోరాట స్ఫూర్తిని రగిలించే ప్రయత్నం చేశారని అభిప్రాయపడ్డారు. 'ఆధునిక సాహిత్యంలో స్త్రీ నాయకత్వ పటిమ - కథ, నవల' అంశంపై కడప యోగి వేమన వర్సిటీ తెలుగు ప్రొఫెసర్ ఎంఎం వినోదిని ప్రసంగించారు. మహిళలను మంచి మార్గంలో నడిపించేదే గొప్ప సాహిత్యమని పేర్కొన్నారు. మహిళల్లో నాయకత్వ పటిమ అంటే నలుగురిని వెంట నిలబెట్టుకోవడం మాత్రమే కాదనీ, విపత్కర పరిస్థితుల్లో మనోనిబ్బరంతో నిలదొక్కుకోవడమని చెప్పారు. ఓల్గా, యద్దనపూడి సులోచనా రాణి, వాసిరెడ్డి సీతాదేవి వంటి వారి రచనలు చదవడం వల్ల మహిళలు చైతన్యం పొందవచ్చని పద్మావతి వర్సిటీ ఆర్ట్స్ డీన్ ప్రొఫెసర్ వాణి సూచించారు. నలుగురిని నడిపించడమే కాదు.. నాయకురాలిగా అందరినీ కలుపుగోలుగా ఒకే పథం వైపు నడిపించడం నాయకురాలి మౌలిక లక్షణమని తెలుగు విభాగాధిపతి ప్రొఫెసర్ కొలకలూరి మధుజ్యోతి తెలిపారు. ఈ ధర్మనిధి సదస్సుకు ఆర్థిక సహకారాన్ని అందించిన రచయిత్రి ఓల్గాకు సదస్సు సంచాలకుడు డాక్టర్ యువశ్రీ ధన్యవాదాలు తెలిపారు. ఈ సదస్సు సందర్భంగా చేపట్టిన వ్యాస రచన పోటీలకు డాక్టర్ సుభాషిణి, డాక్టర్ కృష్ణవేణి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రచయిత ఆర్సీ కృష్ణస్వామిరాజు, సాహిత్యవేత్తలు, డాక్టర్ లక్ష్మీప్రియ, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వ్యాసరచన పోటీలో విజేతకు బహుమతి అందజేస్తున్న అతిథులు

గూడూరును జిల్లా కేంద్రంగా ప్రకటించాలి

గూడూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గూడూరును రాష్ట్రప్రభుత్వం జిల్లా కేంద్రంగా ప్రకటించాలని గూడూరు ప్రజాసమితి నాయకుడు కోడూరు మీరారెడ్డి డిమాండు చేశారు. అన్నారు. గురువారం జరిగిన గూడూరు ప్రజాసమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. గూడూరును జిల్లా చేసేందుకు అసరమైన భౌగోళిక మౌలిక వసతులు పుష్కలంగా ఉన్నాయన్నారు. ఎన్నో ఏళ్లుగా రెవెన్యూడివిజన్‌కి కేంద్రంగా ఉందన్నారు. ఇక్కడ నుంచి మైకా, నిమ్మకాయలు విదేశాలకు ఎగుమతులు చేస్తుండడంతో గూడూరుకు గుర్తింపు ఉందన్నారు. రైల్వేజంక్షన్, పరిశ్రమలు, సముద్ర తీరం.. ఇలా అన్ని వనరులున్న గూడూరును జిల్లా కేంద్రంగా చేసుకునేందుకు జరపనున్న పోరాటంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. ఎన్నో ఏళ్లుగా నెల్లూరుజిల్లాతో అనుబంధమున్న గూడూరును తిరుపతిజిల్లాలో కలపడంతో జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు నియోజకవర్గ ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు గూడూరును నెల్లూరుజిల్లాలో కలపాలని కోరారు. లేదంటే ప్రజాసమితి అధ్వర్యంలో మొదటగా పోస్టుకార్డు ఉద్యమాన్ని ప్రారంభించి.. దశలవారీగా ఉధ్రుతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సతీష్‌రెడ్డి, చంద్రశేఖరయ్య, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గూడూరు ప్రజాసమితి నాయకుడు కోడూరు మీరారెడ్డి

నేడు విద్యాసంస్థల బంద్: ఏఎస్ఎఫ్

గూడూరును నెల్లూరు జిల్లాలో విలీనం చేయాలని కోరుతూ శుక్రవారం నిర్వహించనున్న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని అంబేడ్కర్ స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏఎస్ఎఫ్) నేత షఫీహరన్, శ్యామ్‌కుమార్ గురువారం కోరారు. తిరుపతి జిల్లాలోని గూడూరును నెల్లూరులో కలుపుతామన్న హామీని సీఎం చంద్రబాబు నెరవేర్చాలన్నారు.

సుందరకాండ పారాయణానికి అంకురార్పణ

తిరుమల, నవంబరు27(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శుక్రవారం నుంచి డిసెంబరు 13వ తేదీ వరకు జరుగనున్న షోడశదిన సుందరకాండ పారాయణానికి ధర్మగిరి వేదవిజ్ఞానపీఠంలో గురువారం సాయంత్రం అంకుర్పాణ జరిగింది. ఇందులో భాగంగా పుణ్యాహవచనం, రక్షాబంధనం, మత్స్యంగ్రహణాన్ని ఆగమోక్తంగా నిర్వహించారు. ప్రతి రోజు ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు వసంతమండపంలో సుందరకాండ పారాయణం, ధర్మగిరి వేదవిజ్ఞానపీఠంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆరాధన, అభిషేకం, హోమం, అనుస్ధానం నిర్వహిస్తారు. డిసెంబరు 13న పూర్ణాహుతితో ఈ కార్యక్రమం ముగియనుంది. అంకురార్పణ కార్యక్రమంలో వేదవిజ్ఞానపీఠం ప్రిన్సిపాల్ ఎస్ఎస్ అవధాని, వేదపండితులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని టీడీపీ నాయకుడి మృతి



బాబు (ఫైల్‌ఫొటో)

బాలాయపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని టీడీపీ నాయకుడు మృతిచెందిన సంఘటన గురువారం గూడూరు రైల్వేస్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. రైల్వేజీఆర్ పోలీసుల కథనం మేరకు.. బాలాయపల్లి మండలం వ్యాఖ్యం గ్రామానికి చెందిన నర్రావుల బాబు(49) గురువారం ఉదయం ఇంటి వద్ద నుంచి పనుల నిమిత్తం గూడూరుకు వెళ్లారు. గూడూరులోని రెండో ప్లాట్‌ఫాం సమీపంలో రైలు పట్టాలు దాటుతుండగా చెన్నై నుంచి విజయవాడ వైపు వెళుతున్న గుర్తుతెలియని రైలు ఢీకొంది. దీంతో బాబు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. రైల్వే జీఆర్ పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఈయన వ్యాక్యం గ్రామంలో టీడీపీ గ్రామస్థాయి నాయకుడిగా కొనసాగుతున్నాడు. బాబు మృతి టీడీపీకి తీరని లోటని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రాయి సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు రాయి మస్తాన్‌నాయుడులు తెలిపారు. బాబు మృతిచెందడంపై పలువురు టీడీపీ నాయకులు సంతాపం తెలియజేశారు.

ఆక్వా బకాయిలు రూ.9 కోట్లు



సదరన్ డిస్కం కార్యాలయ భవన నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న డిస్కం ఈఈ కేవీ నరేంద్రరెడ్డి

కోట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గూడూరు డివిజన్‌లో ఆక్వా బకాయిలు 9 కోట్లు వసూలు కావాల్సి ఉందని దీనిపై స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తామని సదరన్ డిస్కం ఈఈ కేవీ నరేంద్రరెడ్డి అన్నారు. కోట మండలం చెందోడు విద్యుత్ సబ్ స్టేషన్‌ను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. సబ్ డివిజన్‌లోని పలు ఏఈలు, సబ్ ఇంజనీర్లతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తీర ప్రాంత మండలాలైన కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాలలో ఆక్వా బకాయిలు పేరుకుపోయి ఉన్నాయన్నారు. 2600 ఆక్వా సర్వీసులు బకాయి ఉన్నాయన్నారు. వీటిపై స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి వసూళ్లకు చర్యలు చేపడుతామన్నారు. అదేవిధంగా ప్రభుత్వ కార్యాలయాలు, ఇంటి సర్వీసుల విద్యుత్ బిల్లులపైనా ఈ స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తామ న్నారు. ఆయన వెంట డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చిన్నయ్య, పలువురు ఏఈలు ఉన్నారు. అంతకుముందు ఆయన నూతన సబ్ స్టేషన్ కోసం స్థల పరిశీలన చేశారు.

పరిశ్రమ నిర్వాహకుల్లో ఉత్తేజానికి 'కైజాన్'



విజేతలుగా నిలిచిన వారితో పరిశ్రమల నిర్వాహకులు

తిరుపతి(వైద్యం), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల నిర్వాహకుల్లో నూతన ఉత్తేజాన్ని నింపడంతోపాటు కొత్త ఆలోచనలు పంచుకోవడానికి కైజాన్' వంటి పోటీలు ఉపయోగపడతాయని సీఐఐ తిరుపతి వైస్‌ఛైర్మన్ ఎస్పీ రాజేంద్రన్ అన్నారు. తిరుపతిలో గురువారం సీఐఐ రాష్ట్ర స్థాయి కైజాన్ రెండవ ఎడిషన్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో భాగంగా నిర్వహించిన ఆపరేషన్స్ కేటగిరిలో మొదటి స్థానంలో అర్జాస్ స్టీల్స్ ప్రవేట్ లిమిటెడ్, ద్వితీయ స్థానంలో అపోలో టైర్స్, తృతీయ స్థానంలో ఐటీసీ లిమిటెడ్ నిలిచాయి. అలాగే సూపర్‌వైజర్ల స్థానంలో అపోలో టైర్స్, సుందరం ఫాస్టనర్స్ లిమిటెడ్, కెల్లాగ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. ఈ పోటీల్లో రాష్ట్రం నలుమూలల నుంచి 20కు పైగా జట్లు పాల్గొన్నాయని రాజేంద్రన్ తెలిపారు. వీరి ఆలోచనలు ఒకరికి ఒకరు పంచుకోవడం కోసమే ఇటువంటి పోటీలను నిర్వహించామని, వీటిని ప్రోత్సాహంగానే భావించాల్సిన అవసరం ఉందన్నారు. విజేతలకు ప్రోత్సాహక బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో క్యూసీపీఐ హైదారాబాద్ ఛాప్టర్ అధ్యాపకులు హనుమంతరావు, టీవీ కృష్ణారావు, డిక్సన్ టెక్నాలజీస్ లిమిటెడ్ ఏజీఎం శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తడ రైల్వేస్టేషన్‌కు మహర్దశ

● గూడ్స్ షెడ్, ఎగుమతుల కేంద్రం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ● పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదలకు సుముఖం





తడ రైల్వే స్టేషన్ - గూడ్స్‌షెడ్ నిర్మాణం కోసం ప్రతిపాదించిన స్థలం

తడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తడ రైల్వేస్టేషన్‌కు మహర్దశ పట్టనుంది. గూడ్స్‌షెడ్ నిర్మాణంతో పాటు ఎగుమతుల కేంద్రం ఏర్పాటుకు రైల్వేశాఖ చర్యలు చేపట్టింది. తడ... 2007కు ముందు వరకు ఓ మారుమూల కుగ్రామం. 2008లో శ్రీసిటీ, మాంబట్టు సెజ్ ఏర్పాటుతో అభివృద్ధికి అడుగులు పడ్డాయి. రెండు సెజ్‌లలో సుమారు 220కి పైగా పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. దీంతో ఒకప్పటి మారుమూల పల్లెటూరైన తడ నగరాలకు దీటుగా అభివృద్ధిలో దూసుకుపోతోంది. ఇప్పుడు రైల్వేశాఖ తనవంతు పాత్ర పోషించేందుకు సిద్ధమవుతోంది. తడ రైల్వేస్టేషన్‌లో ఒకప్పుడు ప్యాసింజర్ రైళ్లు ఆగేదే ఎక్కువ. సెజ్‌ల ఏర్పాటుతో 2010 నుంచి చెన్నై, సూళ్లూరుపేట మధ్య లోకల్ రైళ్లను ప్రవేశపెట్టారు. 2015లో అప్పటి కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు చొరవతో ఇక్కడ నుంచి నేరుగా నెల్లూరుకు మెమూ రైళ్లను ప్రవేశపెట్టడంతో ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. ప్రస్తుతం నెల్లూరు, సూళ్లూరుపేట, చెన్నైకు 25 లోకల్ రైళ్లు నడుస్తున్నాయి. ఈ క్రమంలో శ్రీసిటీ, మాంబట్టు సెజ్‌లోని పరిశ్రమల ఉత్పత్తులను రవాణా చేసేందుకు తడ రైల్వే స్టేషన్‌లోనే ఎగుమతుల కేంద్రానికి శ్రీసిటీ యాజమాన్యం ప్రయత్నాలు చేసింది. ఇప్పటికే కొబెల్‌కో పరిశ్రమ తయారు చేసే ఎక్స్‌కవేటర్లను గూడ్స్‌లలో రవాణా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గూడ్స్ షెడ్‌తో పాటు ఎగుమతుల కేంద్రాన్ని ఏర్పాటు చేసే దిశగా సదరన్ రైల్వే అధికారులు నిమగ్నమయ్యారు. ఇందు కోసం ఇప్పటికే రైల్వేశాఖ పరిధిలో ఉన్న భూములతో పాటు మరో 25 ఎకరాలు సేకరించేందుకు రెవెన్యూ అధికారులను సంప్రదించినట్లుగా తెలిసింది. దొరవారిసత్రం రైల్వేస్టేషన్ నుంచి బియ్యాన్ని వివిధ ప్రాంతాలకు సరఫరా చేసే పాయింట్‌ను సైతం తడకు తరలిస్తున్నారు. వీటితో పాటు పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు తడ రైల్వేస్టేషన్‌లో స్టాపింగ్ ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి.

'శెట్టిపల్లె' లబ్ధిదారులకు త్వరలో ప్లాట్ల కేటాయింపు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తిరుపతి అర్బన్ శెట్టిపల్లె లేఅవుట్ అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేసి లబ్ధిదారులకు ప్లాట్ల కేటాయింపు ప్రక్రియ చేపట్టాలని అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం ఇన్‌ఛార్జి జేసీ మౌర్య, తుడాఛైర్మన్ దివాకర్‌రెడ్డి, తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, తుడా భూసేకరణ అధికారి సుజన తదితరులతో ఆయన సమావేశమయ్యారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి పైపులైన్లు, విద్యుత్, పార్కులు వంటి సదుపాయాలు సమగ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

వసతిగృహాలకు మరమ్మతులు పూర్తి చేయండి

జిల్లాలోని హాస్టళ్లలో మరమ్మతు పనులు వేగవంతంచేయాలని గురువారం జరిగిన సమీక్షలో అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంతలోపు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఆయా శాఖల అధికారులు విక్రమ్ కుమార్‌రెడ్డి, భరత్‌రెడ్డి, రాజా సోము, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

నూతన పోలింగ్ కేంద్రాలకు బీఎల్వోలను నియమిస్తాం

జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు బీఎల్వోలను నియమిస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. విజయవాడ నుంచి చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వివేక్‌యాదవ్ గురువారం ఓటర్ మ్యాపింగ్, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-2026 కార్యక్రమాలపై వర్చువల్ విధానంలో జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎన్నికల అధికారులకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై శిక్షణా కార్యక్రమం ముగిసిందన్నారు. ఓటర్ మ్యాపింగ్ కూడా పూర్తికావచ్చిందని, బీఎల్వోలకు ఐడీ కార్డులను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, ఎస్‌డీసీలు సుధారాణి, రోజ్మాండ్, ఆర్డీవోలు రామ్మోహన్, భానుప్రకాష్ రెడ్డి, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

ఇద్దరు 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్టు

● 20 దుంగలు స్వాధీనం



స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం మామండూరు అటవీ ప్రాంతంలో గురువారం టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహించి ఇద్దరుస్మగ్లర్లను అరెస్టు చేసి 20 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రైల్వేకోడూరు సబ్ కంట్రోల్ ఆర్ఐ కృపానందకు చెందిన ఆర్ఎస్ఐ అల్లీబాషా బృందం, ఫారెస్టు బీట్ ఆఫీసర్ జాన్ శ్యాముల్‌తో కలిసి మామండూరు అటవీప్రాంతంలో బుధవారం నుంచి కూంబింగ్ చేపట్టారు. గురువారం తెల్లవారుజామున కాకిరేవులపెంట వద్ద ఇద్దరు వ్యక్తులు టాస్క్‌ఫోర్సు సిబ్బందిని గమనించి పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిని వెంబడించి పట్టుకోగా.. మామండూరుకు చెందిన వారుగా గుర్తించారు. వారిని విచారించి.. దాచి ఉన్న 20 ఎర్రచందనం దుంగలను గుర్తించారు. వారితో పాటు దుంగలను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీ ఫైబర్ నెట్‌వర్క్‌పై కేసు కొట్టేయడం శుభపరిణామం



న్యాయదేవత, సీఎం చంద్రబాబు ఫొటోకు పాలాభిషేకం

తిరుపతి(జీవకోన), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఏపీ ఫైబర్ నెట్‌వర్క్‌పై గతంలో జగన్ ప్రభుత్వం అక్రమంగా పెట్టిన కేసును కొట్టివేయడం శుభపరిణామమని ఏపీ ఫైబర్ నెట్‌వర్క్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుబాబు, నగర అధ్యక్షుడు జేడబ్ల్యూ విజయకుమార్ అన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో గురువారం వీరు మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రజలకు ఇంటర్నెట్ అందుబాటులోకి వచ్చేలా ఏపీ ఫైబర్ నెట్‌వర్క్‌ను చంద్రబాబు తీసుకొచ్చారన్నారు. ఈ ఫైబర్ నెట్ ద్వారా వేలాదిమంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందారన్నారు. దీనిని ఓర్వలేని జగన్ ప్రభుత్వం అక్రమ కేసును బనాయించడంతో వేలాది ఆపరేటర్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై పోరాటం చేయడంతో న్యాయస్థానం ఆ కేసును కొట్టేసిందన్నారు. ఏపీ ఫైబర్ నెట్‌కు పూర్వవైభవం వచ్చేలా సీఎం చంద్రబాబునాయుడు కృషి చేస్తారని మళ్లీవేలాది ఆపరేటర్ల కుటుంబాల్లో వెలుగులు నింపుతారన్నారు. ఈ సందర్భంగా న్యాయదేవత, చంద్రబాబు చిత్రాలకు పాలాభిషేకం చేశారు. ఈ సమావేశంలో అసోసియేషన్ నేతలు ఆనంద్, శంకర్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

జనవరిలో పలు ప్రధాన రైళ్లు రద్దు

విశాఖపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే పరిధిలో గోదావరి-రాజమండ్రి, రాజమండ్రి-కడియం సెక్షన్లలో ఆధునికీకరణ నిర్మాణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో జనవరిలో పలు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేస్తున్నామని వాల్తేరు సీనియర్ డీసీఎం కె.పవన్ కుమార్ తెలిపారు. జనవరి 27న తిరుపతి-పూరి ఎక్స్‌ప్రెస్ (17480), 28న పూరి-తిరుపతి (17479), తిరుపతి-విశాఖ డబుల్ డెక్కర్ (22708); 28, 29 తేదీల్లో విశాఖ-లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్ (12805), మచిలిపట్నం-విశాఖ ఎక్స్‌ప్రెస్ (17219); 29న విశాఖ-తిరుపతి డబుల్ డెక్కర్ (22707), 29, 30 తేదీల్లో లింగంపల్లి-విశాఖ జన్మభూమి ఎక్స్‌ప్రెస్ (12806), విశాఖ-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ (17220), 28, 30 తేదీల్లో గుంటూరు-విశాఖ సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17239), 29, 31 తేదీల్లో విజయవాడ-విశాఖపట్నం రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ (12718), విశాఖపట్నం-విజయవాడ రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ (12717), విశాఖ-గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17240), రాజమండ్రి-విశాఖ మెము పాసింజర్ (67285), విశాఖ-రాజమండ్రి మెము పాసింజర్ (67286), జనవరి 31న గుంటూరు-విశాఖ డబుల్ డెక్కర్ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22876), విశాఖ-గుంటూరు డబుల్ డెక్కర్ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22575) రద్దు కానున్నట్టు పేర్కొన్నారు.

రైల్వే డివిజన్ కోసం సీఎం దృష్టికి తీసుకెళ్తా

● సాధన సమితి సభ్యులతో కలెక్టర్



తిరుపతి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతి బాలాజీ రైల్వే డివిజన్ ఆవశ్యకతను సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తానని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. బాలాజి రైల్వే డివిజన్ సాధన సమితి సభ్యులు గురువారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కాగా, జనవరిలో సీఎం నారావారిపల్లెకు వస్తున్నారని, ఆయన్ను కలిసే అవకాశం కల్పిస్తానని కలెక్టర్ వారితో చెప్పారు. నగరి, పుత్తూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట ప్రాంతాలను కూడా కొత్తగా ఏర్పడే సౌత్ కోస్తా రైల్వేలో కలిపితే బాగుంటుందని కమిటీ సభ్యులు తెలుపగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. అలాగే, మాజీ ఎమ్మెల్యే కరుణాకరరెడ్డికీ వినతిపత్రం ఇచ్చారు. ఈ సమావేశంలో సాధన కమిటీ కన్వీనర్ కుప్పాల గిరిధర్ కుమార్, సభ్యులు ఎమ్.వేణుగోపాల్ రెడ్డి, సూరిసేని బుజ్జి బాబు నాయుడు, సి.కృష్ణయ్య, అనిల్ కుమార్, నీలేష్, కుమార్, టీవీ రావు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమం, అభివృద్ధే ఎన్డీఏ లక్ష్యం


రైతులకు కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు, రైతులు

చిల్లకూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం, అభివృద్ధే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని తిక్కవరం గ్రామంలో రైతన్నా మీకోసం కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా ఇంటింటికీ తిరిగి ఎన్డీఏ ప్రభుత్వం రైతుల కోసం అమలు పరుస్తున్న పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సతీష్‌రెడ్డి, లింగారెడ్డి, ప్రభాకర్, కుమార్, వీఆర్వో శ్రీనివాసులు, కార్యదర్శి సుభాషిణి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పారా క్రీడాపోటీలకు ఎంపిక


అన్వేష్‌ను అభినందిస్తున్న నిర్వాహకులు

గూడూరు అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి పారా క్రీడా పోటీలలో గూడూరుకు చెందిన పారా క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు గురువారం ఎంపికయ్యారు. దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా జిల్లా క్రీడాప్రాధికార సంస్థ నిర్వహించిన జిల్లాస్థాయి పారా క్రీడాపోటీలలో షటిల్ బ్యాడ్మింటన్, షాట్‌పుట్ విభాగాల్లో గూడూరుకు చెందిన పారా క్రీడాకారులు అన్వేష్, ప్రకాష్‌లు ప్రతిభచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వచ్చేనెల 2వ తేదీన గుంటూరులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో వీరు పాల్గొంటారు.

పారా బేసిక్ కోర్స్‌లో చరణ్ ప్రతిభ


చరణ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ప్రవీణాకుమారి

నాయుడుపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఆగ్రాలో జరుగుతున్న ఎన్‌సీసీ విద్యార్థుల పారా బేసిక్ కోర్స్‌లో ప్రతిభ చూపిన నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థి కంటేపల్లి చరణ్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణా కుమారి గురువారం కళాశాలలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్‌సీసీ విద్యార్థుల పారా బేసిక్ కోర్సుకు రాష్ట్రం నుంచి చరణ్ ఒక్కడే ఎంపికయ్యాడని తెలియజేశారు. నవంబరు 4 నుంచి 25 వరకు 23 రోజులపాటు మిలిటరీ, ఎయిర్‌ఫోర్స్, నేవీ దళాలతో పోటీపడి శిక్షణలో విజయవంతంగా సర్టిఫికెట్లు, జ్ఞాపిక షీల్డ్‌ను కైవసుకున్నాడని అభినందించారు. అలాగే ఎన్‌సీసీ కెప్టెన్ శివారెడ్డి, అధ్యాపక సిబ్బంది కూడా అభినందించారు.

కూటమి ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి


నెలవలకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న రఫీ, ప్రవీణ్, నాయకులు

నాయుడుపేట, నవంబరు 27 (ఆంధ్ర జ్యోతి) : కూటమి ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా ప్రజారంజకపాలన సాగుతోందని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. నెలవల జన్మదినం సందర్భంగా ఆయనను టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు గజమాలలు, శాలువాలతో సత్కరించారు. అందరినడుమ నెలవల సుబ్రహ్మణ్యం కేక్‌కట్ చేశారు. నెలవలను సత్కరించిన వారిలో మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్, పోలేరమ్మ ఆలయ చైర్మన్ నానాబాల సుబ్బారావు, కట్టా రమణారెడ్డి, పసల గంగాప్రసాద్, జీవీఆర్ నాయుడు, అవధానం సుధీర్, గూడూరు కిషోర్‌కుమార్, కిరణ్‌కుమార్, మస్తాన్, గోవిందవాసు, ధనంజయ, చక్రపాణి, ముత్యాలయ్య ఉన్నారు.

నెలవలకు సత్కారం


నెలవలకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

పెళ్లకూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నాయుడుపేటలో జరిగిన మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం జన్మదిన వేడుకల్లో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, స్వర్ణముఖీనది ఆనకట్ట చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు, ఏఎంసీ వైస్ చైర్మన్ కిలారి గోపి నాయకులు పేరం రమేష్‌నాయుడు, కందమూడి శివకుమార్, దేవారెడ్డి నాగేంద్రప్రసాద్ రెడ్డి, మదన్‌మోహన్‌నాయుడు, నేలవల్లి సిద్ధులయ్య నాయుడు, పాలచ్చూరు అమరేంద్రయాదవ్, పాపాడి రాజ గోపాల్‌రెడ్డి, అక్కరపల్లి మాధవరెడ్డి, పెళ్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, పాల చ్చూరు నరేంద్రయాదవ్ పాల్గొన్నారు. పూలమాలలు, శాలువాలతో నెలవలను సన్మానించి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

బాకీ అడిగినందుకు దాడి

కోట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : బాకీ అడిగిన మహిళపై ఓ వ్యక్తి దాడి చేశాడు. బాధితురాలి కథనం మేరకు.. మండల పరిధిలోని మద్దాలికండ్రిగ గ్రామానికి చెందిన వెలుగు అల్లెమ్మ అదే గ్రామానికి చెందిన ధర్మయ్యకు 8 సవర్ల బంగారం, రూ2 లక్షల నగదు అప్పుగా ఇచ్చింది. నగలు, నగదు తిరిగి ఇవ్వాలని గురువారం కోరింది. ఈ క్రమంలో జరిగిన వాగ్వాదంలో ధర్మయ్య ఆమెపై కర్రతో దాడిచేసి గాయపరిచాడు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఎన్‌బీకేఆర్ మాజీ అధ్యాపకుడు మృతి


రాజా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎన్‌బీకేఆర్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కోట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కోట మండలం విద్యానగర్ ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో భౌతికశాస్త్ర మాజీ అధ్యాపకుడు, సూళ్లూరుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ వి.రాజ గురువారం గుండెపోటుతో మరణించారు. దీంతో ఎన్‌బీకేఆర్ కళాశాలలో ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యాపకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్‌బీకేఆర్ కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి ఆయన కుటుంబసభ్యులను ఫోన్‌లో పరామర్శించారు.

బ్రాహ్మణ వ్యతిరేక గాయకుడిని అరెస్ట్ చేయాలి

గూడూరు అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణులను విమర్శిస్తూ పాటలు పాడిన రమణ అనే గాయకుడిని అరెస్టు చేయాలని ఆదిశంకరాచార్య బ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధులు గురువారం కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు శ్రీకంటి రామమోహన్‌రావు, బాలాజీ, పవన్‌కుమార్, శ్రావణ్‌కుమార్ తెలిపారు.

పచ్చదనం పెంచాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో నారాయణ

బాలాయపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పచ్చదనం- పరిశుభ్రతపై వీవోఏలు బాధ్యతగా పనిచేయాలని ఎంపీడీవో నారాయణ అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయ సమావేశ భవనంలో వీవోఏలకు 2030 నాటికి గ్రామ పంచాయతీలు సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో భాగమైన థీమ్ 5పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీవోఏలు తమ గ్రామాల్లో పరిశుభ్రత పచ్చదనం అంశంపై ప్రజలకు అవగాహన కల్పించి గ్రామాలు పరిశుభ్రత పచ్చదనంతో ఉండేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వినీల్ కుమార్, ఏపీఎం కిరణ్ పాల్గొన్నారు.

బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి : సీఐటీయూ


ఆస్పత్రి వద్ద చేపట్టిన ధర్నా

వెంకటగిరి, నవంబర్ 27(ఆంధ్రజ్యోతి): సోమని టైల్స్ కంపెనీలో బుధవారం గ్యాస్ ట్యాంకర్ పేలుడు ఘటనలో మృతి చెందిన కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.కోటి, గాయపడిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25 లక్షల పరిహారం కంపెనీ చెల్లించాలని సీఐటీయూ నాయకులు చెంగయ్య డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదానికి కారణమైన కంపెనీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పరిహారం చెల్లించని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు మోడల్ స్కూల్ విద్యార్థి


చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ తులసీజ్యోతి

వెంకటగిరిటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి కే.చంద్రశేఖర్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ తులసీజ్యోతి అన్నారు. గురువారం పాఠశాలల్లో విద్యార్థిని ఉపాధ్యాయులు సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 800 మీటర్ల పరుగు పోటీల్లో మొదటి స్థానం, 1500 మీటర్ల పరుగు పోటీల్లో రెండవ స్థానం సాధించి పాఠశాలకు గుర్తింపు తీసుకు వచ్చాడని తెలియజేశారు. విద్యార్థులు విద్యతో పాటు, ఆటల పట్ల ఆసక్తి చూపాలని కోరారు. చంద్రశేఖర్‌ను విద్యార్థులు, ఉపాధ్యాయులు అభినందించారు.

రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయం

పెళ్లకూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్వాయిపాడు గోమతి సర్కిల్ నుంచి నెలబల్లి వరకు గల సుమారు 20 కిలోమీటర్ల 71వ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు ఎస్ఐ నాగరాజు నడుంబిగించారు. ప్రతి రోజూ జాతీయ రహదారిపై పర్యటిస్తూ వాహనాలు నడిపే డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు వారికి అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మనపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తగా వాహనాలను నడపాలన్నారు. లైసెన్సులు, వాహనాలకు సంబంధించిన పత్రాలు లేకున్నా, మద్యం సేవించి వాహనాలు నడిపినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రైల్వేగేటు మూసివేత


రైల్వేగేటు కు చేస్తున్న మరమ్మతులు

సూళ్లూరుపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని కచ్చేరివీధిలో ఉన్న రైల్వేగేటును గురువారం మూసివేశారు. రైల్వేగేటు వద్ద ఎస్‌సీ-60 మరమ్మతుల కారణంగా రెండు రోజుల పాటు మూసివేసి పనులు చేయనున్నారు. మళ్లీ శుక్రవారం రాత్రి 11 గంటలకు రైల్వేగేటును యథావిధిగా తెరవనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. పట్టణ నడిబొడ్డులో ఉన్న ప్రధాన రైల్వేగేటు కావడంతో ద్విచక్ర వాహన దారులకు ఇబ్బందులు తప్పలేదు. రైల్వేగేటు మూసి వేయడంతో గేటుకు అవతలి వైపు వాహనదారులు జీఎన్‌టీ రోడ్డు మీదుగా వెళ్లి శ్రీహరికోటకు వెళ్లే పై ఓవర్ బ్రిడ్జి మీదుగా వారి ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చింది.

సైన్స్ పట్ల అవగాహన పెంచుకోవాలి


సైన్స్ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేసి అభినందిస్తున్న డీఎస్పీ గీతాకుమారి

గూడూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైన్స్ పట్ల అవగాహన పెంచుకుని భావిభారత శాస్త్రవేత్తలుగా ఎదగాలని డీఎస్పీ గీతాకుమారి అన్నారు. స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి సైన్స్ చెకుముకి పోటీలలో విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జేవీవీ ఆధ్వర్యంలో సమాజంలో మూఢనమ్మకాలను పొగొట్టేందుకు అనేక కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. అలాగే విద్యార్థులకు సైన్స్ పరీక్షలు నిర్వహిస్తూ వారిని సైన్స్ పట్ల ప్రోత్సహించేలా ఈ తరహా కార్యక్రమాలు నిర్వహించడం స్ఫూర్తిదాయకమన్నారు. విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహనను పెంచుకోవాలన్నారు. చదువుల ద్వారానే ఉజ్వలభవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వేగూరు రాజేంద్రప్రసాద్, నాగరాజు, పురుషోత్తమరావు, సుబ్బారావు, ప్రభాకర్, రజనీకాంత్, శ్రీనివాసాచారి, ఇబ్రహీం, సురేష్ పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణపై మాక్‌డ్రిల్


కార్మికులకు అవగాహన కల్పిస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది

గూడూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలలో హఠాత్తుగా ప్రమాదాలు జరిగినపుడు కార్మికులను ప్రాణాలతో కాపాడేందుకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించామని తహసీల్దారు ప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని మంగళపూరు సమీపంలోని కలర్‌షైన్ పరిశ్రమలో ఏపీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందితో కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లిక్విడ్, హైలిక్విడ్ ప్రమాదాలు జరిగినపుడు తీసుకోవాల్సి జాగ్రత్తలపై మాక్ డ్రిల్ నిర్వహించి అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో కిరణ్‌కుమార్, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది, పరిశ్రమ సిబ్బంది, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ మేథపై విద్యార్థులు పట్టు సాధించాలి


శిక్షణా తరగతుల్లో విద్యార్థులు

గూడూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదిశంకర డీమ్డ్ టుబీ యూనివర్సిటీలో గురువారం బీటెక్ చివరి సంవత్సరం విద్యార్థులకు ఐబీఎస్ స్కిల్స్ బిల్డ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫండమెంటల్స్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ డాక్టర్ వీఎస్ఎస్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు నేటి సాంకేతిక ప్రపంచంలో రాణించాలంటే కృత్రిమ మేథపై పట్టుసాధించాలన్నారు. ఆ మేరకు విద్యార్థులకు శిక్షణా తరగతులను నిర్వహించామన్నారు. ఇది వారి భవిష్యత్ ఆలోచనలకు దోహదం చేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజయ్య, డాక్టర్ వేణుమాధవ్, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి హాకీ పోటీలకు గూడూరు క్రీడాకారులు


క్రీడాకారులను అభినందిస్తున్న హాకీ కోచ్ దీపక్‌ఆకాష్

గూడూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయస్థాయి హాకీ పోటీలకు గూడూరు క్రీడాకారులు ఎంపికయ్యారని శాప్ హాకీ కోచ్ దీపక్‌ఆకాష్ తెలియజేశారు. గురువారం స్థానిక ఏఎరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో రాష్ట్రస్థాయి హాకీ క్రీడాపోటీలలో ప్రతిభచాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా కోచ్ దీపక్ ఆకాష్ మాట్లాడుతూ ఇటీవల చంద్రగిరిలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-14 విభాగంలో నతన్‌ఆకాష్, గురువరప్రసాద్, అనకాపల్లిలో జరిగిన అండర్-19 పోటీలలో యశ్వంత్, భువనేష్ ప్రతిభచాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. త్వరలో మధ్యప్రదేశ్‌లో జరగనున్న అండర్-14, ఒడిశాలో జరగనున్న అండర్-19 జాతీయస్థాయి పోటీలలో వీరు పాల్గొంటారని ఆయన వివరించారు.

ఎట్టకేలకు రహదారిపై చెత్త తరలింపు



ఎక్స్‌కవేటర్‌తో చెత్తను తరలిస్తున్న పంచాయతీ అధికారులు

తడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు అధికారులు స్పందించారు. చెత్త తరలింపు చర్యలు తీసుకున్నారు. స్థానిక బోడిలింగాలపాడు శివాలయం సమీపంలో జాతీయ రహదారిపై పంచాయతీ అధికారులే రోడ్లపైనే చెత్త వేస్తున్నా రంటూ బుధవారం ఇదేంచెత్తపని అంటూ ఆంధ్రజ్యోతిలో కథనం వెలువడిన సంగతి తెలిసిందే. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో పంచా యతీ అధికారులు స్పందించారు. గురువారం రెండు ఎక్స్‌కవేటర్లు, మూడు ట్రాక్టర్ల సాయంతో ఆ చెత్తను వెనుకవైపునకు తరలిస్తున్నారు. దీనిపై ఎంపీడీవో శేఖర్‌నాయక్ మాట్లాడుతూ పంచాయతీకి చెందిన ట్రాక్టర్ ద్వారా రోడ్డుపై చెత్తవేయడంపై చర్యలు తీసుకున్నామన్నారు. అయితే కొన్ని పరిశ్రమలు, హోటళ్లు, అపార్ట్‌మెంట్‌లు చెత్తను రాత్రి సమయాలలో ఇక్కడ పడవేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీంతో ఇక్కడ నిఘా పెడుతున్నామన్నారు. మొదటిసారి చెత్తవేస్తూ పట్టుబడితే రూ.50వేల వరకు జరిమాన విధిస్తామని, రెండోసారి పట్టుబడితే రూ.లక్ష వరకు జరిమాన విధిస్తామని స్పష్టం చేశారు. మూడోసారి పట్టుబడితే వాహనాన్ని సీజ్‌చేస్తామని హెచ్చరించారు. ఇక్కడ చెత్తవేయకుండా అందరూ సహకరించాలని ఆయన కోరారు.

రైతును రాజులా చూడాలన్నదే ఎన్డీఏ లక్ష్యం


రైతులకు కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

చిల్లకూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రతిరైతును రాజులా చూడాలన్నదే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని బూదనం గ్రామంలో రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా రైతుల ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతుల సాగుకు పెట్టుబడిని ప్రతిఏడాదీ మూడు విడతల్లో నగదును అందజేస్తూ తోడ్పాటు అందిస్తోందన్నారు. ఇప్పటికే రెండు విడతల్లో రైతుల ఖాతాల్లో నగదును జమ చేశామన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు సీఎం చంద్రబాబు అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దువ్వూరు రాజ శేఖర్‌రెడ్డి, రామచంద్రారావు, గుండాల లీలావతి, కోట సతీష్‌యాదవ్, చిట్టేటి కీర వాణి, పెనుబోలు జానకిరామిరెడ్డి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో ఆరోగ్యం


రైతులకు అవహన కల్పిస్తున్న ఏడీఏ నాగార్జునసాగర్

పెళ్లకూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సాగులో రసాయనక ఎరువుల వినియోగంతో జీవరాశులు నశించి పోవడమే కాకుండా, పర్యావరణం కలుషితమై ఆహార పదార్థాలు విషతుల్యం అవ్వడంతో ప్రజలు అనేకరోగాల బారిన పడుతారని నాయుడుపేట వ్యవసాయశాఖ ఏడీఏ నాగార్జునసాగర్ అన్నారు. గురువారం మండలంలోని కొత్తూరు గ్రామంలో ఏడీఏ నాగార్జునసాగర్, మండల వ్యవసాయాధికారి విజయభారతి నానో యూరియాను వినియోగించేలా రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా రైతుల్లో మార్పు రావాలని పేర్కొన్నారు. 500 ఎంల్ నానో యూరియా బాటిల్ ఒక 45 కిలోల యూరియా బస్తాతో సమానమన్నారు. నానో యూరియా వినియోగంతో పెట్టుబడులు తగ్గి రైతులకు ఆశించిన స్థాయిలో దిగుబడి వస్తుందన్నారు. ముఖ్యంగా వరి సాగులో వస్తున్న శాస్త్రీయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు

రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

● ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ


మహిళా రైతుకు కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

తడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రైతుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. శుక్రవారం సాయంత్రం మండల పరిధిలోని చేనిగుంట గ్రామంలో రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఆమె చేపట్టారు. రైతుల వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. ఎప్పటికప్పుడు పెట్టుబడి సాయం 20వేలు అందజేస్తోందన్నారు. యూరియా, ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. రైతులు తమ ధాన్యాన్ని విక్రయించిన రెండు రోజుల్లోనే ప్రభుత్వం నగదు జమ చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు బెస్త కార్పొరేషన్ చైర్మన్ బొమ్మన శ్రీధర్, పీఏసీఎస్ చైర్మన్ వేనాటి శ్రీకాంత్‌రెడ్డి, టీడీపీ నాయకులు మురళీరెడ్డి, పళణి, సుదర్శన్, నీలకంఠం, సుధాకర్, జయపాల్, బీజేపీ నాయకులు తేజారెడ్డి, కృష్ణమూర్తి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు ప్రజాదర్బార్

నాయుడుపేట టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నాయుడుపేట తహసీల్దారు కార్యాలయ ప్రాంగణంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అధ్యక్షతన శుక్రవారం ఉదయం 11 గంటలకు ప్రజా దర్బార్‌ను నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు సన్నారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని వివరించారు. ఈ అర్జీలో ఆధార్‌కార్డు, ఫోన్ నెంబరు, సంబంధిత పత్రాలను జతచేసి ఇవ్వాలన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ఉండాలి


ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న సూపరిటెండెంట్ డాక్టర్ అమర్‌నాథ్

నాయుడుపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రాణాంతకమైన ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని నాయుడుపేట సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ అమర్‌నాథ్ అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం నవజీవన్ ఆర్గనైజేషన్ ఐఈసీ స్టాల్ ద్వారా ప్రజలకు ఎయిడ్స్, లక్షణాలు, వ్యాధికి కారణాలు, నిరోధక జాగ్రత్తల గురించి వివరించారు. డ్రగ్స్ వాడకంవల్ల కలిగే ఇబ్బందులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నవజీవన్ ప్రాజెక్టు మేనేజర్ బాలాజీరాజు, ప్రోహిబిషన్ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ భాస్కర్‌రాజు ఉన్నారు.

డీవీసత్రంలో నెలవల జన్మదిన వేడుకలు


కేక్ కట్‌చేస్తున్న టీడీపీ నాయకులు


దొరవారిసత్రం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం జన్మదిన వేడుకలను గురువారం టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల కార్యాలయం ఎదుట కేక్ కట్ చేశారు. అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పార్థసారధి, వంకా సుధాకర్, రమణయ్య, సొసైటీ డైరెక్టర్ విజయ్‌కుమార్, ఉదయ్‌కుమార్, గోపాల్‌రెడ్డి, మునిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

గూడూరు యువకుడు హైదరాబాద్‌లో మృతి


ఆకాష్ (ఫైల్‌ఫొటో)

గూడూరు అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): హైదరా బాదులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గూడూరు ప్రాంతానికి చెందిన యువకుడు మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు... స్థానిక తిలక్‌నగర్‌కు చెందిన ఆకాష్ (25) హైదరాబాదులో ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వారం రోజుల క్రితం హైదరా బాదులో ఆకాష్ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్సపొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులు గురువారం గూడూరుకు తీసుకు వచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. తిలక్ నగర్‌లో విషాద ఛాయలు అలముకున్నాయి.

గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా వివక్ష : సీపీఐ


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి

బాలాయపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా వివక్ష , అసమానతలు కొనసాగుతున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి అన్నారు. గురువారం మండలంలోని హస్తకావేరి గ్రామంలోపార్టీ సభ్యుల క్షేత్రస్థాయి రాజకీయ సైద్ధాంతిక శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పేదల సంక్షేమం పట్టడం లేదన్నారు. కార్పొరేట్లకు సేవ చేయడ మే ధ్యేయంగా పాలకులు పనిచేస్తున్నారని విమర్శించారు. సీపీఐ తొలి నుంచి రైతులు, విద్యార్థులు, పేదల పక్షాన పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గ అధ్యక్షులు బాలక్రిష్ణ, మండల అధ్యక్షులు మునిక్రిష్ణారెడ్డి, బలరామ నాయుడు, మస్తానయ్య, హేమచంద్ర పాల్గొన్నారు.